www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 24 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ చైత్ర శుద్ధ త్రయోదశి
03-09 ఏప్రిల్ 2023
వెల : ₹15/-



## నోటి తీటకు ‘ఇంటిపేరు’




## ప్రాణం పోసిన ప్రతిపక్షాలు


జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# సుగంధాల ఇంద్రధనుస్సులు

పూలు విరియని పుడమిని ఊహించలేం. సృష్టిని మరింత శోభాయమానం చేసినవి విరులే. ఆ సంగతి శ్రీనగర్‌లోని ఇందిరాగాంధీ తులిప్ వనాన్ని చూస్తే మరుక్షణం అర్థమవుతుంది. అందచందాల దాల్ సరస్సుకీ జబర్వాన్ కొండలకీ నడుమ ఉన్న ఈ మహాద్భుత రంగుల ప్రపంచం ఇటీవలనే పర్యాటకుల కోసం ద్వారాలు తెరిచింది. ముప్పయ్ హెక్టార్లలో అంటే దాదాపు డబ్బయ్ ఎకరాలలో పరుచుకుని ఉన్న ఈ పూలతివాచీ మీద **16** లక్షల తులిప్ రకాలు  కనువిందు చేస్తాయి. ఇవన్నీ **68** జాతులకు చెందిన అద్భుతాలు. నిజంగానే ఈ వనం, ఇక్కడి తులిప్ పుష్పాలు వీక్షకులను వేరే రంగుల ప్రపంచంలోకి తీసుకుపోతాయని దీని ఇన్‌చార్జ్ ఇనాం ఉల్ రహమాన్ చెప్పారు. ప్రపంచంలోని రంగులన్నీ ఇక్కడే ఉన్నాయా అని అనిపించే ఈ వనాన్ని ఈ రూపానికి తీసుకురావడానికి దాదాపు వందమంది తోటపని నిపుణులు **30** రోజుల పాటు శ్రమించారు. ఈ పూల పెంపకానికి **20** సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత మాత్రమే ఉండాలి. నెదర్లాండ్‌లోని కుకెన్‌హాఫ్ అనే ప్రాంతంలో ఉన్న తులిప్ వనం ప్రపంచంలోనే అతి పెద్దది. అక్కడ నుంచి మన శ్రీనగర్ తులిప్ వనాన్ని చూడడానికి సందర్శకులు వచ్చారు. ఆర్టికల్ **370** ఎత్తివేసిన తరువాత ఈ తులిప్ వనానికి కూడా మరింత వికసించే అవకాశం వచ్చింది. **2020**లో ఈ వనాన్ని **3.60** లక్షల మంది సందర్శించారు. ఈసారి తులిప్ వనం ముందే పూయడంతో మామూలు కంటే కాస్త ముందే పర్యాటకులను ఆహ్వానించింది.  **2007**లోనే గులాం నబీ ఆజాద్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తులిప్ వనం రూపుదిద్దుకుంది. నిజమే, **370** అధికరణం కశ్మీర్ లోయకు పట్టిన చీడ. అది తొలగిపోయింది.






ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..

చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో

ఇపుడు జాగృతి వారపత్రిక

మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

రండి.. జాతీయభావాల వేదిక

జాగృతి చందాదారులుగా చేరుదాం! చేర్పిద్దాం!!

**పాఠకుల విన్నపం మేరకు**

**జాగృతి చందా పెంపు ముందు ప్రకటించినట్లు**

**2023 ఏప్రిల్ 1 నుండి కాకుండా 2023 జూన్ 1 నుండి**

**అమలులోకి వస్తుంది. కనుక ఏప్రిల్, మే మాసాలలో**

**జాగృతి చందా కట్టేవారికి పాత రేట్లే**

**(1 సం. రూ. 650/-, 5 సం.ల రూ. 3000/-) వర్తిస్తాయి.**

# గో సేవా విభాగం

## గో విజ్ఞాన పరీక్ష - 2023



భారతీయ గోవుల వైజ్ఞానిక విశేషాలు, ప్రత్యేకతలు, ధార్మిక, వైదిక విజ్ఞానము, ఆరోగ్యం తదితర విషయములపై ప్రభావం, ప్రపంచంలో నేటి ఆవశ్యకతల గురించి తెలుసుకొనుటకై ఈ పరీక్షలో భాగస్వాములు కండి!

**అర్హతలు :**

* మాధ్యమిక తరగతుల నుండి విశ్వవిద్యాలయాల వరకు అందరు విద్యార్థులు, యువకులు, ప్రౌఢులు, మహిళలు, ఉద్యోగస్తులు అందరూ రాయవచ్చును.
* భారత్ మరియు విదేశాలలోని వారు పాల్గొనవచ్చును.
* తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో – ఆన్‌లైన్ పరీక్ష రాయవచ్చును.

**పరీక్ష తేదీలు** – **6 ఏప్రిల్ 2023 నుండి 12 ఏప్రిల్ 2023 వరకు**

ఉత్తీర్ణులైనవారికి ప్రశంసాపత్రం లభించును.

మరిన్ని వివరములకై http://gouvigyan.in/

భవదీయులు

గోగూరి నాగేందర్‌రెడ్డి, సంయోజక్,

గోసేవా విభాగము, తెలంగాణ

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి అసోసియేట్ ఎడిటర్

కె. హరీష్ సబ్ ఎడిటర్ 9959991304

డిజైనర్ : సిహెచ్. కుమార్

ఆ సందర్భంలో, ఆ క్షణంలో వినాయక్ దామోదర్ సావర్కర్ పేరును ప్రస్తావించవలసిన అవసరం వీసమెత్తయినా ఉందా? జరిగిన దానికి పశ్చాత్తాపం ప్రకటిస్తారా? అని అడిగినందుకు ఐదు దశాబ్దాల క్రితం కన్ను మూసిన ఒక స్వాతంత్ర్యం సమరయోధుడి పేరును ఇప్పుడు నిందాపూర్వకంగా ఉదహరించడం సంస్కారమనిపించుకుంటుందా? 'నా పేరు సావర్కర్ కాదు. నా పేరు గాంధీ. గాంధీ క్షమాపణలు అడగరు' ఇదీ కాంగ్రెస్ నాయకుడు, వాయినాడ్ ఎంపీ రాహుల్ గాంధీ పలికిన మాట. వాగ్ధోరణిలో అసందర్భం అనే మాటకు నిర్వచనంలా లేదా ఇది! తనకు జైలు శిక్ష విధిస్తూ సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పు మీద స్పందించమంటే ఆ మహనీయుడి పేరును రాహుల్ ఎందుకు తెచ్చినట్టు?

పంథా వేరు కావచ్చు. ఆయన చింతన భిన్నమైనది కావచ్చు. అది గాంధీజీకి నచ్చనిదే కావచ్చు. కానీ సావర్కర్ (1883-1966) భారత స్వాతంత్రోద్యమంలో సమున్నత యోధుడు. యోధానుయోధుడు. చరిత్ర పుస్తకాలలో సరైన చోటు దక్కకుండా చేసినంత మాత్రాన్నే కనుమరుగయ్యే జీవితం కాదాయనది. ఆయన 1911 నుంచి 1924 వరకు అండమాన్ జైలులో ఉన్నారు. అదెంత ఘోరమైన శిక్షో బరీంద్రనాథ్ ఘోష్ (అరవిందుల సోదరుడు) వంటి వారి కొన్ని ఆత్మకథల వల్ల తెలుస్తుంది. చదివితే కళ్ల నుంచి రక్తకన్నీరు ఉబుకుతుంది. ఆ అక్షరాలలో నిక్షిప్తమైన అనంతమైన బాధ వెంటాడుతుంది. లండన్ నుంచి తీసుకువచ్చి, అప్పీలుకు అవకాశం లేని, డిఫెన్స్ లేని విచారణ జరిపారు. కాలాపానీ అని పిలిచే సెల్యులార్ జైలులో కుక్కారు. అది జైలు కాదు, భారత స్వాతంత్ర్యేచ్ఛకు సిద్ధం చేసిన సమాధి. అక్కడ స్వాతంత్ర్య సమరయోధులను పశువులను చూసినట్టు చూశారు. పశువులను హింసించినట్టే హింసించారు. గానుగలకు కట్టి పశువుల్లా పనిచేయించారు. సరైన తిండి లేదు. కంటి నిండా నిద్ర లేదు. అండమాన్ జైలు శిక్ష కొందరికే పడేది. బ్రిటిష్ జాతి పగబట్టిన వారే వారంతా. ఆ కొందరిలో దాదాపు మరెవరికీ పడని శిక్ష సావర్కర్‌కు పడింది. రెండు

శాలివాహన 1945 శ్రీ శోభకృత్ చైత్ర శుద్ధ త్రయోదశి

### లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం

**నోటి తీటకు 'ఇంటిపేరు'**

6లో




ధారావాహిక నవల

**వరాహమిహిర**

- పాలంకి సత్య

20లో



ప్రత్యేక వ్యాసం

**'వసంత'రాయా! వందనం**

26లో

# జాగృతి

## సంపాదకీయం

జీవితకాలాల శిక్ష. అంటే యాభయ్ సంవత్సరాలు. విక్రమ్ సంపత్ వంటి చరిత్రకారులు సావర్కర్ క్షమాభిక్షకు విన్నపాలు పంపిన మాటను కాదనడం లేదు (కానీ సావర్కర్ మనుమడు రంజిత్ సావర్కర్ క్షమాభిక్ష కోరినట్టు రుజువు చెయ్యమని రాహుల్‌ను సవాలు చేశారు). ఆ ఒక్క విషయమే తరతరాల పాటు ఆయన్ను బోనులో నిలబెట్టి ఉంచే నేరం అవుతుందా అన్నదే ప్రశ్న. భారత్ జోడో యాత్రలో ఇంకొక అడుగు ముందుకు వేసి క్షమాభిక్ష కోరడమే కాదు, సావర్కర్ బ్రిటిష్ వారికి సహకరించారని, అందుకు పింఛను కూడా వచ్చిందని మహారాష్ట్రలోనే రాహుల్ ఆరోపించడం ఊహకు అందని తెంపరితనం.

## సావర్కర్ ప్రస్తావన ఎందుకు?

అది జాత్యహంకార బ్రిటిష్ ప్రభుత్వం వేసిన శిక్ష. వలస పాలకుల రాక్షస ప్రవృత్తికి తిరుగులేని నిదర్శనం. అసలు సావర్కర్ చేసిన నేరాలు (1909 చట్టాన్ని ధిక్కరించడం, నాసిక్ కలెక్టర్ జాక్సన్ హత్య కుట్ర, ఉద్రేకపూరిత ప్రసంగాలు) ఏమిటి? అందుకు రెండు జీవితకాలాల కారాగారం. ఇవే నేరాలకు ఇంత శిక్ష పడిన మరొక భారతీయుడు కనిపిస్తాడా? ఇది కక్ష సాధింపు. యాభయ్ ఏళ్ల శిక్ష ఏమిటసలు? అది అంతర్జాతీయ సమాజం ఎదుట ఫిర్యాదు ఉండగా కూడా బ్రిటిష్ ప్రభుత్వం ఆదరాబాదరా విచారించి వేసిన శిక్ష. విజ్ఞత, దేశంలోని నాటి పరిస్థితులు, ఆ కాలంలో నిండు చైతన్యం కలిగిన మనిషి అవసరం, జీవితం విలువ తెలిసిన వారు ఎవరైనా ఐదు దశాబ్దాలు కారాగారంలో ఉండిపోవాలని అనుకుంటారా? దేశ సేవాతత్పరతతోనే జైలుకు వెళ్లినవారు అలా అనుకోవలసిన అవసరం ఏమిటి? ఆ నేపథ్యంతో క్షమాభిక్షకు అర్జీలు పెట్టినందుకు ఒక మహనీయుడిని సదా అవమానించడమే పనిగా పెట్టుకున్న వ్యక్తినీ, దీనిని మౌనంగా భరిస్తున్న ఆయన పార్టీని ఏమనాలి? 'భాయి' అంటూ ఒక లేఖలో గాంధీజీ సంబోధించిన వ్యక్తి సావర్కర్. భారత గణనీయ పుత్రుడు అంటూ ఇందిరాగాంధీ గౌరవించిన వ్యక్తి వీర్ సావర్కర్. కానీ ఆ కాలం, ఆ పరిస్థితులు, ఆ పరిస్థితులలో ఒక సమరయోధుడి విజ్ఞాపనను ఆ కాలం వారు అర్థం చేసుకున్నట్టు వర్తమాన సమాజంలో బతుకుతున్న వ్యక్తి ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నారన్నదే ప్రశ్న. హక్కుల గురించి పరిపూర్ణమైన అవగాహన ఉన్న కాలంలో కూడా వలస పాలకులను క్షమాభిక్ష కోరాడంటూ రాహుల్ ఆ మహనీయుడి చరిత్ర మీద నిరంతరం బురద చల్లడం, సదా వేలెత్తి చూపడం అజ్ఞానానికి పరాకాష్ట. ఇది గతంలోని బాధితుల హక్కుల గురించి కూడా మాట్లాడుతున్న కాలమని రాహుల్‌కు తెలియదా?

కసబ్‌ను, యాకూబ్ మెమన్‌ను, నక్సలైట్లను క్షమించి వదిలిపెట్టాలని దేశంలో గగ్గోలు పెట్టే మూకలను అంటకాగే రాహుల్ గాంధీకి సావర్కర్ క్షమాభిక్ష కోరడం ఘోర తప్పిదంలా ఎందుకు కనిపిస్తున్నది? దీనికి మొదటి కారణం సావర్కర్ 'హిందుత్వ' ప్రబోధకుడు కావడమే అనుకోవాలి. ఇక్కడ మేం హిందుత్వ ప్రస్తావన తీసుకురావడం అప్రస్తుతం కాదని మనవి. సూరత్ కోర్టు తీర్పు గురించి స్పందిస్తూ రాహుల్ సోదరి ప్రియాంక మాటలు గుర్తు చేసుకోవాలి. నిరంతరం గాంధీ–నెహ్రూ వారసులమంటూ మమ్మల్ని విమర్శించేవారు, రాముడు అలా వారసత్వంగా అధికారంలోకి వచ్చినవారు కాదని అనగలరా? అని త్రేతాయుగాన్ని మోసుకొచ్చారు. నిజానికి తనకే కాదు, రాజకీయ ఖైదీలందరికీ క్షమాభిక్ష పెట్టడం న్యాయమని చెప్పినవారు సావర్కర్. ఆయన అండమాన్ వీడి వచ్చి విలాసవంతమైన జీవితం గడపలేదు. రత్నగిరి జిల్లాకు పరిమితమై గొప్ప సంఘసంస్కరణోద్యమాన్ని నిర్మించారు. 1942 తరువాత మరొకసారి ఉద్యమించారు కూడా. అయినా చౌకీదార్ చోర్ హై అన్న వ్యాఖ్యతో సాక్షాత్తు సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పిన వ్యక్తే క్షమాపణలు 'చెప్పదు' అంటూ గొంతు చించుకోవడమే పెద్ద దగా. ★

03 ఏప్రిల్ 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**పాపం - పుణ్యం**

– గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు





| | | | | | |
|---|---|---|---|---|---|
| విలువలతో కూడిన బోధనే శిశుమందిరాల లక్ష్యం (విద్య) | - | 14 | ప్రాణం పోసిన ప్రతిపక్షాలు (చర్చ) | - | 34 |
| క్రైస్తవంలోకి మారితే రిజర్వేషన్‌లా!? (వేదిక) | - | 16 | సప్తసముద్రాల ఈతలో మొనగాడు (క్రీడ) | - | 37 |
| ఈశాన్యంలో సంఘం సేవే కమలానికి త్రోవ (జాతీయం) | - | 23 | గగన సమరధీర శాలిజా (మహిళ) | - | 38 |
| కశ్మీర్‌లో శారదామాత పునర్దర్శనం (కొత్త వెలుగు) | - | 28 | ప్రేక్షకులకు 'దాస్ కా ధమ్కీ'! (సినిమా) | - | 43 |

# నోటి తీటకు

'నెహ్రూ అన్న ఇంటిపేరు మీరు ఎందుకు పెట్టుకోలేదు? భయమా?' ఇటీవల ముగిసిన పార్లమెంట్ సమావేశాలలో ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ అధినేతలను ఉద్దేశించి రాజ్యసభలో సంధించిన ప్రశ్న ఇది. నెహ్రూ సేవలను విస్మరిస్తూ, కొన్ని పథకాలకు ఆయన పేరును తొలగిస్తున్నారని పెద్దల సభలో కాంగ్రెస్ సభ్యులు రగడ సృష్టించినప్పుడు ప్రధాని ఆ ప్రశ్నతో నిలదీశారు. ఫిబ్రవరి 9న జరిగిన ఈ ఇంటిపేర్ల వివాదం నెలన్నర రోజులకే దేశ రాజకీయాలలో పెను మార్పునకు దారితీసింది. ఇటీవలి రాజకీయాలలో ఒక సంచలనంగా మిగిలింది. మోదీ అన్న ఇంటిపేరును ఘోరంగా అవమానించినందుకు ఆయనకు రెండేళ్లు జైలు శిక్ష పడింది. నాలుగేళ్ల నాటి ఈ పరువు నష్టం వ్యాజ్యం కారణంగానే రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కోల్పోయారు. ఇక్కడ ఒక సంగతి గుర్తు చేసుకోవాలి. ఫిబ్రవరి 14న వాయినాడ్‌లో ఒక సభలో మాట్లాడుతూ రాహుల్ ఇంటిపేరు తండ్రి నుంచే వస్తుందని మోదీకి తెలిసి ఉండదు అని సంప్రదాయాల పట్ల తనకు ఉన్న పరిజ్ఞానాన్ని ప్రదర్శించుకున్నారు. ఇంటిపేరుకు ఉన్న ప్రాధాన్యం, దానితో ఉన్న అనుబంధాలు, వారసత్వ విలువ గురించి ఇంత గొప్పగా తెలిసిన రాహుల్ గాంధీకి ఒక ఇంటి పేరు వారంతా దొంగలు అని వ్యాఖ్యానించడం ఎంత హీనాతి హీనమైన కుసంస్కారమో ఎందుకు తెలియలేదు?




మోదీ అనే ఇంటి పేరు మీద బురద చల్లి రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన నేపథ్యంలో విలువల వలువలన్నీ వదిలేసిన మూకలు రాజకీయ నాగరికతను రక్షించండంటూ ఊరేగింపునకు తెగబడిన వింత దృశ్యాన్ని ఈ దేశం వీక్షించవలసి వచ్చింది. 2019 నాటి సాధారణ ఎన్నికల ప్రచారంలో ఏప్రిల్ 13న కర్ణాటకలోని కోలార్ దగ్గర రాహుల్ ఎవరూ హర్షించని విధంగా ఒక ఇంటి పేరు మీద బురద చల్లారు. ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ గుజరాత్ శాసనసభ సభ్యుడు పూర్ణేశ్ మోదీ పరువు నష్టం దావా వేశారు. దీని మీదే సూరత్ న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి హెచ్‌హెచ్ వర్మ రాహుల్‌ను దోషిగా నిర్ధారించి రెండేళ్ల కారాగార వాస శిక్ష విధించారు. జస్టిస్ వర్మ ఈ శిక్ష అమలు కాకుండా నెల రోజులు తానే స్టే ఇచ్చారు.

'నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ అన్న ఇంటి పేరు ఎందుకుంది? దొంగలందరికీ మోదీ అనే ఇంటి పేరు ఎందుకు ఉంటుందో!' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీనికే సూరత్ కోర్టు ఈ శిక్ష విధించింది. ఈ సందర్భంగా కోర్టు చేసిన వ్యాఖ్యలు కూడా ఇలా మాట్లాడడం రాహుల్ గాంధీకి రివాజేనన్న ధ్వని వినిపిస్తుంది. ఆదానీ మీద తాను మాట్లాడితే కల్లోలం చెలరేగుతుంది కాబట్టే ఇలా ఆగమేఘాల మీద లోక్‌సభ సభ్యత్వానికి అనర్హత ప్రకటించారని రాహుల్ వ్యాఖ్యానించడమే వింతల్లో కల్లా వింత. ఇది ఆదాని గురించి మాట్లాడకుండా చేయడానికి కాదు, 2019 నాటి కేసులో వచ్చిన తీర్పు, దాని పర్యవసానాలని ఎంత చెప్పినా ఆయన బుర్రకు ఎక్కడం లేదు. తన సభ్యత్వం అనర్హత గురించి ఆయన గంటకు పైగా విలేకరులతో మాట్లాడారు. ఇందులో మళ్లీ కోర్టు ధిక్కారమే కనిపించింది. సత్యమే ఆయన దేవుడట. సత్యం, అహింసలే ఆయన మతమట. వాటిని చేరడానికి అహింసే మార్గమట. 'రాహుల్ తాను చేసే ప్రకటన విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సుప్రీం కోర్టు గతంలోనే సూచించింది. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు లేదు' అంటూ సూరత్ కోర్టు వ్యాఖ్యానించింది. సూరత్ కోర్టు చెప్పినా ఈయనలో మార్పు రాలేదని ఇప్పుడు అనిపిస్తుంది. రాహుల్ ఇప్పటికీ బరితెగించి మాట్లాడుతున్నారు. ఆయన పార్టీ దేశంలో అల్లర్లకు సిద్ధమైంది. రాహుల్ ఒక ఇంటి పేరు మీద తీవ్ర వ్యాఖ్యలు చేసి క్రిమినల్ నేరానికి పాల్పడ్డారని ఆ కోర్టు నిర్ధారించినా, దేశమంతటా సంకల్ప సత్యాగ్రహం పేరుతో కాంగ్రెస్ ప్రదర్శనలు నిర్వహించింది. కొన్నిచోట్ల నరేంద్ర మోదీ, అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు.

తీర్పు వచ్చిన మరుక్షణమే రాహుల్‌ను అనర్హునిగా ప్రకటించాలా అంటూ నాటు కమ్యూనిస్టులు, కాంగ్రెస్, ఇతర విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఇదీ ఈ దేశ విపక్షాల న్యాయ పరిజ్ఞానం. ఇదంతా ఆదాని గురించి మాట్లాడదానికి చేసినదేనట. అలా అయితే ఈ నేరంలో మొదటి ముద్దాయి మళ్లీ రాహుల్ అవుతారు. ఎందుకంటే చట్టసభ సభ్యుని మీద క్రిమినల్ నేరం మీద శిక్ష పడితే తక్షణం సభ్యత్వం రద్దు కావాలని పాత చట్టమే చెబుతోంది. అది రాజ్యాంగకర్తల నిర్ణయం. సవాలక్ష అవినీతి కార్యకలాపాలలో మునిగిన లాలూ ప్రసాద్ యాదవ్ లోక్‌సభ సభ్యత్వం ఇలాగే రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనితో నాటి యూపీఏ ప్రభుత్వం అప్పీలు చేసుకోవడానికి పాత చట్టం ఇచ్చిన నెల గడువును, మూడు నెలలకు పెంచి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. అంటే అప్పీలు దాకా సభ్యత్వం అనర్హత పరిధిలోకి రాదు. అలా సభ్యుడుకి కొనసాగే అవకాశం వస్తుంది. సరిగ్గా ఆ ఆర్డినెన్స్‌నే, అంటే తన పార్టీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌నే రాహుల్ గాంధీ విలేకరుల సమావేశంలో హఠాత్తుగా ప్రత్యక్షమై చించివేశారు. ఆ ఆర్డినెన్స్‌ను యూపీఏ అమలు చేయలేదు. ఇప్పుడు అదే రాహుల్ పదవికి ఎసరు పెట్టింది. ఆ కేసు వివరాలలోకి కూడా ఒకసారి వెళ్లాలి.

1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 8(3) నిబంధన ప్రకారం ఒక చట్టసభ సభ్యుని మీద కేసు రుజువై రెండేళ్లు శిక్ష పడితే అతడి సభ్యత్వం పోతుంది. కానీ అదే సెక్షన్‌లోని 8(4) మాత్రం సభ్యుడి మీద అనర్హత అనేది శిక్ష పడిన రోజునుంచి మూడు మాసాల తరువాత చెల్లుబాటు అవుతుందని చెబుతోంది. ఆ కాలంలో చట్టసభ సభ్యుడు తనకు పడిన శిక్ష మీద

# ‘ఇంటిపేరు’





పై కోర్టుకు అప్పీలుకు వెళ్లవచ్చు. కానీ ఈ వెసులుబాటు రాజ్యాంగ విరుద్ధమని నిర్ధారించిన సుప్రీం కోర్టు 2013లో కొట్టివేసింది. ఇదే లిలీ థామస్ వర్సెస్ భారత ప్రభుత్వం కేసు. ఈ 8(4)ను సవాలు చేస్తూ 2005లో కేరళ న్యాయవాది లిలీ థామస్, లోక్ ప్రహరీ అనే స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ శుక్లా సుప్రీంను ఆశ్రయించారు. లిలీ థామస్ భారతదేశంలోనే న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్న (1959) తొలి మహిళ. నేరం రుజువైన చట్టసభ్యులను అప్పీలు పేరుతో ఈ సెక్షన్ రక్షణ కల్పిస్తున్నదని ఆ ఇద్దరి వాదన. కేసు పెండింగ్‌లో ఉన్నది కాబట్టి అనర్హత ప్రశ్న ఉత్పన్నం కాదు. ఆ సెక్షన్‌కు ఉప సెక్షన్‌ను జత చేసే హక్కు పార్లమెంటుకు లేదని జస్టిస్ ఏకే పట్నాయక్, జస్టిస్ ఎస్‌జే ముఖోపాధ్యాయలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం జూలై 10, 2013న తీర్పు చెప్పింది.

లోక్‌సభ సెక్రటరీ రాహుల్ అనర్హతను ప్రకటించగానే దీనిని తొందరపాటు అని కొందరు వ్యాఖ్యానించారు. ఇంత తొందర ఎందుకు? అప్పీలు వరకు ఆగవచ్చు కదా! అని ఒక పెద్దమనిషి వ్యాఖ్యానించడం అంతా చూశాం. వీటన్నిటి సారాంశం ఒక్కటే. ప్రజాస్వామ్యం ఏమై పోవాలి అన్న ప్రశ్న. అంటే ఒక ఉప ఎన్నికను నివారించడానికి సూరత్ కోర్టు తీర్పు మొదలు వెనక్కి వెళితే లిలీ థామస్ కేసు, సుప్రీం కోర్టు తీర్పునకు విలువ లేకుండా చేయడమేనా? వాయినాడ్‌లో ఒక ఉప ఎన్నికను నివారించడానికి ఇంతటి రాజ్యాంగ మథనాన్ని అటకెక్కించాలా? గంటసేపు విలేకరులతో మాట్లాడిన రాహుల్ తన వ్యాఖ్య గురించి ఒక్కసారైనా ప్రస్తావించలేదు. అంటే సూరత్ కోర్టు తీర్పును ఆయన గౌరవించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని బట్టి మేధావుల రాజ్యాంగ పరిజ్ఞానం మారిపోతుందా? చట్టం ముందు అంతా సమానమేనన్న సూత్రాన్ని అవసరమైతే పక్కన పెట్టాలి (ప్రధానంగా గాంధీ–నెహ్రూ కుటుంబ సభ్యుల విషయంలో) అనే వీరంతా టీవీ చానళ్లలో, పత్రికలలో హోరెత్తిస్తున్నారు. కోర్టు తీర్పు, లోక్‌సభ కార్యదర్శి వీరంతా చేసినది సాంకేతికంగా సరైనదే. కానీ దానిని అంత కఠినంగా అమలు చేయాలా అనడం ఏమిటి? కోర్టులు చెప్పినది సరైనదే అంటే రాజ్యాంగం చెప్పినదే కదా! దానిని అమలు చేయడంలో మళ్లీ ముందు వెనుకలు ఏమిటి? మనిషికి మనిషికి తేడా ఏమిటి? ఇలాంటి కేసుల మీద ఇలాంటి తీర్పులు కోర్టులు ఇచ్చుకుంటూ పోతే పార్లమెంటు, శాసనసభలు, శాసన మండళ్లు అన్నీ ఖాళీ అవుతాయని మరొక నేత వ్యాఖ్య. ఏ మాత్రం మర్యాద లేకుండా మాట్లాడే కొందరు రాజకీయ నాయకులు ధోరణి మార్చుకోవాలని చెప్పకుండా, రాజ్యాంగం మేరకు తీర్పులు ఇచ్చే కోర్టులను పరోక్షంగా తప్పు పట్టడంలోని ఔచిత్యం ఏమిటో ఎవరికీ అర్థం కాదు. రాహుల్ అనర్హత వ్యవహారాన్ని పరిశీలిస్తున్నామని ఐక్యరాజ్య సమితి ప్రకటించడం ఏమిటో అసలే అర్థం కాదు. రాహుల్ ఒక విదూషకుని కంటే తక్కువేమీ కాదు అన్న బరాక్ ఒబామా (అమెరికా మాజీ అధ్యక్షుడు) వ్యాఖ్య మరీ వికృతం. రాహుల్ చెప్పినట్టు భారతదేశంలో ప్రజాస్వామ్యం లుప్తమైపోతున్నదన్న మాట నిజమని అనుకోవలసి వస్తున్నదని ఆయన అన్నారు. ఇలా కూడా ఆయన విదేశీయుల జోక్యాన్ని తెస్తున్నారు.

తమ కుటుంబానికి ప్రత్యేక హక్కులు ఉండాలని రాహుల్, ఆయన సోదరి ప్రియాంక పరోక్షంగా మాట్లాడుతున్నారు. ఔను ఉండాలంటూ పార్టీ కార్యకర్తల చేత ప్రత్యక్షంగా చెప్పిస్తున్నారు. కోర్టు తీర్పుల మీద వీధులలో నిరసనలు ప్రకటించే సంస్కృతి ప్రజాస్వామ్యానికి చేటు. కానీ మేమే ప్రజాస్వామ్య రక్షకులమని కాంగ్రెస్ వారు మాట్లాడుతున్నారు. 1975లో ఇందిర ఎన్నికకు వ్యతిరేకంగా అలహాబాద్ హైకోర్టు తీర్పు ప్రకటించిన తరువాత కూడా కాంగ్రెస్ పార్టీ సరిగ్గా ఇవే విన్యాసాలు చేసింది. కాబట్టి ప్రజాస్వామ్యం మీద కాంగ్రెస్ పార్టీ ప్రకటించే ప్రేమ ఒక కపట నాటకం. దానిలో చాలా ప్రతిపక్షాలు కూడా పాత్రధారులవుతున్నాయి. ఇది భారత ప్రజాస్వామ్యానికి కొత్త బెడద. ★





‘భారతదేశం తన ప్రజాస్వామిక లక్షణాన్ని పూర్తిగా కోల్పోయినదంటే అందుకు కారణమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్). అది మత ఛాందసవాద, ఫాసిస్ట్ సంస్థ. అన్ని భారతీయ వ్యవస్థలనీ ఆక్రమించింది.’ ఈ సంవత్సరం మార్చి 6వ తేదీన లండన్‌లోని ఛాతమ్ హౌస్ మేధావుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన తీవ్ర ఆరోపణ ఇది. ఆర్ఎస్ఎస్ పత్రికారంగాన్ని, న్యాయవ్యవస్థను, పార్లమెంట్‌ను, ఎన్నికల సంఘాన్ని కబ్జా చేసిందని కూడా ఆయన విశ్లేషించారు. ఆర్ఎస్ఎస్‌ను ఫాసిస్ట్ సంస్థ అంటూ విమర్శించడం రాహుల్‌తోనే మొదలు కాలేదు. గతంలో కమ్యూనిస్టుల, ఉదారవాదుల నోళ్లలో చిరకాలం నానిన ఎంగిలి ఆరోపణే. అదే పట్టుకుని రాహుల్ వేలాడుతున్నారు. భారత ప్రజాస్వామ్యం మీద పాశవిక దాడి జరుగుతోందని ఆయన విదేశీ గడ్డ మీద నుంచి ఆరోపించారు.

ఛాతమ్ హౌస్ సమావేశంలోనే రాహుల్ ఇంకాస్త తెంపరితనమే చూపించారు. ఆర్ఎస్ఎస్ నిర్మాణమే ‘ముస్లిం బ్రదర్‌హుడ్’ విధానంలో ఉంటుందని కూడా సెలవిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన అగ్నివీర్ పథకం సైన్యం ఆలోచన కాదు, అది ఆర్ఎస్ఎస్ నుంచి, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి వచ్చిందని ఫిబ్రవరి 7, 2023న బడ్జెట్ సమావేశాలలో రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ విషయం ఆయనకు సీనియర్ అధికారులే చెప్పారట.

ఆర్ఎస్ఎస్ సభ్యులంటే 21వ శతాబ్దపు కౌరవులని భారత్ జోడో యాత్ర సందర్భంగా ఒక వీధి సమావేశంలో రాహుల్ జనవరి 9, 2023న ఆరోపించారు. హరియాణాలోని అంబాలాలో మాట్లాడుతూ, కౌరవులు అంటే ఎవరు? మొదట మీకు 21వ శతాబ్దపు కౌరవుల గురించి చెబుతాను. వాళ్లు ఎవరో కాదు, ఖాకీ నిక్కరు వేసుకుని, చేతిలో కర్రతో ఉండేవారే. వాళ్లు శాఖలు నడుపుతూ ఉంటారు. భారతదేశంలోని ఇద్దరు ముగ్గురు బిలియనీర్లు కూడా వారి వెనుక ఉన్నారు అని రాహుల్ ఆరోపించారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో జనవరి 17, 2023న భారత్ జోడో యాత్రలోనే ముందు ఒకసారి దేశంలోని వ్యవస్థలను (మీడియా, పార్లమెంట్ వగైరా) ఆర్ఎస్ఎస్ ఆక్రమించుకుందని చెప్పారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెబితే జనం నమ్ముతారని ఆయన గట్టి నమ్మకం కాబోలు.

రాహుల్‌లో ఒక కొంటె కోనంగి కూడా ఉన్నాడని లోకానికి తెలియాలి కదా! బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను గురువులుగా భావిస్తారట ఆయన. అదెందుకో డిసెంబర్ 31, 2022న

# అబద్ధాల పుట్ట, బొంకుల గుట్ట

రాహుల్ గాంధీ నోటివాటం లేదా నోటి దురద ఎంతటిదో సూరత్ కోర్టులో తేలిపోయింది. ఆ నాలుక తీట మీద రావలసిన తీర్పులు మరికొన్ని కూడా ఇంకా మిగిలి ఉన్నాయన్న సంగతి విస్మరించరాదు. సూరత్ కోర్టు వారు రెండేళ్లు జైలు శిక్ష విధించారు. అలాగే ఆ శిక్ష వెంటనే అమలు కాకుండా బెయిల్ కూడా ఇచ్చారు. రాహుల్ దేశం నలుమూలలా ఉన్న న్యాయస్థానాలలో ఇలాంటి బెయిల్ తీసుకుని మనుగడ సాగిస్తున్నారు. భారతీయులకు సత్యం, అహింస, రాజనీతి వంటివి ఎడాపెడా బోధిస్తున్నారు. ఆయన మీద దాదాపు 12 కేసులు ఉన్నాయి. వీటిలో ఎక్కువ నోటివాటానికి చెందినవి. నిజానికి ఆయనకి 2019 బెయిళ్ల నామ సంవత్సరమే. పట్నాకు చెందిన ఒక వ్యక్తి వేసిన పరువు నష్టం కేసులో బెయిల్ తీసుకున్నారు రాహుల్. పెద్ద నోట్ల రద్దు సమయంలో అక్రమాలకు పాల్పడ్డారంటూ తమ మీద ఆరోపణలు చేసినందుకు అహమ్మదాబాద్ సహకార బ్యాంక్ పరువు నష్టం దావా వేసింది. ఈ కేసులో కూడా బెయిల్ పొందారు. ఒక స్వయంసేవక్ వేసిన పరువునష్టం కేసులో ముంబాయి కోర్టు నుంచి బెయిల్ తీసుకున్నారు రాహుల్. గౌరీ లంకేశ్‌ను హత్య చేసిన వారు ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాల వారే అన్నందుకు రాహుల్ బోనెక్కారు. గాంధీజీని ఆర్ఎస్ఎస్ హత్య చేసిందని నేరుగా ఆరోపించి భివాండీ (మహారాష్ట్ర) కోర్టులో నిలబడ్డారాయన. 2016 నాటి ఈ కేసులోను బెయిల్ తీసుకున్నారు.

తాను సావర్కర్‌ను కానని, గాంధీననీ, గాంధీ ఏనాడూ వెనకడుగు వేసి క్షమాపణలు చెప్పడని రాహుల్ నిన్న మొన్న డంబాలు పలికారు. కోర్టు శిక్షించిన తరువాత కూడా రాహుల్ స్వాతంత్ర్య సమరయోధులను విడిచిపెట్టకుండా అవమానించడం జాతి చేసుకున్న దౌర్భాగ్యం. ఇక్కడ సావర్కర్ పేరు ఎందుకు? అయినా తాను ఏనాడూ క్షమాపణలు కోరలేదని రాహుల్ చెప్పడం ఒట్టి అబద్ధం. పెద్ద దగా. నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా 2019 ఎన్నికల ప్రచారమంతా రాహుల్

ఢిల్లీలో జరిగిన విలేకరులు సమావేశంలో చెప్పారు. మా మీద ఆర్‌ఎస్‌ఎస్‌, బీజేపీ దాడి ఇంకా తీవ్రం కావాలని కోరుకుంటున్నాను. అందువల్ల కాంగ్రెస్‌లో సైద్ధాంతిక పరమైన చైతన్యం పెరుగుతుంది. సైద్ధాంతికంగా సుస్థిరంగా ఎలా ఉండాలో వాళ్లని చూసే నేను నేర్చుకుంటున్నాను. అందుకే వాళ్లని గురువులుగా భావిస్తాను అన్నారాయన.

తన భారత్‌ జోడో యాత్ర భయానికి వ్యతిరేకంగా చేపట్టిన యాత్ర అని డిసెంబర్‌ 24, 2022న ఢిల్లీలో ప్రవేశించినప్పుడు రాహుల్‌ అన్నారు. ఇంకా అసహనం, నిరుద్యోగ సమస్యలకు వ్యతిరేకంగా కూడా ఈ యాత్ర చేపట్టినట్టు చెప్పుకున్నారు. ఈ భయాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌ సృష్టించి, దానిని అసహనంగా హల్లా బోల్‌ పేరుతో ప్రదర్శన జరిగింది. అక్కడ రాహుల్‌ గాంధీ రెచ్చిపోయారు. 'బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ దేశాన్ని విభజిస్తాయి. వాళ్లు భయోత్పాతాలను సృష్టించి ప్రజల మధ్య చీలికలు తెస్తారు. భయోత్పాతాలను సృష్టించడం ద్వారా లబ్ధి పొందేదెవరు? పేదలా? రైతులా? చిరు వ్యాపారులా? అసలు నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి ఎవరు లబ్ధి పొందారు? ఈ భయోత్పాతాల సృష్టి వల్ల ఇద్దరంటే ఇద్దరు కార్పొరేట్‌ ప్రముఖులు బాగుపడ్డారు' అని చెప్పారు రాహుల్‌.

ఆర్‌ఎస్‌ఎస్‌లో ఒక్క మహిళ కూడా నాయకత్వ స్థానంలో లేరని జనవరి 1, 2018న షిల్లాంగ్‌లో జరిగిన సమావేశంలో రాహుల్‌ ఆరోపించారు.

# ఆర్‌ఎస్‌ఎస్‌ ఆగర్భ శత్రువు

**జాతీయవాదమంటే ఆయనకు చిన్నచూపు. హిందుత్వ అంటే అలుసు. ఆ రెండే ఊపిరిగా మనుగడ సాగించే సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌. అందుకే ఏ అవకాశం వచ్చినా, లేదా తానే సృష్టించుకుని మరీ ఆర్‌ఎస్‌ఎస్‌ను ఆడిపోసుకుంటూ ఉంటారాయన. జార్జి సోరెస్‌ వంటి భారత వ్యతిరేకుల భాషే ఎప్పుడూ ఆయన నోట వినిపిస్తుంది. ఆయనే రాహుల్‌ గాంధీ. దేశంలో..విదేశాలలో.. నోరు విప్పితే చాలు సంఘ్‌ను ఆడిపోసుకోవడం మరువరు. అందుకు ఇవి కొన్ని దాఖలాలు.**

మార్చివేస్తున్నదట. మీ అసహనం అనే బజారులో ప్రేమ అనే దుకాణం తెరవడానికే మేం ఇక్కడ ఉన్నామంటూ ఢిల్లీ వాసుల ఎదుట కవిత్వం వెలగబెట్టే ప్రయత్నం కూడా చేశారాయన.

ఆర్‌ఎస్‌ఎస్‌ వారు మహిళలను తమ సంస్థలోకి రానీయరు అని రాజస్తాన్‌లోని దౌసాలో మాట్లాడుతూ డిసెంబర్‌ 14, 2022న (భారత్‌ జోడో యాత్ర) రాహుల్‌ భాష్యం చెప్పారు. ఆ సంస్థలో మహిళలకు స్థానంలో లేదు. వారు మహిళలను అణచివేస్తారు అని కూడా సెలవిచ్చారు.

సెప్టెంబర్‌ 5, 2022న ఢిల్లీలోనే రామ్‌లీలా మైదాన్‌లో మేహంగి పర్‌ ఆర్‌ఎస్‌ఎస్‌ మహిళలను సాధికారత నుంచి తప్పిస్తుందని కూడా అన్నారు. ఇక్కడే లోకోత్తరమైన ఉదాహరణ ఇచ్చారు రాహుల్‌. ఫొటోలలో మహాత్మా గాంధీ సదా మహిళలు అటూ ఇటూ ఉన్నట్టు కనిపిస్తుంది. మరి ఆర్‌ఎస్‌ఎస్‌ సర్‌ సంఘచాలక్‌ మోహన్‌ భాగవత్‌! ఎప్పుడూ అటూ ఇటూ మగవారితో తప్ప కనిపించరు అంటూ అపారమైన అజ్ఞానాన్ని ఒలకబోశారు.

గుజరాత్‌ పర్యటనలో తన కాన్వాయ్‌ మీద బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తలు దాడికి దిగారని ఆగస్ట్‌ 5, 2017న ఆరోపించారు రాహుల్‌. ఆ రెండు సంస్థలతోపాటు మోదీ రాజకీయాలు కూడా ఇలాగే ఉంటాయని వాక్రుచ్చారు.

ఉపయోగించుకున్న చౌకీదార్‌ చోర్‌ హై నినాదంతో పరువునష్టం కేసు ఎదుర్కొని సుప్రీంకోర్టు ఎదుట సాష్టాంగపడ్డారు. క్షమాపణలు వేడారు. లెంపలు వేసుకున్నారు. గుజరాత్‌ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా మోదీ తనను తాను వ్యవస్థకు చౌకీదార్‌నని చెప్పుకునేవారు. దానిని కాంగ్రెస్‌ ప్రబుద్ధులు ఇలా హేళన చేశారు.

'గలి గలి మే షోర్‌ హై, దేశ్‌కా చౌకీదార్‌ చోర్‌హై'-ఇదీ ఆ నినాదం. దీనిని మొదట సెప్టెంబర్‌ 20, 2018న రాజస్తాన్‌ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌ ప్రయోగించారు. దీనిని ప్రవీణ్‌ మిశ్రా అనే కాంగ్రెస్‌ ప్రముఖుడు కూరిస్తే, నాటి ప్రధాన కార్యదర్శి దీపక్‌ బబారియా బ్రహ్మాండం అంటూ దేశం మీద వదలడానికి అనుమతి ఇచ్చాడు. మరొక ఆలోచన లేకుండా రాహుల్‌ పలికారు.అక్కడి ఎన్నికల ప్రచారంలో ప్రయోగించాక రాజస్తాన్‌ పత్రికలన్నీ పతాకశీర్షికలుగా ప్రచురించాయి. అప్పటికి కూడా బీజేపీ మౌనంగానే ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల తరువాత బీజేపీ నాయకురాలు మీనాక్షి లేఖి దీని మీద సుప్రీం కోర్టులో పరువు నష్టం దాఖలు చేశారు. దీనితో రాహుల్‌ క్షమాపణలు చెప్పారు.


భివాండీ కోర్టు కేసు గురించి అంతా తెలుసుకోవాలి. 2014లో ఈ కేసుకు సంబంధించి భారత శిక్షా స్మృతి 499, 500 సెక్షన్ల మేరకు సమన్స్‌ జారీ అయ్యాయి. ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్త రాజేశ్‌ కుంతే మిశ్రా ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. గాంధీజీని ఆర్‌ఎస్‌ఎస్‌ హత్య చేసిందని ఆరోపించినందుకు రాహుల్‌ విచారణను ఎదుర్కొన్న కేసు ఇదే. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్‌ భివాండీలో నిర్వహించిన ఒక ప్రదర్శనలో రాహుల్‌ ఈ ఆరోపణ చేశారు. 'ఇదే వారి వ్యవహార శైలి. గాంధీజీని ఆర్‌ఎస్‌ఎస్‌ సంస్థ నుంచి వచ్చినవారే హత్య చేశారు. ఆ సంస్థ సభ్యులే కాల్చి చంపారు. కానీ ఇప్పుడు వారే గాంధీజీ గురించి మాట్లాడుతున్నారు' అని రాహుల్‌ అన్నారు. ఇది జరిగిన తరువాత భివాండీ జారీ చేసిన సమన్స్‌ను రద్దు చేయాలని కోరుతూ బొంబాయి హైకోర్టును ఆశ్రయించారు. తాను వ్యక్తిగతంగా ఈ కేసులో కోర్టుకు శాశ్వతంగా రానక్కరలేకుండా కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. కానీ సమన్స్‌ రద్దు చేయడానికి, విచారణను ఆపడానికి కూడా హైకోర్టు నిరాకరించింది.గాంధీజీని ఆర్‌ఎస్‌ఎస్‌ వారు హత్య చేశారని తాను ఏనాడూ అనలేదని పచ్చి అబద్ధం ఆడారాయన.

ఆర్‌ఎస్‌ఎస్‌ గౌరవానికి భంగం కలిగించారంటూ గౌహతికి చెందిన అంజన్‌ బోరా చేసిన ఫిర్యాదు మేరకు రాహుల్‌కు సమన్స్‌ జారీ అయినాయి.

జార్ఖండ్‌లో జరిగిన ఒక ఎన్నికల ప్రచార సభలో రాహుల్‌ నోటివాటం హద్దులు దాటిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ మేక్‌ ఇన్‌ ఇండియా అంటున్నారు. కానీ మనం చూస్తున్నది రేప్‌ ఇన్

ఇండియా అన్నారు రాహుల్. నిత్యం లైంగిక అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. బేటీ బచావో, బేటీ పఢావో అన్నారు మోదీ. అయితే ఎవరి ఆడవారిని రక్షించాలో మోదీ చెప్పలేదు అన్నారు రాహుల్. ఈ రాష్ట్రంలో కూడా దొంగలందరికీ మోదీ ఇంటి పేరే ఉంటుందన్న వ్యాఖ్య మీద వ్యాజ్యం నడుస్తున్నది. ఆయన మీద మొత్తం మూడు కేసులు ఉన్నాయి. మొదటిది న్యాయవాది ప్రదీప్ మోదీ వేసిన కేసు. ప్రదీప్ మోదీ కూడా తమ ఇంటి పేరు గలవారంతా దొంగలే అన్న వ్యాఖ్య మీద కేసు వేశారు. అమిత్ షాను హంతకుడు అని వ్యాఖ్యానించినందుకు ఈ రాష్ట్రంలోనే మరొక పరువు కేసు నమోదైంది. 2018 నాటి జబల్‌పూర్ ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ఆ మాట అన్నారు. ఇదే ఆరోపణ మీద బీజేపీ నాయకుడు ప్రతాప్ కతియార్ కూడా పరువు నష్టం కేసు పెట్టారు. సూరత్ కోర్టు తీర్పు తరువాత ఈ మూడు కేసులను కూడా త్వరగా విచారించాలని ఆ రాష్ట్ర బీజేపీ నాయకుడు బిరంచి నారాయణ్ కోరారు.

సైన్యం జరిపిన ఉగ్రవాద వ్యతిరేక దాడులను మోదీ తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని కూడా రాహుల్ ఆరోపించారు. 2016లో ఒక సందర్భంలో మాట్లాడుతూ సైనికులు రక్తం ధారపోసి సర్జికల్ స్ట్రైక్స్ చేస్తే మోదీ వారి




వెనకాల దాక్కున్నారని రాహుల్ ఆరోపణ.

2019 ఎన్నికల ప్రచారంలోనే రాహుల్ గాంధీ గుజరాత్‌లో అమిత్‌షా మీద హత్యారోపణ చేశారు. సొహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ బాధ్యత అమిత్ షాదేనని చెప్పడం రాహుల్ ఉద్దేశమేమో కానీ, ఆయనను హత్య చేసిన వానిగా చిత్రించే ప్రయత్నం చేశారు. ఈ ఆరోపణ మీద కూడా పరువు నష్టం కేసు వేశారు. రాహుల్ బెయిల్ తీసుకున్నారు.

కాంగ్రెస్ నేతలకు జ్ఞానం వస్తుందని ఎవరూ అనుకోవడం లేదు. 2014 ఎన్నికల ప్రచారం సమయంలో మణిశంకర్ అయ్యర్ అనే కాంగ్రెస్ నాయకుడు 'మోదీ కాంగ్రెస్ సభల దగ్గర తేనీరు అమ్ముకోవాలే తప్ప, ప్రధాని కావడం అసాధ్యం' అన్నాడు. మార్చి 25న ఆ పార్టీ కార్యదర్శి గాంధీ–నెహ్రూ కుటుంబ వారసురాలు ప్రియాంక ఏమని ట్వీట్ చేశారు? 'ప్రజలు ఎన్నుకున్న ప్రజాసేవకుడు ప్రజల సమస్యల మీద గొంతు ఎత్తే ప్రయత్నం చేస్తుంటే, ఆదానీ సేవకుడు ఆ గొంతును అణచివేయడానికి చూస్తున్నాడు' అని. ఇది నిజమైన ప్రజాసేవకులు ఉపయోగించే భాషనే చెప్పాలా? చిన్నచిన్న వృత్తులను అవహేళన చేయడం దురహంకారం కాదా? ★





## పార్లమెంటుకు ఇక సెలవేనా?

# ‘అనర్హత’తో రాజకీయ జూదం

**సూరత్ న్యాయస్థానం తీర్పు కాంగ్రెస్ పార్టీ భవితవ్యం మీద ఎలాంటి ప్రభావం చూపుతుంది? మోదీ అనే ఇంటిపేరును అడ్డం పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ మీద అవాకులూ చవాకులూ పేలినందుకు గాంధీ-నెహ్రూ కుటుంబ వారసుడు రాహుల్ గాంధీకి న్యాయమూర్తి జస్టిస్ వర్మ రెండేళ్లు జైలుశిక్ష విధించారు. రూ. 15,000 జరిమానా కూడా విధించారు. చాలా చిత్రంగా జైలు శిక్ష పడడమనే మచ్చ కంటే, లోక్‌సభ సభ్యునిగా రాహుల్ ఎదుర్కొంటున్న అనర్హత గురించి దేశంలోను, కాంగ్రెస్ పార్టీలోను ఎక్కువ చర్చ జరుగుతోంది. 1975 నాటి అలహాబాద్ హైకోర్టు తీర్పు, దరిమిలా ఇందిరాగాంధీ ఎదుర్కొన్న ఇరకాటం, మారిన రాజకీయాలు, ఆ నేపథ్యమే మళ్లీ ఇందిరను ప్రధానిగా ప్రతిష్టించడం వంటి పరిణామాలను గుర్తు చేసుకుని కొందరు కాంగ్రెస్ నాయకులు సూరత్ న్యాయస్థానం తీర్పులో కాంగ్రెస్‌కు పునర్ వైభవం తెచ్చే వరాన్ని చూసుకుంటూ మురిసిపోతున్నారని వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్ అలా ఆనందపడుతూ ఉంటే, ప్రతిపక్షాల నేతలలో ప్రధాని పదవి కోసం చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నవారికి కూడా ఇది తీపి కబురనే అనుకోవాలి. ఎందుకంటే ప్రధాని పదవికి ప్రధాన పోటీదారు రంగం నుంచి దాదాపు తప్పుకున్నట్టే.**

ప్రస్తుతం అమలులో ఉన్న నియమ నిబంధనలను బట్టి రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం కోల్పోయే అవకాశం చాలా ఎక్కువ. అనర్హత ఆయన భవితవ్యాన్ని ఇంకా అగమ్యగోచర స్థితిలోకి నెట్టి వేస్తుంది. ఆయనకు ఎన్నికలలో పోటీ చేసే అవకాశం మళ్లీ దక్కేది ఎనిమిదేళ్ల తరువాతే. రెండేళ్లు శిక్ష పడినవారు, ఆ శిక్షాకాలం పూర్తయ్యాక కూడా 1951 నాటి ప్రజాప్రాతినిధ్యం చట్టం మేరకు ఆరేళ్ల వరకు ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులు. ఈ అంశాన్ని ఆయన జీవితాశయం అనే కోణం నుంచి చూస్తే, 52 ఏళ్ల రాహుల్ తన 60వ ఏడు వరకు ఆగాలి. వాస్తవానికి మధ్యంతర ఎన్నికలు జరగకపోతే 2034 సంవత్సరంలో గాని రాహుల్‌కు ఎంపీగా పోటీ చేసే అవకాశం రాదు. కానీ అప్పటికి ఆయన 64వ పడిలో పడతారు. ఇది మోదీ ఇంటిపేరును దుర్వినియోగం చేసిన నేరానికి ఫలితం మాత్రమే. కానీ రాహుల్ మీద ఉన్న నేరం ఇదొక్కటే కాదు. మెడ మీద కత్తిలా వేలాడుతున్న మరొక కేసు నేషనల్ హెరాల్డ్ అవినీతి వ్యవహారం. దీనిని కూడా నరేంద్ర మోదీ హయాంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తున్న సంగతి విస్మరించలేం.

2019 ఎన్నికలు ఇచ్చిన కుదుపుతో ఇప్పటికే చాలామంది సీనియర్లను కోల్పోయిన కాంగ్రెస్‌కు సూరత్ న్యాయస్థానం తీర్పు మరొక కుదుపును సిద్ధం

చేస్తుందనే చాలామంది అభిప్రాయం. కాబట్టి సూరత్ పరిణామాన్ని మాత్రమే చూసి రేపటి కాంగ్రెస్ రూపురేఖల మీద అంచనాకు రావడం సాధ్యం కాదు. ఆ ఎన్నికలలో అమేథిలో స్మృతి ఇరానీ రూపంలో ఎదురైన ఘోర పరాజయమే పార్టీని డోలాయమాన స్థితికి నెట్టివేసింది. చాలామంది కాంగ్రెస్ నేతలు ఇతర పార్టీలలోకి సర్దుకున్నారు. కొందరికి పొగపెట్టారు. జి.26 అని ఒక బృందం కూడా తయారయింది. వాయినాడ్ (కేరళ) ఏదో విధంగా రాహుల్‌ను గట్టెక్కించి లోక్‌సభకు పంపినా సూరత్ తీర్పుతో అది మూణ్ణాళ్ల ముచ్చటగా మిగిలింది.

సూరత్ తీర్పు కాంగ్రెస్‌నీ, రాహుల్‌నీ నిలబెట్టే పరిణామమే అవుతుందా? ఇది కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా ఉన్న కోణమే. నిలబెట్టేదేనని కాంగ్రెస్ నాయకులు అంచనాకు రావడంలో ఆత్మతృప్తి మాత్రమే కనిపిస్తుంది. అలహాబాద్ హైకోర్టు తీర్పు తరువాత ఇందిరను సీబీఐ విచారించింది. తరువాత జనతాపార్టీలో గొడవలు మొదలయ్యాయి. మొరార్జీని ప్రధాని పదవి నుంచి దింపేసే అవకాశం ఇందిరకు అయాచితంగా చరణ్‌సింగ్ రూపంలో వచ్చింది. ఇప్పుడు కూడా అదే లెక్క వర్తిస్తుందని కాంగ్రెస్‌లో కొందరైనా భావించడం విడ్డూరమే తప్ప మరొకటి కాదు. మొదటి వాస్తవం– రాహుల్ గాంధీ ఇందిరాగాంధీ కాదు. భారతీయ జనతాపార్టీ నాటి జనతా పార్టీ వంటిదీ కాదు. అసలు అత్యవసర పరిస్థితి కాంగ్రెస్‌ను చివరి అంకంలోకి తీసుకువచ్చిన పరిణామమని కాంగ్రెస్ ఇప్పటికీ గుర్తించడం లేదనే అనిపిస్తుంది. జనతా పార్టీని ఇందిర ధ్వంసం చేసి ఉండవచ్చు. ధ్వంసం కావడానికి వీలైన అన్ని లక్షణాలు ఆ పార్టీలో ఉన్నాయి. అయినా భారతీయ జనతా పార్టీకి జన్మనిచ్చినది జనతా పార్టీయే. కాంగ్రెస్‌ను చివరి అంకంలోకి శరవేగంగా ప్రవేశపెట్టినది ఈ పార్టీయే.

కాబట్టి ఇవాళ దేశ రాజకీయాలలో ఉన్న పోటీకీ, 1977–79 నాటి రాజకీయాలలో నెలకొన్న పోటీకీ పోలిక లేదు. నాడు ఉన్నవి బలమైన కాంగ్రెస్; బలహీన, అనైక్య విపక్షం. నేడు ఉన్నది బలమైన అధికారపక్షం, బలహీన కాంగ్రెస్. పైగా నేషనల్ హెరాల్డ్ కేసు దర్యాప్తును కూడా వేగవంతం చేస్తే పరిస్థితులు ఎలా ఉంటాయి? ఎటు మళ్లుతాయి? ఈ భయమే సూరత్ తీర్పుతో వచ్చే కాస్త లబ్ధి పట్ల ఆ పార్టీలో కనిపించిన ఆశను అడుగంటిపోయేటట్టు చేస్తోంది. ఎనిమిదేళ్లు రాహుల్ ఎన్నికల రాజకీయాలకు దూరమైతే పార్టీలోనే ప్రత్యామ్నాయ నాయకత్వం అనివార్యంగా ఆవిర్భవిస్తుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

2014 తరువాత ప్రతిపక్షంగా కాంగ్రెస్ చేసినదేమిటి? నరేంద్ర మోదీని తీవ్ర పదజాలంతో నిందించడం ఒక్కటే. ఆ విమర్శలన్నీ గాంధీ–నెహ్రూ కుటుంబం నుంచి ప్రధాని పదవి చేజారినందుకు పెట్టిన శాపానార్థాలను తలపించాయే తప్ప, నిర్మాణాత్మక విమర్శలని ఎవరూ భావించలేదు. ప్రధాని పదవి విపక్షాల పరం కావడం, కాంగ్రెస్ పార్టీలోనే పీవీ వంటి వారి చేతిలోకి వెళ్లడం– ఆ రెండూ ఒక్కటే అన్న రీతిలోనే రాహుల్ వైఖరి కనిపించింది. సామాజిక న్యాయం గురించి, సమానత్వం గురించి, అందరికీ అవకాశాల గురించి రాహుల్ ఎన్ని కబుర్లు చెప్పినా ఆయన కోరుకుంటున్నది కుటుంబ పాలనేనని చాలాసార్లు రుజువు చేశారు. ప్రతిపక్ష విమర్శ, ప్రతిపక్ష పాత్ర అంటే తన కుటుంబ పాలనను పునఃప్రతిష్టించడం గానే రాహుల్ మనసా వాచా భావించారు. మోదీ ఇంటిపేరున్న వారంతా దొంగలే అని వదరడం అందులో భాగమే. రాహుల్ మనసు నిండా మాత్రమే కాదు, కొందరు కార్యకర్తల అంతరంగం కూడా అదే. రాహుల్‌గాంధీ కుటుంబాన్ని చట్టం కాస్త ప్రత్యేకంగా చూడవలసిందే అన్నారు మీర్జాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ. ఎందుకు? ఆయన తండ్రి, నానమ్మ కూడా దేశం కోసం త్యాగం చేశారట. ఎంత తక్కువ వీలుంటే అంత తక్కువ శిక్షతో సరిపెట్టాలని కూడా తివారీ కోర్టువారికి ఉచిత సలహా ఇచ్చారు. మాజీ ఎంపీ రేణుకా చౌదరికి కూడా గతంలో మోదీ అన్న ఒక మాట గుర్తుకు వచ్చి పరువు నష్టం వేస్తానని చెబుతున్నారు. అప్పుడెప్పుడో మోదీ ఆమెను శూర్పణఖ అన్నారని ఆరోపణ.

ఇంతకీ ఎన్నికల రాజకీయాలలో, ప్రచారంలో రాహుల్ ధోరణి గురించి దేశంలో, పార్టీలో ఉన్న అభిప్రాయం ఏమిటి? ఆ కోణం నుంచి మాత్రం రాహుల్‌పై అనర్హత వేటు గురించి అంతగా ఆలోచించవలసినది కాదని కొందరు విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. వచ్చే 2024 ఎన్నికలలో ప్రతిపక్షాలను ఏకం చేసే చర్చలను రాహుల్ కంటే కొత్త అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమర్థంగా నిర్వహించగలరన్న వాదన కూడా బయలుదేరింది. కానీ, గాంధీ–నెహ్రూ కుటుంబమే కాంగ్రెస్‌కు శరణ్యమన్న భావన కూడా బలంగానే ఉంది. అది ఇకపైనా నెరవేరడానికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయి? సోనియాకు ఆరోగ్యం సరిగా లేదు. ప్రియాంక గాంధీ మీద ప్రత్యేకంగా ఏమీ కేసులు లేవు. కానీ ఆమె భర్త రాబర్ట్ వాద్రా మీద మాత్రం కేసులు ఉన్నాయి. సోదరుడికి శిక్ష పడిన వెంటనే ప్రియాంక మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, సవాలు విసిరారు. ఇదంతా సామాజిక మాధ్యమాల లోనే. ఇలా కాకుండా ప్రియాంక బయటి ప్రపంచంలోకి వచ్చి క్రియాశీలకంగా ఉంటే ఫలితం ఉండవచ్చునన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాహుల్ గాంధీకి శిక్ష పడిన మరునాడే 14 విపక్షాలు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ల దుర్వినియోగాన్ని ఆపాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఇందులో కాంగ్రెస్ కూడా ఉండడమే వింత. భారతీయ జనతా పార్టీని విమర్శించే క్రమంలో తాము భారతదేశాన్ని తూలనాడుతున్నామనీ, సార్వభౌమాధికారాన్ని అవమానపరుస్తున్నామని ఏనాడో మరచిపోయిన విపక్షాలు, ఇప్పుడు బీజేపీ మీద ఆగ్రహంతో కోర్టులు, నిబంధనల విషయంలో కూడా అదే తప్పు చేస్తున్నాయి. ★

## రాహుల్ మీద ఆపేక్ష కాదు.. బీజేపీ మీద కక్ష...

దేశంలో 14 పార్టీలు రాహుల్‌కు సంఘీభావం ప్రకటించినా సీపీఎం మాత్రం వేరే విధంగా స్పందించింది. వారు బీజేపీ అప్రజాస్వామిక ధోరణులను వ్యతిరేకిస్తారట. రాహుల్ గాంధీకి మద్దతు ఇవ్వరట. తాము ఇచ్చిన ప్రకటన సారాంశం కూడా అదేనని భాష్యం చెప్పింది కేరళ సీపీఎం. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా సీబీఐ, ఈడీ వ్యవస్థలను బీజేపీ ప్రయోగించడాన్ని తాము వ్యతిరేకిస్తామని రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ తేల్చి చెప్పారు.



సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మార్చి 26న ఇచ్చిన ప్రకటనతో కాంగ్రెస్‌కు, రాహుల్‌కు మద్దతు గురించి ఇంకాస్త మబ్బులు వీడినట్టే కనిపిస్తుంది. ఇక్కడ ప్రశ్న సమాజ్‌వాదీ పార్టీ రాహుల్ పట్ల సంఘీభావంతో, సానుభూతితో ఉంటుందా లేదా అన్నది కాదు. ఈ దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బతికి బట్ట కడతాయా లేదా అన్నదే అసలు విషయం అని గొప్ప తెలివిగా సమాధానం ఇచ్చారు అఖిలేశ్. అదంతా ఎందుకు మేము ఏ పార్టీ పట్లా సానుభూతితో ఉండడం లేదు అని కూడా తేల్చి చెప్పారు. అయితే రాహుల్ లోక్‌సభ సభ్యత్వం అనర్హత పరిణామం తరువాత కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహాలు చేయడం బాగుందని మాత్రం అఖిలేశ్ కితాబిచ్చారు.

# SURYA FOUNDATION

B-3/330, Paschim Vihar, New Delhi - 110063, Tel. : 011-25251588, 25253681
Email : suryainterview@gmail.com Website : www.suryafoundation.org

Surya Foundation is a well-known organization working for National development and training of the youth. Its main objective, inter alia, is to train bright, passionate and determined youth willing to shoulder responsibilities and work for the society. Candidates brought up in Sangh Sanskars, physically fit and interested in social work many apply in the following categories. After the interview and final selection they will be imparted six month training at Surya Foundation Campus. On completion of training they will be required to undergo **'On Job Training'** for a period of one year.

1.

| Post | Experience | 6 months Initial Training + 1 year OJT | After Training CTC |
|---|---|---|---|
| CA | IPCC / MTER (2 Yrs Experience) | 3 - 4 L Per Annum | As per Performance |
| | Fresher | 5 - 6 L Per Annum | - do - |
| | Experienced (upto 5 years) | 6 - 8 L Per Annum | - do - |
| | Experienced (above 5 years) | 9 - 12 L Per Annum | -do - |
| Engineers, (Freshers or Experienced) | B.Tech (IIT) | 7.5 - 9 L Per Annum | - do - |
| | B.Tech (NIT) | 4.5 - 6 L Per Annum | - do - |
| | B.Tech (Other Institutes) | 3 - 3.6 L Per Annum | - do - |
| | M.Tech (IIT) | 8.5 - 10 L Per Annum | - do - |
| | M.Tech (NIT) | 5.5 - 7 L Per Annum | - do - |
| | M.Tech (Other Institutes) | 3.6 - 4 L Per Annum | - do - |
| MBA | MBA (IIT + IIM) | 15 L + Per Annum | - do - |
| | MBA (IIM) | 12 - 15 L Per Annum | - do - |
| | MBA (Other Institutes) | 3 - 3.6 L Per Annum | - do - |
| Post Graduate & Graduate | MCA, B.Ed., M.Ed., MSW, M.Sc., M.Com., M.A. *(Freshers / Experience) Ph.D. ** | 2 - 3 L Per Annum | - do - |
| | Mass Communication (Media) - PG | 2.4 - 3 L Per Annum | - do - |
| | B.Com. with three years experience in accounts, purchase, store | 2.4 L Per Annum | - do - |
| | B.Sc. BCA, BBA, BA, B.Com (Persuing / Passed) | 1.2 L Per Annum | - do - |
| | Diploma | 1.8 L Per Annum | - do - |
| Law | LLM | 3 - 3.6 L Per Annum | - do - |
| | LLB | 2.4 - 3 L Per Annum | - do - |

- More deserving candidates may get higher salary as specified above.
- Ph.D candidates can also apply. salary will be decide during the interview.
- Yoga Teacher, Naturopathy Doctor, Karate Teacher, Music Teacher, Stenographer (Hindi & English), Script Writer (Hindi & English), Data Operator & Clerk can also apply. Salary will be given according to qualification.

2. <u>**Graduate Management Trainee (GMT)**</u>

**Qualifications.** Boys who have passed class 10th / 11th / 12th in 2023 may apply. Should have secured minimum 60% aggregate marks with 75% marks in Maths in the previous class. **Age.** Below 18 years. Selected candidates will be imparted 6 months initial training at Surya Foundation Training Campus Jhinjholi prior to the **On Job Training (OJT)** or **Practical Campus Training (PCT)**. Facilities for doing graduation and MBA or MCA will be provided during OJT / PCT.

Free accommodation, food and stipend of Rs. 5,000/- p.m. will be provided during the period of 6 months initial training. During the OJT / PCT, besides free accommodation and facilities for education, stipend of Rs. 8,000/- p.m. in class 11th, Rs. 10,000/- in class 12th, Rs. 12,000/- in 1st year graduation, Rs. 15,000/- in 2nd year graduation, Rs. 18,000/- in 3rd year graduation, Rs. 22,000/- during MBA / MCA 1st year and 27,000/- in MBA / MCA 2nd year will be given. Salary Rs. 40,000/- p.m. (CTC) will be given on completion of MCA / MCA.

3. <u>**Assistant Staff Cadre (ASC)**</u>

**Qualifications.** Boys who have passed class 10th / 11th / 12th in 2023 may apply. Should have secured minimum 55% aggregate marks with 60% marks in Maths in the previous class. **Age.** Below 18 years. Selected candidates will be imparted 6 months initial training at Surya Foundation Training Centre at Jhinjholi prior to OJT / PCT for three years. Free accommodation, food and a stipend of Rs. 3,000/- p.m. will be provided during the six months initial training. During the OJT / PCT, besides free accommodation stipend Rs. 8,000/- p.m. for 1st year, Rs. 10,000/- p.m. for 2nd year and Rs. 12,000/- p.m. for 3rd year will be paid. On completion of OJT / PCT salary of Rs. 15,000/- (CTC) will be given.

In your detailed application please mention if you have done any camp such as NCC / NSS / Sangh Shiksha Varg / Prathamik Shiksha Varg / Sheet Shivir / PDC etc. Specify the details if the candidates has association with Seva Bharti / Vidya Bharti / Vanvasi Kalyan Ashram / Sangh. If there is anyone familiar in the Surya family, then mention their name and department. Enclose the photocopy of the mark sheet along with the application. Please send your CV application along with detailed resume to the following address. You can also send CV application by email.

B-3/330, Paschim Vihar, New Delhi - 110063 I Email : suryainterview@gmail.com

**Last Date of Application - 31 May. 2023**

తెలుగు రాష్ట్రాల్లో విలువలతో కూడిన విద్యనందిస్తున్న శ్రీ సరస్వతీ విద్యాపీఠం నెలకొల్పి ఈ ఏడాది శ్రీరామ నవమికి 50 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శిశుమందిర్ పాఠశాలల్లో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శిశుమందిర్‌ల స్థాపన, లక్ష్యాలు, అవి అందిస్తున్న సేవలు, విస్తరిస్తున్న తీరుని గురించి ఓసారి చర్చించుకుందాం.



# విలువలతో కూడిన బోధనే

1967కు ముందు జాతీయ భావాలతో ఉత్తర భారతదేశంలో కొన్ని శిశుమందిరాలు ఏర్పడ్డాయి. వీటి అధ్యయనం కోసం అప్పటి ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ సోమేపల్లి సోమయ్య.. ఆదిలాబాద్ జిల్లా ప్రచారక్ ఎస్‌ఎల్‌ఎన్ ఆచార్యులును గోరఖ్‌పూర్ పంపించారు. ఆయన అధ్యయనంతో తెలుగు నాట శిశుమందిర్‌ల స్థాపన సాధ్యపడింది. ఆ తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శ్రీ సరస్వతీమాత పుణ్యక్షేత్రమైన బాసరకు 70 కిలో మీటర్ల దూరంలోని నిర్మల్ పట్టణంలోని బ్రహ్మపురి రథాల గుడి దగ్గర మొదటి శిశుమందిర్ ప్రారంభమైంది. తర్వాత కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మరికొన్ని చోట్ల ఈ పాఠశాలలు ప్రారంభమై అక్షరసేద్యానికి అంకురార్పణ జరిగింది. 1973లో శ్రీరామ నవమి రోజున రాష్ట్ర స్థాయిలో శ్రీ సరస్వతీ విద్యాపీఠానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రూపకల్పన చేశారు. ఇందూర్ విభాగ్ ప్రచారక్‌గా ఉన్న ఎస్‌ఎల్‌ఎన్ ఆచార్యులు ఈ విద్యాపీఠానికి సంస్థాపక, మొట్ట మొదటి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన నాయకత్వంలో అద్భుతంగా శిశుమందిర్‌ల స్థాపన, విస్తరణ, ప్రాచుర్యం దక్కించుకొన్నాయి.

అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక చోట్ల శిశుమందిరాలు ప్రారంభం అయ్యాయి. పాఠాల్ని బట్టీ కొట్టించటం, మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థుల్ని ఒత్తిడికి గురిచేయడం వంటివి శిశుమందిరాల్లో అసలు కనబడవు. స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యాబోధన చేస్తూ విదార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి భావన పెంపొందించడమే శిశుమందిరాల లక్ష్యం. అంతే కాదు, పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చు కొనేట్లుగా, ఉన్నత విద్యలో రాణించేందుకు వీలుగా నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. ప్రతి సంవత్సరం సిలబస్ బోధన, పాఠ్య ప్రణాళిక అమలు కచ్చితంగా జరుగుతుంది. ఈ పాఠశాలలో అకడమిక్ పర్యవేక్షణ కోసం శిక్షణా ప్రముఖ్‌ల వ్యవస్థ ఉంటుంది. ఈ ప్రముఖ్‌లు క్రమం తప్పకుండా శిశుమందిర్‌లను దర్శిస్తూ విద్యా ప్రణాళికలను పర్యవేక్షిస్తూ ఉంటారు.

విద్యార్థుల సమగ్ర వికాసం కోసం పంచమయ కోశ విద్య (అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ)లకు ప్రాధాన్యం ఇస్తూ బోధన నిర్వహించటం ముఖ్యమైన విషయం. ఈ క్రమంలో విద్యార్థుల సర్వాంగీణ వికాసం కోసం శారీరక్, యోగ, సంగీతం, సంస్కృతం, నైతిక, ఆధ్యాత్మిక శిక్షణను తప్పనిసరి చేశారు. ఈ అయిదు అంశాలలో విద్యార్థుల్ని తీర్చిదిద్దితే భారత సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా వారు తయారవుతారన్నది భావన. అంతేకాదు, విద్యార్థులకు సదాచారం అనే సబ్జెక్టును తప్పనిసరిగా బోధించటం శిశుమందిరాల ప్రత్యేకత. దీని ద్వారా సమాజంలో ఏ రంగంలో స్థిరపడినప్పటికీ, విలువలతో కూడిన పౌరులుగా రాణించేందుకు వీలవుతుంది.

మారుతున్న కాలంతోపాటు శిశుమందిరాల బోధన తీరులో పురోగతి చోటుచేసుకొంది. విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు అన్ని శిశుమందిరాల్లో మాతృభాషకు ప్రాధాన్యం ఇసూ్తనే ఇంగ్లిష్ మీడియంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన నిర్వహిస్తున్నారు. వీటితో పాటు సైన్స్ ల్యాబరేటరీలు, సోషల్ స్టడీస్ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. కంప్యూటర్ ల్యాబరేటరీలు నెలకొల్పి విద్యార్థులకు చిన్న దశలోనే కంప్యూటర్స్ మీద అవగాహన కల్పిస్తున్నారు.

శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రస్థానంలో ముఖ్యమైన ఘట్టం విద్యాభారతికి అనుబంధంగా మారటం. 1977లో విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ పేరుతో సంస్థను రిజిస్టర్ చేయించారు. దేశంలోని శిశుమందిర్ తరహాలోని పాఠశాలల్ని ఒక గొడుగు కిందకు తీసుకువచ్చారు. తద్వారా పెద్దఎత్తున పరిశోధన వనరులు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక పాఠశాలలు నడుపుతున్న ప్రభుత్వేతర విద్యా వ్యవస్థగా విద్యా భారతి నిలుస్తోంది. దాని స్ఫూర్తిని అందిపుచ్చుకుంటూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం పురోగమిస్తోంది.

కేవలం పాఠశాల కేంద్రంగా విద్యా బోధనకే విద్యాపీఠం పరిమితం కాలేదు. సంవేదనాశీల క్షేత్రాల్లో విద్యాలయాల్ని నిర్వహిస్తోంది. అంటే అటవీ ప్రాంతాలు, సేవా బస్తీలలో నివసించే విద్యార్థుల కోసం ఏకోపాధ్యాయ పాఠశాలలు కూడా నిర్వహిస్తోంది. అనేక చోట్ల సంస్కార కేంద్రాలు నడుపుతూ బస్తీలలోని విద్యార్థులకు మన సంస్కృతీ, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తోంది. ఆవాస విద్యాలయాలు ఏర్పాటు చేసి విద్యార్థుల సామాజికాభివృద్ధికి తోడ్పడుతున్నది. 3 నుంచి 5 సంవత్సరాల మధ్య పిల్లల కోసం శిశువాటికలు ఏర్పాటు చేశారు. పిల్లల కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాల వికాసం కోసం ఇవి పనిచేస్తున్నాయి. ఇంట్లో తల్లి ద్వారా కలిగే సంస్కారాలు అందించేందుకు గాను బాలికా

రమ విశ్వనాథన్



# శిశుమందిరాల లక్ష్యం

విద్య పేరుతో ప్రత్యేక పాఠ్య ప్రణాళిక అమలు అవుతున్నది. వేద గణిత అధ్యయనానికీ ప్రాధాన్యం కల్పిస్తున్నారు. కౌశల్ వికాస్‌కు పెద్ద పీట వేయటం మరో విశేషాంశం.

విద్యాపీఠానికి అనుబంధంగా ఇంకా వివిధ స్థాయుల్లోనూ పని జరుగుతున్నది. విద్వత్ పరిషత్ పేరుతో కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని పరిశోధకులు, అధ్యాపకులతో ఒక మండలి ఏర్పాటైంది. ఇది విద్యావ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులు, పురోగతిని అధ్యయనం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేస్తున్నది. శిశుమందిరాల్లో చదువుకొని సమాజంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సైతం సమాజ అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడుతున్నారు. వీరంతా పూర్వ విద్యార్థి పరిషత్‌గా ఏర్పడి సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించుకుంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహరచన చేస్తారు.

శ్రీ సరస్వతీ విద్యాపీఠం మరో ప్రత్యేకత ఏమిటంటే.. ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ ఉండటం. ఇక్కడ ఉపాధ్యాయులను ఆచార్యులు, మాతాజీ అని పిలవటం ద్వారా పిల్లల్లో చిన్నతనం నుంచే సంస్కారాలు అలవాటు చేస్తారు. శిశుమందిరాల్లో ప్రవేశించే ఆచార్యులు అందరికీ నాణ్యమైన శిక్షణ అందిస్తారు. క్రమం తప్పకుండా శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తారు. తద్వారా నాణ్యమైన బోధన జరిగేట్లుగా జాగ్రత్తలు తీసుకుంటారు. ఇందుకు విద్యాపీఠం ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాన్ని నిర్వహించటం విశేషం.

శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో ఆవాస విద్యాలయాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. రాంపూర్, జమ్మికుంట, తడకపల్లి, శారదాధామం వంటి చోట్ల చక్కటి ఆవాసవిద్యాలయాలు సేవలు అందిస్తున్నాయి. భద్రాచలం, ముల్కలపల్లి, అచ్చంపేట వంటి చోట్ల వనవాసీ జాతుల కోసం ప్రత్యేకంగా సేవలు అందిస్తున్న పాఠశాలలు కూడా ఉన్నాయి. రాయలసీమలోని కర్నూలు, హిందూపురం వంటి చోట్ల ఆవాస విద్యాలయాలు సేవలు అందిస్తున్నాయి.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం; ఆంధ్రప్రదేశ్‌లో విద్యాభారతి– ఆంధ్రప్రదేశ్ అనే పేరుతో రిజిస్టర్డ్ సంస్థలుగా ఏర్పడ్డాయి. వీటికి అనుబంధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు 400 దాకా పాఠశాలలు పనిచేస్తున్నాయి. శిశు స్థాయి నుంచి ఉన్నత స్థాయి దాకా తరగతులు నడుస్తుంటాయి. విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్రం కింద ఇవన్నీ పనిచేస్తుంటాయి. ఏపీ, తెలంగాణలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని విద్యాలయాలన్నీ ఈ క్షేత్ర పరిధిలో ఉంటాయి. సంఘ జ్యేష్ఠ ప్రచారక్ లింగం సుధాకర్‌రెడ్డి ఈ మూడు రాష్ట్రాల దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. దాదాపు దశాబ్ద కాలానికి పైబడి ఆయన విద్యాపీఠానికే అంకితమై శిశుమందిరాల విస్తరణ కోసం కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంఘటన కార్యదర్శిగా కన్నా భాస్కర్, తెలంగాణకు సంఘటన కార్యదర్శిగా పతకమూరి శ్రీనివాస్ సేవలు అందిస్తున్నారు.

ఆధునిక సమాజంలో మారుతున్న పోకడలకు అనుగుణంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం పరుగులు తీస్తున్నది. ఈ క్రమంలో ఏర్పాటైన శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ గురించి కచ్చితంగా చెప్పుకోవాలి. విశాలమైన భవంతులు, అత్యాధునిక వసతులు, సీనియర్ ఫ్యాకల్టీతో సీబీఎస్ఈ సిలబస్‌తో పాఠశాల శారదాధామంలో ఏర్పాటైంది. మూడేళ్లుగా హైదరాబాద్‌లోనే అగ్రగామి ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఒకటిగా ఈ పాఠశాల పేరు తెచ్చుకొన్నది. రానున్న కాలంలో మరిన్ని సీబీఎస్ఈ పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు విద్యాపీఠం కృషి చేస్తున్నది. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న భారతీయ విద్యాకేంద్రం, గుడిలోవ విజ్ఞానవిహార, విజయవాడ సీబీఎస్ఈ పాఠశాలలన్నీ.. ఇతర ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సేవలందిస్తున్నాయి. ఇప్పుడు ఈ పాఠశాలల్లో సీటు దొరకాలంటే కష్టం అయిపోయే పరిస్థితి ఉందంటే ఏ స్థాయిలో విజయవంతంగా నడుస్తున్నాయో అర్థం అవుతుంది.

సమాజంలో రేపటితరం బాగుండాలంటే విలువలతో కూడిన చదువులు చాలా అవసరం. అటువంటి విలువలతో కూడిన పౌరులను తీర్చిదిద్దటంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం 50 సంవత్సరాలు నిరంతరాయంగా పనిచేస్తున్నది. రానున్న కాలంలో మరింతగా సేవల్ని విస్తరించేందుకుగాను పాలకమండళ్లు, అధ్యాపకులు, సహకార సిబ్బంది పని చేస్తున్నారు.

వ్యాసకర్త: క్షేత్ర ప్రచార ప్రముఖ్, విద్యాభారతి






# క్రైస్తవంలోకి మారితే రి

వైసీపీ ప్రభుత్వం క్రైస్తవ మతంలో చేరినవారికి ఎస్సీ రిజర్వేషన్లు ఇచ్చేలా తీర్మానం చేసి వారిని మోసం చేస్తోంది. ఈ ప్రభుత్వం మొదటి నుంచి ఓట్ల రాజకీయం చేస్తూ, మత వివక్షకు పాల్పడుతూ క్రైస్తవులను, ముస్లింలను వెనకేసుకు వస్తోంది. క్రైస్తవ మతంలోకి మారిన ఎస్సీలకు ఆ రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూ అసెంబ్లీలో తాజాగా తీర్మానం చేసింది. ఇప్పటికే ఈ అంశం సుప్రీంకోర్టులో ఉందని తెలిసినా ఏడాదిలో ఎన్నికలు సమీపిస్తుండడం, మరోవంక ఎస్సీలలో కూడా వైసీపీ పట్ల అసంతృప్తి పెరుగుతుండటంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కూడా ఇలాగే తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడూ ఇదే పరిస్థితి ఎదురు కానుంది.

**సాధ్యం కాని వ్యవహారం**

సాధ్యం కాని వాటికి, తమ పరిధిలో లేని వాటికి తీర్మానాలు చేయడం వైసీపీ ప్రభుత్వానికి మామూలు వ్యవహారమై పోయింది. ఏదో ఒక కాగితం రాసి అసెంబ్లీలో తీర్మానం చేసి తాము ఆయా వర్గాలకు ఏదో చేశామంటూ జనాలను నమ్మించడం తప్ప ఈ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం సాధ్యం కాదని తేల్చినా, మతంమారినవారికి ఎస్సీ రిజర్వేషన్లు ఇచ్చే అంశం సుప్రీంకోర్టులో నలుగుతున్నా, అదేమి పట్టనట్టు ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా మభ్యపెట్టే ప్రకటన చేసింది. శాసనసభ బడ్జెట్ సమావేశాల చివరిరోజున హడావిడిగా తీర్మానం చేసింది. దానిని కేంద్రానికి పంపిస్తున్నామని ప్రకటించింది.

**అంబేద్కర్‌ను అవమానించడమే**

'మనమంతా ఒకే ప్రజ, ఒకే దేశం అనే ఏకాత్మత ఉన్నందు వల్లే ఒక దేశంగా ఏర్పడ్డామ'ని డాక్టర్ అంబేద్కర్ భావించారు. ఆయన అందించిన రాజ్యాంగానికి మనం బలం చేకూర్చాలంటే కులాల కతీతంగా మన మధ్య సోదర భావం ఏర్పడాలి. డాక్టర్ అంబేద్కర్, ఇతర కులాలపై ఎస్సీలలో ద్వేషం రగిలించకుండానే స్వేచ్ఛను ప్రసాదించిన మానవతావాది. లక్షలాది బడుగు వర్గాలను విదేశీ భావాలకు బానిసలు కాకుండా కాపాడిన కారుణ్య మూర్తి. ప్రపంచంలోని అతి పెద్దదైన రాజ్యాంగాన్ని రాసి అందులో అన్ని వర్గాలకు సమాన అవకాశాలను కల్పించారు. అంతేకాకుండా ఎస్సీలను హిందువుల నుండి వేరు చేయకుండా హిందూకోడ్ బిల్లు పెట్టి, ఎస్సీలు సహా బౌద్ధులు, సిక్కులు, జైనులను కూడా అందులో కలిపిన నిజమైన సమగ్ర సమతావాది. హిందూమతంలోని అంటరానితనం, వివక్షకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగం ప్రకారం ఎస్సీ రిజర్వేషన్‌ను వర్తింపచేయాల్సి ఉంటుంది. క్రైస్తవం, ముస్లిం మతాలకు ఈ రిజర్వేషన్ వర్తించదు. హిందూమతానికి చెందిన ఎస్సీలు క్రైస్తవ మతం స్వీకరిస్తే వారిని వెనుకబడిన తరగతి వర్గాల (బీసీ–సి) కింద పరిగణించాలని చట్టం చెబుతోంది. కాని మొదటి నుంచి క్రైస్తవులను ఓటు బ్యాంకుగా చూస్తున్న జగన్ ఈ అంశం సుప్రీంకోర్టులో ఉందని తెలిసి కూడా కేంద్రానికి తీర్మానం చేసి పంపుతున్నట్లు ప్రకటించి క్రైస్తవులను మభ్యపెడుతున్నారు. అంతెందుకు కోర్టులో ఉందని చెప్పి సచివాలయ ఉద్యోగాల్లో ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను జగన్ అమలు చేయలేదు. ఇదే రీతిలో కాపులకు ఈడబ్ల్యుఎస్‌లో 5 శాతం రిజర్వేషన్లు కూడా అమలు చేయలేదు. కాని మతంమారిన క్రైస్తవులు, ముస్లింలను మాత్రం ఎస్సీలుగా గుర్తించాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం తమ పట్ల చూపుతున్న నిర్లక్ష్య ధోరణి కాదా? అని ఆయా వర్గాలు విమర్శిస్తున్నాయి.


**భయపెట్టి మతమార్పిడులు**

మత మార్పిడుల విషయంలో క్రైస్తవ సంఘాలు వందల ఏళ్ల నుంచి ప్రజలను మోసం చేస్తున్నాయి. ధనాదాయం పెరుగుతుందని, పేదరికం తగ్గిపోతుందని, అపాయాలు తొలగిపోతాయని, అనారోగ్యాలు పోతాయని పేదలను ప్రలోభ పెడుతూ మతమార్పిడులు చేస్తున్నారు. బ్రిటిషర్ల కాలం నుంచి ఇది జరుగుతూనే ఉంది. మన దేశంపై ఆధిపత్యానికి ముస్లిం, క్రైస్తవ పాలకులు మతమార్పిడులను ఉపయోగించారు.

కత్తి చూపి భయపెట్టి, కాసులు చూపి, విద్య సేవల పేరుతో మతమార్పిడులు కొనసాగించారు. తమ ప్రభావాన్ని పెంచుకునేందుకు మతమార్పిడి కార్యక్రమాల కోసం సామ్రాజ్యవాద పశ్చిమ దేశాలు వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇప్పటికీ కోట్లాది రూపాయలను ఖర్చుచేస్తున్నాయి. మత మార్పిడి అనేది మతకల్లోలాలకు మరో దారి. మత మార్పిడులు మత సామరస్యానికి భంగం కలిగిస్తున్నాయి. బలవంతపు మతమార్పిడిలు అనైతికం కూడా. నిజానికి అన్ని మతాలు ఒకటే అని చెప్పేవాళ్లు మతం మారాల్సిన అవసరం ఏముంది? దేవుడు ఒక్కడే అయినప్పుడు రాముడిని పూజిస్తే ఏం? 'మా మతం పాటిస్తేనే స్వర్గానికి వెళతార'ని చెప్పటం ఎందుకు? జగన్మోహనరెడ్డి ప్రభుత్వం చేసిన తాజా తీర్మానాన్ని వెనక్కి తీసుకోని పక్షంలో మరో ప్రజా ఉద్యమాన్ని నిర్వహించడానికి వెనుకాడబోవమని విశ్వహిందూ పరిషత్ హెచ్చరించింది.

**ప్రభుత్వాన్ని మోసం చేస్తూ....**

మతంమారినవారు ఇంట్లో క్రైస్తవం, బయట హిందువులా చలామణి అవుతున్నారు. వారు తాము క్రైస్తవులుగా ప్రభుత్వ నిర్దేశిత పత్రాల్లో ప్రకటించడం లేదు. హిందువులుగానే ఉన్నట్లు విద్యార్హత సర్టిఫికెట్లలో నమోదు చేయించు కుంటున్నారు. దాంతో వారికి ఎస్సీ రిజర్వేషన్ వర్తిస్తుంది.అలా ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. పేర్లు



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**
ఛైర్మన్, సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.



# జర్వేషన్‌లా!?

హిందువులవే అయినా చర్చిలకు వెళతారు, ఏసుక్రీస్తును పూజిస్తారు. పుట్టుక నుంచి వివాహం, మరణం వరకు క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలోనే కార్యక్రమాలు జరుపుకుంటున్నారు. ఇప్పుడు దేశం మొత్తం ఇదే వ్యవహారం నడుస్తోంది.

రిజర్వేషన్ ఇస్తే మత మార్పిడులు ప్రోత్సహించినట్లే మతం మారిన క్రైస్తవులు, ముస్లింలకు కూడా ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపచేస్తే మతమార్పిడులను ప్రోత్సహించినట్లే. దీనిని గుర్తించే క్రైస్తవ సంఘాలు మతంమారిన క్రిస్టియన్లను, ముస్లింలను ఎస్సీలుగా గుర్తించి, రిజర్వేషన్లు వర్తింపచేయాలని ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తూ ఉన్నాయి. పలు క్రైస్తవ సంఘాలు ఈ అంశంపై సుప్రీంకోర్టులో ఇప్పటికే పలు వ్యాజ్యాలు దాఖలు చేశాయి. ఎస్సీలకు, క్రైస్తవులకు, ముస్లింలకు మొదటి నుంచి అనుకూలంగా ఉంటూ వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన జస్టిస్ రంగనాథ మిశ్రా కమిషన్ వారికి రిజర్వేషన్ ఫలాలు అందించాలంటూ సిఫారసు చేసింది. అయితే ఆ నివేదిక లోపభూయిష్టమంటూ ఇప్పటి ఎన్‌డిఏ ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ ఏడాది జనవరి 19న సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ అంశంపై గత అక్టోబర్‌లో జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసినట్టు, అది రెండేళ్లలో నివేదిక ఇస్తుందని కేంద్రం కోర్టుకు తెలిపింది.

**చట్టం పటిష్ట అమలుకు చర్యలు**

హిందూ మతంలోని అణగారిన వర్గా లకు ఎస్సీ రిజర్వేషన్లు ఇవ్వాల్సి ఉండగా చాలా రాష్ట్రాలు అమలు చేయడం లేదు. ఎక్కడైనా కోర్టుల్లో కేసులు పడినప్పుడు మాత్రమే తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే దానిని అమలు చేస్తున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చట్టానికి పదును పెంచింది. ఎవరైనా క్రైస్తవ మతం స్వీకరిస్తే వారికి ఎస్సీ సర్టిఫికేట్ ఇవ్వరాదంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసింది. దేశవ్యాప్తంగా ఈ చట్టం పటిష్టంగా అమలు చేసేందుకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖ చర్యలు తీసుకుంది. అయితే మన రాష్ట్రంలో ఈ చట్టం అమలు చేసిన పరిస్థితులు కూడా పెద్దగా లేవు.

క్రైస్తవులను, ముస్లింలను బుజ్జగించడం, ప్రోత్సహించడం వంటి పనులు తప్పించి వారికి వ్యతిరేకంగా ఈ ప్రభుత్వం ఒక్క పనీ చేయలేదు. అసలు హిందువులపై. హిందూ ధర్మంపై ఇతర మతాల నుంచి దాడులు జరుగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీనిపై బీజేపీ తీవ్ర పోరాట చేసింది. ఇదిలాఉంటే, ఈ అంశంపై నాలుగేళ్లుగా ఒక్కమాట కూడా మాట్లాడని జగన్, ఎన్నికలకు ఒక ఏడాది ముందు హడావిడిగా దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేయించడం ఓట్ల రాజకీయం కోసమే.

**బీజేపీ ఆగ్రహం**


సీఎం జగన్మోహనరెడ్డి దళితుల్ని మోసగించే నిర్ణయాలు తీసుకొంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఆరోపించారు. మతంమారినవారిని క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చడాన్ని నిరసిస్తూ ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో పార్టీ మార్చి 27న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టింది.

ఓట్ల కోసం జగన్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అసలైనవారికి తీరని అన్యాయం జరుగుతుందని బీజేపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మతాలు మారిన అనేక మంది ఎస్సీలకు హిందూమతంలోనే ఉన్నట్లు చెప్పి ఎస్సీ సర్టిఫికెట్లతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులుగా పోటీ చేస్తున్నారు.

ఇక కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేలా వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాలు చేస్తోంది. సుప్రీంకోర్టులో ఉన్న అంశంపై ఎలా తీర్మానం చేస్తారు? ఎస్సీలు ఇప్పటికే సరైన ఉద్యోగాల్లేక ఇబ్బంది పడుతుంటే అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా జగన్ ప్రభుత్వం తీర్మానాలు చేయడం గర్హనీయం అని బీజేపీ మండి పడింది. దీనిపై రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. ★

## ధ్యాస, శ్వాస సంఘమే

'రెండు డబ్బాల పర్యటన కార్యకర్త'గా ప్రసిద్ధి చెందిన పేరేపు వెంకట్రావు (87) మార్చి 27న భాగ్యనగర్‌లో స్వర్గస్తులయ్యారు. ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పొందూరు. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వెంకట్రావు ఉదయం శాఖకు బయల్దేరే టప్పుడు తన స్కూటర్ డిక్కీలోకి ఒక ప్యాంటు, రెండు డబ్బాలు కూడా చేరేవి. నిక్కర్ ధరించి శాఖకి బయలు దేరిన ఆయన శాఖ అనంతరం గటపని, స్వయం సేవకుల కుటుం బాలనూ కలిసే వారు. ఎవరో ఒకరి ఇంట్లో నిక్కర్ మార్చుకొని ప్యాంటు వేసుకునేవారు. ఇక అక్కడే ఒక డబ్బా తెరిచి టిఫిన్ పూర్తిచేసి తాను పనిచేస్తున్న సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి వెళ్లి విధుల్లో నిమగ్నమయ్యేవారు. రెండవ డబ్బాతో మధ్యాహ్న భోజనం పూర్తిచేసి సాయంత్రం 5 గంటలకు శాఖా పర్యటన పూర్తిచేసుకొని రాత్రికి ఇంటికి చేరేవారు. ఇదీ ఆయన దినచర్య.




నివాళి
**(1936–2023)**

వెంకట్రావు శారీరక ప్రదర్శన విభాగంలో దిట్ట. 1974లో భాగ్యనగర్‌లో జరిగిన ప్రథమవర్షకు ఆయన ముఖ్యశిక్షక్‌గా పనిచేశారు. ఆ తర్వాత అనేక శిక్షావర్గలలో శారీరక్ యోజనలో ప్రధానంగా ఉండేవారు. భాగ్యనగర్ విభాగ్ కార్యవాహగా సుమారు దశాబ్ద కాలానికి పైగా పనిచేశారు. సద్గురు శివానంద మూర్తి ఈయన గురువు. శివానందమూర్తి మార్గదర్శనంలో దేశ క్షేమం కోరి వెంకట్రావు వివిధ ప్రాంతాలలో 108 యజ్ఞాలను నిర్వహించారు. వెంకట్రావు వివిధ బైఠక్‌ల్లో పాల్గొని లక్ష్యసాధనకు చాలా సహజమైన పద్ధతుల్ని కార్యకర్తలకు వివరించి వారిలో ఉత్సాహం నింపేవారు. అంతేకాదు, కార్యకర్తల పొరపాట్లను సున్నితంగా సవరించేవారు. వెంకట్రావు స్వయం సేవకులతోనే కాదు, ఎవరితోనైనా ఆత్మీయంగా మాట్లాడేవారు. ఇది ఆయన సహజ స్వభావం. స్వయం సేవకులతో, కార్యకర్యలతో ఆయన ఏ పని చేయిస్తున్నా సృజనాత్మకతకు పెద్దపీట వేసేవారు. ఇది ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అందుకే వెంకట్రావు ఎందరో కార్యకర్తల హృదయాల్లో స్థానం పదిలం చేసుకున్నారు.

ఆయన శ్రీమతి వెంకట సూర్యలక్ష్మి శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ఉపాధ్యాయురాలిగా జీవిత పర్యంతం పనిచేశారు. ఆమె రెండు సంవత్సరాల క్రితం స్వర్గస్తులయ్యారు. ★

# ప్రజ్ఞావంతుడు సుమంత్రుడు



రామాయణంలో సుమంత్రుడి పాత్ర ఎన్నదగినది. ఆ గ్రంథం గొప్పతనాన్ని వివరించేటప్పుడు రాముడి లాంటి కథానాయకుడు, సీత వంటి సాధ్వి, హనుమ వంటి బంటు, లక్ష్మణుడి వంటి సోదరుడు, సుమంత్రుడి లాంటి మంత్రి… అంటూ సుమంత్రుణ్ణి కూడా తప్పనిసరిగా చేర్చుతారు. 'సు' అంటే మంచి, 'మంత్రుడు' అంటే మంత్రాంగం తెలిసిన వాడు అని అర్థం. ఆ పేరుకు సార్థకత చేకూర్చినవాడు సుమంత్రుడు.

రాజనీతిజ్ఞులైన ఎనిమిది సభ్యులు గల దశరథుని మంత్రిమండలికి సుమంత్రుడు ప్రధాన మంత్రి. దశరథుడికి అత్యంత విశ్వసనీయమైనవాడు. దశరథ మహారాజు పుత్రకామేష్టి యాగం తలపెట్టినప్పుడు అందుకు కావలసిన ఏర్పాట్ల నుంచి ప్రతి విషయాన్నీ దగ్గర ఉండి చూసుకున్నాడు. పాలనాపరమైన వ్యవహారాలలోనే కాదు, కుటుంబానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలన్నింటిలోనూ దశరథుడికి సలహాలు ఇచ్చేవాడు. రాముడికి, భరతుడికి అండదండలు అందించాడు.

రాముడికి రేపే రాజ్యాభిషేకం అని దశరథుడు ప్రకటించిన తరువాత సభాసదులందరు సంబరంగా తమతమ ఇళ్లకు వెళ్లాక, రాముడిని మరల చూడాలని ఉన్నదన్న తన తపనను తెలిపి రాముడిని తీసుకురమ్మని చెప్పిందీ సుమంత్రునికే.

సూర్యోదయం కావడం, కులగురువు వశిష్ఠాదులు రాజ్యాభిషేకానికి కావల్సిన సామగ్రిని సిద్ధం చేసుకొని అంతఃపురంలోనికి ప్రవేశించి, 'సుమంత్రా! మా రాకను వెంటనే మహారాజా వారికి తెలిపి, వారిని తీసుకొని రా' అని చెప్పారు. అంతఃపుర ప్రవేశానికి సుమంత్రునికి ఎవరూ అడ్డుచెప్పరు. ఎందుకంటే ఆయన రాకపోకలకు అడ్డుచెప్పకూడదని దశరథుని ఆదేశం. రాజగృహంలోనికి ప్రవేశించిన సుమంత్రుడు మహారాజును మేల్కొలుపుతూ యుక్తాయుక్తంగా స్తుతించగా, 'సుమంత్రా! నీ స్తోత్రాలన్నీ నా హృదయాన్ని చీల్చివేస్తున్నాయి' అని దీనంగా పలికిన మహారాజును చూసి ఖిన్నుడయ్యాడు. 'వెంటనే రాముని ఇక్కడకు తీసుకురండ'ని కైకేయి ఆదేశించగా, 'అది నా ఆజ్ఞగానే స్వీకరించి రాముని ఇక్కడకు తీసుకొని రా' అన్న మహారాజు మాటలతో రామ మందిరానికి బయలుదేరాడు. రామమందిరానికి చేరిన సుమంత్రుడి రాక గురించి ద్వారపాలకుడు సమాచారం అందించాడు. ఏకాంత గృహంలో సీతతో కలసి ఉన్నా, వచ్చింది తండ్రికి సన్నిహితుడు, తనకి అత్యంత గౌరవపాత్రుడు కావటం వలన వెంటనే సగౌరవంగా పిలిపించుకున్నాడు రాముడు. 'కౌసల్యా పుత్రా! దశరథ మహారాజు, కైకేయి ఉన్న ఫళంగా తీసుకురమ్మన్నారని చెప్పడమే కాకుండా, రాముడు అధిష్టించిన రథానికి తానే స్వయంగా సారథ్యం వహించాడు.

వనవాసానికి

## ❄ 'మొక్క'బడి ❄

ఎడారి ప్రాంతాల్లో పెరిగే బ్రహ్మజెముడు మొక్క గురించి అందరికీ తెలిసే ఉంటుంది. ఇది నీటి ఎద్దడిని తట్టుకుని ఇసుక నేలల్లో 10 నుంచి 20 అడుగుల ఎత్తు పెరుగుతుంది. సాధారణంగా ఈ మొక్కలు నీటిని తమ కాండంలో నిల్వ ఉంచుకునే శక్తి కలిగి ఉంటాయి. నిలువెల్లా ముళ్లుండే బ్రహ్మజెముడు మొక్కలను వ్యవసాయ పంట రక్షణ కొరకు పొలం చుట్టూ కంచెగా పెంచుతారు.

ఒకసారి నాటితే చాలు… తీవ్ర కరువొచ్చినా, తుపాన్లు వచ్చినా తట్టుకొని బతికి పండ్లను అందించే మొక్కలివి. భూసారం లేని, ఇసుక నేలల్లో, అటవీ భూముల్లో తనంతట తానే పెరిగే కరువు నేలల మొక్క. దీనికి ఎరువులు, పురుగు మందుల అవసరం లేదు. వర్షం పడినప్పుడు నీటిని పీల్చుకొని తన ఆకుల్లోనే నీటిని నిల్వ ఉంచుకుంటుంది.




విత్తనాలు కూడా అవసరం లేదు. మొక్కలోని ఆకులు తీసి పక్కన పాతితే ఈ చెట్లు పెరుగుతాయి. అంగోలా, మెక్సికో, మొరాకో, సిసిలీ, పోర్చుగల్ దేశాల్లో ఈ మొక్కలను సాగు చేస్తున్నారు. మెక్సికోలో జన్యుపరంగా అభివృద్ధి చేసి ముళ్ల లేని బ్రహ్మజెముడు వంగడాన్ని రూపొందించి సాగు చేస్తున్నారు. బీట్‌రూట్ అందించే పోషక విలువలను ఇది అందిస్తుంది.

అంతేకాదు, డ్రాగన్ ఫ్రూట్ కన్న అధిక పోషక విలువలు కల్గిన బ్రహ్మజెముడు పంటకు ఎలాంటి ఖర్చు ఉండదు. ఎరుపు, గులాబి రంగులో ఉండే

### దోర్బల పూర్ణిమాస్వాతి

బయలుదేరిన రాముడు తండ్రి వద్ద సెలవు తీసుకునేందుకు సీతాలక్ష్మణులతో రాజప్రాసాదంలోకి అడుగుపెట్టి దుఃఖిస్తూ దీనంగా వున్న సుమంత్రునితో 'సుమంత్రా! నేను అడవులకు పోవటానికి సిద్ధమై, తండ్రిగారి దర్శనం కోసం వచ్చాను. ఈ విషయాన్ని తండ్రిగారికి చెప్పండి' అన్నాడు. అడవులకు వెళుతున్న రాముని చూసి, దశరథుడు మహాదుఃఖంతో మూర్ఛిల్లగా, నీతివేత్తయైన సుమంత్రుడు వాడియైన మాటలతో, కఠినంగా, నిష్ఠూరంగా మాట్లాడినా, చలించక, దయచూపని కైకేయిని చూస్తూ బాధను తట్టుకోలేక, నీ తల్లి మూర్ఖత్వమే నీకూ వచ్చిందంటూ ఆమె జన్మ రహస్యం గురించి చెప్పి, నిందించి, ఆపై ఎంతగానో బతిమాలాడు.

రథాన్ని నడపడంలో నేర్పరి అయిన సుమంత్రుడు రాముడిని అడవికి సాగనంపేందుకు సిద్ధమైన రథాన్ని కదిల్చాడు. రథాన్ని ఆపాలని అశ్రుపూరిత నేత్రాలతో దశరథుడు, వేగంగా నడపాలన్న రాముడు ఆదేశాలతో ఇద్దరి మధ్య వేదననుభవిస్తూ రాముడి మాటను పాటించాడు. తమసానదీ తీరాన ఆయన ఏర్పాటు చేసిన బసలోనే సీతారామలక్ష్మణులు విశ్రమించారు. తెల్లారాక వారిని గంగానదిని దాటించడానికి గుహుడు నావను సిద్ధం చేశాక, రాముడు ప్రేమపూర్వకంగా సుమంత్రుని భుజం తట్టుతూ, సుమంత్రా! నువ్విక అయోధ్యకు వెళ్లు అని సూచించాడు. అందుకు విలపిస్తూ వెళ్లలేనని చెప్పగా, 'సుమంత్రా! మా ఇక్ష్వాకువంశానికి ఎన్నడూ నీవంటి విశ్వాసపాత్రుడైన సన్నిహితుడు లేడు. దశరథ మహారాజు నన్ను తలచుకొని దుఃఖించకుండా, ఆయన్ను దగ్గరుండి ఓదారుస్తూ ఉండు. ఈ పనిని నువ్వు తప్ప ఇతరులెవ్వరూ చేయలేరు. జితేంద్రియుడు అయిన నా తండ్రికి నా నమస్కారం అందజేయగలవు' అని రాముడు చెప్పడంతో, అయోధ్యకు తిరుగు ప్రయాణం అయ్యాడు సుమంత్రుడు. ఆయన అయోధ్యకు చేరి, రాముని సందేశాన్ని వినిపించి, దశరథ కౌసల్యాదులను ఓదార్చారు. ఈ సంఘటనలలో సుమంత్రుడి మంత్రాంగమే కాదు, ఉత్తమ దూత లక్షణం, హితాన్ని కోరుకునే తత్వం ప్రస్ఫుటమౌతాయి.

ఇక ఉత్తరకాండకు వస్తే–లోకాపవాదాన్ని రూపు మాపటం కోసం రాముని ఆదేశంతో సీతమ్మను కానలకు పంపే క్రమంలో గంగానది ఆవలి ఒడ్డున ఆశ్రమం వద్ద దిగబెట్టే క్రమంలో పొలిమేరలు దాటేంతవరకు రథానికి సారథ్యం వహించింది సుమంత్రుడే. (అయితే, మనకు సినిమాలలో మాత్రం లక్ష్మణుడే రథాన్ని నడిపించినట్లు చూపిస్తారు). ఆకాశంలో చందమామ కావాలని మారాం చేస్తున్న బాల రాముడికి అద్దం తెప్పించి అందులో చందమామను చూపించింది సుమంత్రుడే. ఇలా రామాయణంలో సుమంత్రుడు పాత్ర ఎంతో ప్రశస్తమైనది. ★

దీని పండ్లతో  జామ్స్, స్వాకష్, ఐస్‌క్రీమ్స్, జ్యూస్, జెల్లీలు తయారు చేసుకోవచ్చు. పండ్లు గింజల నుంచి నూనె కూడా తీయవచ్చు. ఇందులో బి12, ఎ, ఇ విటమిన్లు ఉన్నాయి. ఈ పండులో పోషక విలువతోపాటు ఔషధ గుణాలు ఉన్నాయని, కాలేయ వ్యాధులు, క్యాన్సర్ వ్యాధి, స్థూలకాయం, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలను తగ్గిస్తాయి. వీటిలో కార్బోహైడ్రేడ్లు, విటమిన్లు, పీచు పదార్థాలు అధికంగా ఇందులో ఉన్నాయి. ఈ పండుని అప్పుడప్పుడూ అయినా తీసుకోవాలని అంటున్నారు నిపుణులు.మొక్క జ్యూస్ లో క్యాలరీలు తక్కువగా ఉండి పోషక విలువలు సమృద్ధిగా ఉంటాయి. అతి బరువు సమస్యతో బాధపడేవారు కాక్టస్ జ్యూస్ ప్రతి రోజూ ఒక గ్లాస్ తాగడం వల్ల బరువును తొందరగా తగ్గించుకోవచ్చు.

కాక్టస్ జాతి మొక్కల్లో విటమిన్ సి, అమైనో ఆమ్లాలు, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు శరీరంలోని వ్యాధి కారకాలను తొలగించి కణాల ఎదుగుదలకు తోడ్పడి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుంది. జిడ్డు చర్మంతో బాధపడేవారు కాక్టస్ జెల్ తరచూ ముఖంపై మర్దన చేసుకుంటే జిడ్డుకు కారణమయ్యే సెబమ్ ద్రవం ఉత్పత్తిని నియంత్రించి జిడ్డు చర్మాన్ని తొలగిస్తుంది. కాక్టస్ మొక్కలో అధిక శాతం పీచు పదార్థం ఉండటం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ మెరుగుపడుతుంది. దీని రసాన్ని ప్రతిరోజు తాగడం వలన ఇందులో ఉండే కాల్షియం ఎముకలు, దంతాలు దృఢంగా ఉండేలా చేస్తుంది. ఏ వాసనా, ఎటువంటి ఉపయోగం లేకుండా కేవలం అలంకరణ కోసం విదేశీ క్రోటన్ మొక్కలు పెంచేకంటే ఖాళీస్థలంలో వీటిని, కలబంద మొక్కలను పెంచడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. ★

❄ తాత్వి'కత' ❄

# దేవుడి ప్రేమ

ఎనభై ఏళ్ల ఓ మనిషికి గుండె ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. రుసుం కింద ఎనిమిది లక్షల రూపాయలు కట్టాలంటూ డాక్టర్లు ఆయనకు చేతికి బిల్లు ఇచ్చారు. ఆ బిల్లు చూడటంతోనే ఆయన రోదించసాగాడు. బంధువులు ఎంత చెప్పినా ఆయన ఏడుపు ఆపలేదు. దాంతో ఓ వైద్యుడు 'అయ్యా! ఏడవకండి. ఈ ఆస్పత్రి నాది, పైవాళ్లతో మాట్లాడి మాకు వీలున్నంతవరకూ మీ బిల్లు తగ్గిస్తాను' అని నచ్చచెప్పాడు.

దానికి ఆ పెద్దాయన 'నాకది సమస్య కాదండి... బిల్లు పది లక్షలైనా పరవాలేదు. అది కట్టడానికి నేను సిద్ధంగానే ఉన్నాను. కానీ 80 ఏళ్లుగా ఏ సమస్యా లేకుండా ఉన్న నా హృదయాన్ని కాపాడుకుంటూ వచ్చిన దేవుడు ఏ రోజూ నన్ను ఒక్క పైసా కూడా అడగలేదు. ఇన్ని రోజులలో నేను చాలా తక్కువసార్లే దేవుడిని తలిచాను. అయినా అతనెప్పుడూ నేను తలవలేదని నా మీద కోపం చూపకుండా నా గుండెను పదిలంగానే చూస్తూ



వచ్చాడు. కానీ ఇప్పుడు అతనే నా కళ్లముందున్నాడు. అతనికి నేను కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. నన్ను ఇంతకాలమూ రక్షిస్తూ వచ్చిన అతనికి నా ఆనందబాష్పాలివి, అంతే తప్ప ఇవి బాధతో కార్చిన కన్నీళ్లు కావు' అని వివరించాడు.

'ఇక మీ విషయానికి వస్తే దాదాపు మూడు గంటలపాటు ఆపరేషన్ చేసి నా గుండెను కాపాడామంటూ ఎనిమిది లక్షల రూపాయలకు బిల్లు వేశారు. నేను డబ్బులు కట్టడం కట్టకపోవడం కాదండీ. నా నుంచి ఏదీ ఆశించకుండా దేవుడు ఇంతకాలమూ నా పట్ల చూపిస్తూ వచ్చిన కరుణను స్మరించుకుని అతనికి నా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నానండి. దేవుడు నిజంగా దాతేనండీ... అతనికెవరూ సాటి రారండీ..మనమే ఈ భూమ్మీద కృతఘ్నులుగా బతుకుతున్నాం... అందుకు సిగ్గు పడుతున్నానండీ...ఏదీ ఆశించకుండా ఎప్పుడూ కంటికి రెప్పలా చూసుకుంటున్న దేవుడిని మరచిపోవడం పెద్ద తప్పే... అతని ప్రేమ ముందు ఎవరైనా చిన్నబోవాల్సిందే... కనుక ఉన్నన్ని రోజులూ నేను దేవుడిని స్మరిస్తూనే ఉంటానండి అన్నాడా పెద్దాయన. ★




15


కాళిదాసు నెమ్మదిగా మాట్లాడాడు. "మహా ప్రభువులు తమకు తెలియనిదేమున్నది? దృశ్య కావ్యాలైన నాటకాలను సామాన్య ప్రేక్షక రంజక ములుగా మలచడం తప్పనిసరి. భరత ఖండం మీద యవనులు, శకులు దండయాత్రలు జరిపిన తర్వాత వారి సంస్కృతీ సంప్రదాయాల ప్రభావం భారతీయు లపై పడింది. అందుకే నాటకాలలోని నాయికను బేలగా సృష్టించడం, కథను మార్చి దుష్యంతుడామెను శాపవశమున మరచిపోయినట్టు చేయవలసి వచ్చింది."

''కావచ్చును... మా మిత్రుడిప్పుడే మీ 'మాళవికాగ్నిమిత్ర' నాటక కథను చెప్పినాడు. స్త్రీలపై ప్రేమ గురించిన ఆలోచన తప్ప మరే విషయమూ పట్టనివాడు మహారాజయితే వంశ నాశనమూ, రాజ్య నాశనమూ తప్పవు. మీ కవితాశక్తి అమోఘం. ఆ శక్తిని మహోన్నతమైన నాయక పాత్ర చిత్రణకు ఉపయోగించమని మా సూచన. శ్రీరామచంద్రుని మించిన పాలకుడెక్కడ? రామరాజ్యమన్న మాట ఎల్లకాలం నిలిచిపోదా?"

"ప్రభువుల ఆజ్ఞ మేరకు శ్రీరామచంద్రుడు జన్మించిన రఘువంశంలోని రాజులను కీర్తిస్తూ రచన చేయగలను. నాటక రచన ప్రజా ప్రియమునకే అని గ్రహించినాను. నా కావ్యరచన ప్రజాహితం కోసమే అగుగాక".

"త్వరలోనే ప్రారంభించగలరు!"

కాళిదాసు విక్రమాదిత్యుని వద్ద సెలవు తీసికొని వెళ్లిపోయాడు.



పాలంకి సత్య

మిహిరుడు విక్రముడితో ''కవుల రచనా విధానాన్ని ప్రభువు శాసించ వచ్చునా"? అన్నాడు.

"కవులను శాసించడమా? కవులు నిరంకుశు లని నాకు తెలియదా? నాయక పాత్ర చిత్రణ నా మనసుకు నచ్చలేదని చెప్పినాను. ఉత్తమ పాలక లక్షణాలు అగ్నిమిత్రునిలో కనిపించలేదన్నారు. ప్రజాహిత కార్యాలు నిర్వర్తించడం ప్రభువు ధర్మం. భోగాల మీదకు మనసు పోరాదు. పట్టాభిషేకం జరుపవలసిన ఘడియలో శ్రీరామచంద్రుడు వనవాస దీక్షను స్వీకరించినాడు. రాజు అనుసరించవలసినది ఆయన మార్గాన్నే".

"నిజమే" అన్న మిహిరుడు "యాత్రపై నేను రాస్తున్న గ్రంథం పూర్తి కావచ్చినది" అన్నాడు.

"నీ అలెక్సాండ్రియా యాత్ర త్వరలో జరుగ గలదు. రాబోవు శరదృతువులో వర్తక బృందమొకటి పారసీక, మెసపటోమియా, జూడియా దేశాల మీదుగా ఈజిప్టుకు బయలుదేరుతోంది. నీవు వారితో వెళ్లవచ్చును."

* * *

జగత్తుకు మాతాపితలైన పార్వతీ పరమేశ్వ రులను స్తుతించి, రఘువంశ కావ్య రచన ప్రారంభించినాడు కాళిదాసు. సూర్యుని నుంచే ఉద్భవించిన రఘు వంశమెక్కడ, తానెక్కడ అన్న భయం కలిగింది. తనకు తాను ధైర్యం చెప్పుకుని రాయడం సాగించాడు.

ముందుగా రాజుల గుణ గణాలను వర్ణించాడు. "జన్మ నుంచీ పరిశుద్ధులు, ఫలాన్ని ఆశించకుండా పనిచేసేవారు, అర్థుల కోరికలను తీర్చేవారు, అపరాధులను దండించేవారు, త్యాగం చేయడానికే ధనమార్జించేవారు, మితభాషులూ, సత్య వాక్కు కలిగినవారు, సంతానం కోసమే గృహస్థ ధర్మాన్ని స్వీకరించిన వారు" అంటూ మొదలుపెట్టి రఘు వంశీయుల అనేక లక్షణాలను కాళిదాసు తెలియజేశాడు. విక్రమాదిత్య మహారాజు రచించమన్నది ఇటువంటి ఉత్తమ పాలకుల గురించే కదా అన్న భావం కాళిదాసు మనసులో కదలాడింది.

రఘు మహారాజు దిగ్విజయాన్ని వర్ణిస్తూ రాసిన నాల్గవ సర్గ పూర్తయిన తర్వాత కాళిదాసు విక్రమాదిత్యుని దర్శించి, కావ్యాన్ని వినిపించాడు.

"మహాకవీ! రసరమ్యమైన కావ్యాన్ని మీ వలె సృష్టించడం ఇంకెవరికీ సాధ్యం కాదు. మీరు కవి కులగురువులు. మా ఆస్థానమును మీరు అలంకరించెదరు గాక".

ఒక శుభ ముహూర్తంలో కాళిదాసుకు ఆస్థానకవిగా అభిషేకం జరిగినది. విక్రమాదిత్యుడు ఆనందపరవశుడై సభా మందిరాన్ని వీక్షించాడు. వైద్యశాస్త్ర నిపుణుడు ధన్వంతరి, పదకోశ నిర్మాత అమరసింహుడు, భాషా శాస్త్రవేత్త వరరుచి, జ్యోతిశ్శాస్త్ర పండితుడు, తన ప్రియమిత్రుడు వరాహమిహిరుడు. పరిపాలనకునిగా అన్ని విద్యలనూ పోషించడం తన ధర్మం. భరత ఖండ రక్షణలో, సనాతన ధర్మ పరిరక్షణలో, విద్యా పోషణలో తన కర్తవ్యం నిర్వర్తించడంలో సర్వేశ్వరుడు తోడ్పడుగాక.

* * *

రాజాస్థానంలో కాళిదాసు అభిషేక మహోత్సవం చూసి ఇంటికి వచ్చిన వరాహమిహిరునికి తన మామగారైన డేరియస్ రాక ఆశ్చర్యాన్ని కలిగించింది. అతడు డేరియస్‌కు నమస్కరించి "మీ రాకను ముందుగా తెలియపరిస్తే నగర పరిసరాలలోనే ఎదురేగి ఉందును కదా!" అన్నాడు.

"మా కుమారులిరువురూ దక్షిణ భారతంలో కొనుగోలుకై బయలుదేరినారు. దౌహిత్రుని చూడడానికి నేను వారితో వచ్చినాను" డేరియస్ అన్నాడు. మిహిరుడు "కొంతకాలం మీరు ఇక్కడనే ఉండమని మనవి" అన్నాడు. ఆదిత్యదాసు కుమారుని మాటను బలపరచినాడు.

మరునాడు ఉదయ సంధ్యావందనమైన తర్వాత మిహిరుడు తన జనకులకూ, మామగారికీ తాను యవన జ్యోతిషాన్ని మరింత నేర్చుకొనడానికి



అలెక్సాంఁడియా వెళ్లగలననీ, చక్రవర్తి తనను పంపించేందుకు సహాయమందిస్తున్నారనీ చెప్పి, వారి ఆశీర్వాదాలు పొందాడు. ఛాయాదేవి కొంత అని ష్టాన్ని చూపినా, ఆపైన అంగీకరించి, దీవించింది.

ఏకాంతంలో ఖనా తన కోరికను వెలిబుచ్చింది. 'నేను కూడా మీతో వచ్చేందుకు అంగీకరించమని ప్రార్థిస్తున్నాను."

"ప్రార్థించడమేమిటి ప్రేయసీ! నీవు ఆజ్ఞాపించ వలసినదానవు. నేను నీ ఆజ్ఞను పాలించవలసిన వాడను".

"అయితే నేను రావచ్చును కదా!"

''ప్రియా! పారశీక రాజ్యానికైతే నేను అంగీకరించేవాడను. ఆపైన ఉన్నవి మ్లేచ్ఛదేశాలు. అనార్యులు ఏలే ప్రాంతాలకు నిన్ను తీసికొని వెళ్లలేను. స్త్రీలకు రక్షణ కానీ, గౌరవం కానీ లేని దేశాలలో నివసించడం శ్రేయోదాయకం కాదు".

"మిమ్ము వదలి ఉండలేను".

"ఖనా! విద్యావతివి, వివేకవతివి. నీవిట్లు మాట్లాడుట పాడికాదు. తండ్రిగారికి గురుకుల నిర్వహణలో తోడ్పడడం, మామగారికి సౌకర్యాలు సమకూర్చడం, కుమారునకు చదువు చెప్పడం నీ కర్తవ్యాలు. కర్తవ్య దీక్ష గురించి నీకు చెప్పవలసని పని లేదు. నేను త్వరలోనే తిరిగి రాగలను. నీ చిరునవ్వే నాకు శ్రీరామరక్ష".

ఖనా కన్నీళ్ల మధ్య నవ్వింది.

"అదిగో కుమారుడు సైతం నవ్వుతున్నాడు" అంటూ మిహిరుడు తన తనయుని వంక తదేకంగా చూస్తూ ఉండిపోయాడు.

* * *

వరాహమిహిరుని యాత్ర అతడు అనుకున్నట్లు ఆరంభం కాలేదు. వాయవ్య దిశ నుండి శకులు భరతఖండం మీద దండెత్తినారని వేగు వచ్చింది. వర్తకులు భూమార్గంలో రాకపోకలు ఆపి, భరుకచ్ఛం నుండి నౌకలలో వెళ్లేందుకు నిశ్చయించుకున్నారు. సముద్రయానం పాపకారకమని నమ్మకమున్న వరాహమిహిరుడు వారితో వెళ్లడానికి ఇష్టపడలేదు.

విక్రమాదిత్యుడు శకులను ఎదుర్కొనే ప్రయత్నాలు ప్రారంభించి, యుద్ధయాత్ర విషయమై తన పట్టమహిషితో సంభాషించాడు. వీరలక్ష్మీదేవి తాను కూడా యుద్ధంలో పాల్గొంటానని అన్నది.

**ఎండమూరి రామమూర్తి స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

"వీరా! నీ పరాక్రమం నాకు తెలియనిది కాదు. కానీ ఇదివరలో సేన కదలినప్పుడు నేను ఉజ్జయినీ రాజ్యానికి మాత్రమే పాలకుడను. నేడు పదునెనిమిది రాజ్యాలు మన వశంలో ఉన్నవి. వాటినన్నిటినీ రక్షించుకొనవలసిన అవసరమున్నది. రాజ్య పాలనను, రాజధాని రక్షణను నీవు స్వీకరించెదవు గాక".

"ప్రభువులు రాజ్యాలను జయించి, రాచ కన్యలను స్వీకరించెదరు గాక" అని మేలమాడిన భార్యతో విక్రముడు "అదేమి మాట?" అన్నాడు.

"పదునెనిమిది రాజ్యాలు వశమైనవానికి పదునెనిమిది కన్యలు వశం కావడంలో వింత ఏముంది?

"పదునెనిమిది రాజ్యాలను ఏలడం కన్నా, పదునెనిమిది మంది భార్యలను ఏలుకోవడం కష్టం సుమా!" విక్రముడు నవ్వుతూ అన్నాడు.

"అది సాధారణ పురుషులకు వర్తిస్తుంది. మీ వంటి మహావీరునికి, కళాకోవిదునికి అతిలోక సుందరునికి ఏ కన్య వశం కాకుండా ఉండగలదు?"

"నేను మాత్రం నీకు వశుడిని!"

కొంతసేపు సరస సంభాషణ, మరికొంతసేపు యుద్ధయాత్ర, రాజధాని రక్షణ, రాజ్య పరిపాలనపై చర్చ జరిగిన తర్వాత విక్రముడు స్కంధావార పరిశీలనకై కదిలాడు. తనను చూడడానికి రావలసిందని ఒక భటుని చేత వరాహమిహిరుని వద్దకు వార్త పంపించాడు.

సాయం సమయంలో వచ్చిన మిహిరుని తనతో పాటు రమ్మని విక్రముడన్నాడు. తన వలన ప్రయోజనమేమీ లేదనీ, తన రాక విక్రమునికి అవరోధం కాగలదనీ మిహిరుడన్నాడు.

"బహు భాషా కోవిదుడవు. యవన, పారశీక సంప్రదాయాలు తెలిసినవాడవు. నీవు నాతో ఉండడం అన్ని విధాలా ఉపయోగంగా ఉండగలదు."

వరాహమిహిరుడు, "మిత్రుని మాటను కాదనలేను. చక్రవర్తుల ఆజ్ఞను ఉల్లంఘించలేను" అన్నాడు.

విక్రముడు సన్నగా నవ్వాడు.

ఇంటికి వచ్చిన మిహిరుడు తల్లిదండ్రులకూ, మామగారికీ విషయం తెలిపి, వారి ఆశీర్వాదాలను స్వీకరించి, ఖనాను అనునయించి, ప్రయాణ ప్రయత్నాలు ప్రారంభించాడు.

* * *

శకులపై దండయాత్రకు ముహూర్తం నిశ్చయమైంది. పట్టమహిషీ, ఇతర రాణులూ విక్రమాదిత్య చక్రవర్తికి నీరాజనమిచ్చారు. వేద పండితులు స్వస్తి వాచకాలు పలుకుతుండగా, నగర కాంతలు పువ్వులనూ, లాజలనూ చల్లుతుండగా ఉజ్జయినీ సేన వాయువ్య దిశగా పయనమైంది. నేపాల రాజు మానదేవుడు తన సేనలోని ముఖ్య భాగాన్ని పాంచాల



దేశంలో విక్రమాదిత్యుని సేనను కలుసుకునేలా పంపించాడు. పాంచాలసేన యుద్ధానికి సిద్ధంగా ఉన్నది.

సర్వ సేనలనూ సమీకరించిన చక్రవర్తి వితస్తా నదినీ, సింధు నదినీ ఏయే భాగంలో ఎక్కడెక్కడ దాటాలో నిర్ణయించి, శత్రువులను ఎదుర్కొనే వ్యూహ రచన చేశాడు. జన నష్టం తక్కువగా ఉండేలా శకులను ముట్టడించే పద్ధతులను సేనాపతులకు వివరించాడు. తాను సూచించిన మార్గాలలోనే సేనను నడిపి, శత్రువులతో యుద్ధం చేయమని ఆదేశించాడు.

విక్రమాదిత్యుని రణనీతి శత్రువులను సులభంగా ఓడిపోయి, పరాజితులయ్యేలా చేసింది. పరాజితులను చంపరాదన్నది భారతీయుల యుద్ధనీతి. పారిపోతున్న వారిని వదలివేసిన పిదప విక్రమాదిత్యుడు "ఇప్పటిలో భరత భూమిపై ఎవరూ దండెత్తలేరు" అన్నారు.

"విక్రమాదిత్య చక్రవర్తికి జయము. శకారికి జయము" అన్న జయజయ ధ్వానాలు మిన్నంటాయి.

సైనికులు విజయోత్సాహంతో పండుగ జరుపుకుంటుండగా, విక్రమాదిత్యుడు సేనాధిపతులతో చర్చలు జరిపాడు. శకులు పరాజితులైన మాట నిజమే. వారు తిరిగి దండెత్తకుండా ఉండడానికై చేయవలసినదేమిటి? సరిహద్దులలో సేనను మోహరించి ఉంచటమా? తమ సేనను ముందుకు నడిపి వారి రాజ్యాలను జయించటమా? ఏ మార్గం మంచిది?

"సేనాధిపతులందరూ తమ అభిప్రాయాలను చెప్పిన తర్వాత విక్రమాదిత్యుడు "సేనను ముందుకు నడుపడమే మేలని మీలో ఎక్కువమంది ఉద్దేశంగా ఉంది. మాకును సేనతో ముందుకు కదలవలెననే ఉంది. కానీ రణయాత్ర శత్రు నిర్మూలనానికే కారాదు. భరతఖండ వీరపరాక్రమాలను ప్రదర్శించడమే ముఖ్యోద్దేశం. మన భూమి మీద దండెత్తే ఆలోచనను శకులు పూర్తిగా విస్మరించాలి. మన ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలనూ వారికి తెలియజేయాలి తప్ప వారి సంప్రదాయాలను తిరస్కరించరాదు" అన్నాడు.

"ప్రభూ! పారశీక దేశానికి ఆవల యవన రాజ్యముంది. ఒకప్పుడు పారశీక వారి ఏలుబడిలోనే ఉండేది. గ్రీకు రాజులైన అలెక్సాండరు, సెల్యూకస్ భరతభూమిపై దండెత్తి భంగపడిన విషయం ప్రభువులకు తెలియనిది కాదు. తమకంగీకారమైతే, మన రణయాత్రను పొడిగించవచ్చును" అని నేపాల సైన్యాధ్యక్షుడన్నాడు.

విక్రమాదిత్యుని ఆమోదంతో సభ ముగిసింది. మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం సేన ముందుకు సాగి పారసీక రాజధానిని ముట్టడించింది.

* * *

యుద్ధంతో ఏ విధమైన సంబంధాన్ని పెట్టుకోకుండా, వరాహమిహిరుడు కాలి నడకన నగరంలోకి ప్రవేశించాడు. అడ్డగించిన రాజభటులతో తన యవన జ్యోతిష గురువులను కలవడానికి వెడుతున్నానని చెప్పి, ఆయన నివాసముండే ప్రదేశం గురించి తెలిపాడు. రాజ భటులలో ఒకడు మాత్రమతని వెంట వచ్చి, మిహిరుడు గృహంలోనికి వెళ్లిన తర్వాత కొంతసేపు నిలబడి వెళ్లిపోయాడు.

యవన పండితుడు శిష్యుని సాదరంగా లోనికి తీసుకుని వెళ్లాడు. ఆయన సంతోషంగా "నీ వంటి శిష్యుడు లభించడం నా అదృష్టం. కొంతకాలం నావద్ద ఉండమనే సాహసం చేయలేను. నగరాన్ని శత్రుసేన ముట్టడించినదన్న వార్త ఇప్పుడే తెలిసింది. నీవు వెంటనే అలెక్సాండ్రియాకు ప్రయాణం కట్టడం మంచిది" అన్నాడు.

"గురువర్యా! భయపడవలసిన అవసరం లేదు. భరతఖండ చక్రవర్తి, ఉజ్జయినీ పతి విక్రమాదిత్యుడు సేనా సమేతంగా దండెత్తినారు. ఈ దండయాత్ర కేవలం బల ప్రదర్శనకే. ఇకపై శకులు కానీ, పార్థియనులు కానీ భరతభూమిని ఆక్రమించే ప్రయత్నం చేయరాదన్నదే వారి ఉద్దేశం. పౌరులకు ఎటువంటి హానీ జరగదు".

గురువులో భయం కొంతవరకూ తగ్గినది. గురుశిష్యులిద్దరూ అనేక శాస్త్ర విషయాలు చర్చించుకున్నారు. చివరిగా ఆయన "మిహిరా, నీకు నేర్పిన విద్య కన్నా నీవద్ద నేను నేర్చుకున్నదే ఎక్కువ. ఈ సంగతిని ఇదివరకే నీతో చెప్పినట్లు గుర్తు" అన్నాడు.

అలెక్సాండ్రియా నుంచి తిరిగి వచ్చేటప్పుడు తిరిగి దర్శనం చేసుకుంటానని చెప్పి వెలుపలకు వచ్చిన మిహిరుని మనస్సులో ఒక ఆలోచన మెరుపు వలె మెరిసింది. తాను రచించిపబోయే యవన సిద్ధాంత గ్రంథాన్ని గురువుల పేరుతో వెలయించుట తన ధర్మం. ఆయన పేరు పాల్. సిద్ధాంతానికి పౌలిశ సిద్ధాంతమన్న పేరు సరి అయినది. ఆ ఊహ వరాహమిహిరునికి తృప్తినిచ్చింది.

(సశేషం)



# ఈశాన్యంలో సంఘం సేవే కమలానికి త్రోవ

ఈశాన్య రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ (బిజేపీ) చాలా బలమైన శక్తిగా ఎదిగింది. ఇటీవల జరిగిన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో బిజేపీ, దాని సారథ్యంలోని ప్రాంతీయ కూటమి ఎన్ఈడీఏ విజయ పరంపర కొనసాగింది. ఒక్కప్పుడు కమ్యూనిస్టుల కంచుకోటగా ఉన్న త్రిపురలో వరుసగా రెండవసారి బిజేపీ విజయకేతనం ఎగరేసింది. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు కలిసి పోటీ చేసినా, వ్రతం చెడిందే కానీ ఫలితం మాత్రం దక్కలేదు. ఒక్క త్రిపురలోనే కాదు, నాగాలాండ్‌లోనూ బిజేపీ కూటమి విజయం సాధించింది. హంగ్ ఏర్పడిన మేఘాలయలోనూ బిజేపీ భాగసామ్య పక్షంగా అధికారంలో వుంది. నిజానికి ఈ మూడు రాష్ట్రాలలో మాత్రమే కాదు, ఈశాన్య భారతం లోని ఎనిమిది రాష్ట్రాలలో బిజేపీ అడుగులు బలంగా పడుతున్నాయి. కాషాయ దళం పాద ముద్రలు స్పష్టమవుతున్నాయి.


నిజానికి, క్రైస్తవ జనాభా అధికంగా ఉన్న ఈశాన్య రాష్ట్రాలలో హిందూ జాతీయవాద పార్టీగా ముద్ర పడిన బీజేపీ గెలుపు ఎవరూ ఊహించింది కాదు. అందుకే, 2018లో బీజేపీ అక్కడ తొలి విజయం సొంతం చేసుకున్న సమయంలో, ఆ కమల వికాసాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అస్సాం ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వశర్మ వ్యూహ చాతుర్యం, మాయాజాలంగా పేర్కొని తలలు పండిన రాజకీయ విశ్లేషకులు కూడా ఆత్మతృప్తి పొందారు. ముఖ్యంగా, 'ఎర్ర' చొక్కా మేధావులకు అయితే, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు ఇప్పటికీ మింగుడు పడడం లేదు.

అయితే, ఈ విజయానికి ఏది కారణం? అంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం గడచిన ఎనిమిదేళ్లలో చేసి చూపిన అభివృద్ధి, విభిన్న జాతుల మధ్య సాధించిన సయోధ్య ప్రధాన కారణాలుగా పేర్కొంటారు. 'మోదీ ప్రభుత్వం వేసిన బాటలు, కమలదళం కలను సాకారం చేశాయి' అనే సమాధానం వస్తుంది. అందులో అనుమానం లేదు. అతిశయోక్తి అసలే లేదు. కానీ, అదొక్కటే కారణమా? అంటే కాదు. దేశంలో, మరీ ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలలో చోటు చేసుకుంటున్న రాజకీయ, సామాజిక మార్పులకు మోదీ తెచ్చిన మార్పులే కారణం అనుకుంటే, అది సత్యమే, కానీ సంపూర్ణ సత్యం కాదు. అర్థసత్యమే మాత్రమే అవుతుంది. గడచిన ఎనిమిదేళ్లలో దేశంలో, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల రాజకీయ, సామాజిక ముఖచిత్రంలో వచ్చిన మార్పులకు, మోదీ పాలన ఒక సాధనం అయితే కావచ్చును కానీ, కేవలం ఎనిమిదేళ్ల మోదీ ప్రభుత్వ పాలన కారణంగానే ఈశాన్య రాష్ట్రాలలో మార్పు, పరివర్తన వచ్చిందని అనుకుంటే పొరపాటే అవుతుంది. నిజానికి ఎన్నో దశాబ్దాలుగా ఎందరో అజ్ఞాత యోధుల (అన్‌సంగ్ హీరోస్) త్యాగధనులు, సాగించిన అవిశ్రాంత కృషి, త్యాగాల ఫలితంగానే ఈరోజున దేశంలో, మరీ ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలలో జాతీయ భావజాల ప్రభుత్వాలు మళ్లీమళ్లీ అధికారంలో వస్తున్నాయి. అదో పరంపరగా కొనసాగుతోంది.

ఎన్నో దశాబ్దాలుగా సవాళ్లను ఎదుర్కొంటూ, ఎలాంటి గుర్తింపు, గౌరవం ఆశించకుండా సామాజిక, రాజకీయ మార్పు కోసం కృషి చేస్తున్న వారు అజ్ఞాత హీరోలు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్వయంసేవకులు, ప్రచారకులు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన ప్రచారకులు చేసిన త్యాగాల ఫలితంగానే ఈ రోజున ఈశాన్య భారతంలో కాషాయ జెండా రెపరెపలాడుతోంది. విజయం వెంట విజయంతో ముందుకు సాగుతోంది.

ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే, అనేక పొరుగు దేశాలకు సరిహద్దుగా ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు ఒకప్పుడు భారతీయ జాతీయ స్రవంతిలో చెప్పుకోదగిన స్థానం లేదు. జాతీయ రాజకీయాల లోనే కాదు, జాతీయ మీడియాలోనూ, ఈశాన్య రాష్ట్రాలకు పెద్దగా ప్రాధాన్యం ఉండేది కాదు. జాతీయ వార్తా ఛానల్స్'లో ఈశాన్య రాష్ట్రాల ప్రస్తావన అసలే ఉండేది కాదు. ఉగ్రవాదుల దాడులు లేదా ఎన్నికలకు సంబంధించిన ప్రస్తావనలు తప్ప. మహాభారత పరంపరకు ప్రతీకగా నిలిచిన ఈశాన్య రాష్ట్రాల సంస్కృతీ, సంప్రదా యాలు, అభివృద్ధికి సంబంధించిన చర్చ, జాతీయ చానల్స్' పట్టించుకున్న సందర్భాలు ఇంచుమించుగా లేవనే చెప్పవచ్చును. కానీ ఈ రోజున ఈశాన్య రాష్ట్రాల ప్రస్తావన లేకుండా ఎక్కడా, ఎలాంటి చర్చ ముందుకు సాగడం లేదు. ఇప్పుడు ఈశాన్య భారతం, దేశానికి దగ్గరైంది. గతంలో దూరాన్ని పెంచిన రోడ్ బారికేడ్లు ఇప్పుడు లేవు. ఈశాన్య భారత్ మధ్య దూర భారం తొలిగి పోయింది.

గతంలో, రాజకీయ పార్టీలు ఈశాన్య రాష్ట్రాలను ఎన్నికల సమయంలో మాత్రమే తెరచుకునే ఓట్ల గిడ్డంగిగా పరిగణించాయి. ఎన్నికల సమయంలో స్థానిక చర్చి పెద్దలు, వేర్పాటువాదులు, నిగూఢ ముస్లిం నాయకుల సహకారంతో ఓట్లు వేయించుకుని ఎన్నికలలో గెలిచిన తర్వాత, కేంద్రం ఇచ్చే అభివృద్ధి నిధులను అరగించడం అలవాటుగా మలచు కున్నారు. అందుకే, ఎన్నో దశాబ్దాలుగా ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధికి నోచుకోలేదు. అయితే మోదీ ప్రధాని అయిన తర్వాత, దేశ అభివృద్ధిని నిర్వచించే ఈశాన్య భారతంపై దృష్టి కేంద్రీకరించారు. అంతవరకు ఉపేక్షకు గురైన అష్టలక్ష్మీ స్థావరం



**రతన్ శార్ద**
ప్రముఖ రచయిత, కాలమిస్ట్

ఈశాన్య భారతం అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా బాటలు వేశారు.

గడచిన ఎనిమిది సంవత్సరాలలో ఈశాన్య భారత ముఖచిత్రం అనూహ్యంగా మారిపోయింది. ఈ ఎనిమిదేళ్లలో ఈశాన్య రాష్ట్రాలు ఎంతగానో అభివృద్ధి చెందాయి. అన్నిటినీ మించి ఇంతకాలం స్వదేశంలో పరాయివాళ్లుగా జీవిస్తూ వచ్చిన ఈశాన్యరాష్ట్రాల విభిన్నతెగల ప్రజల మనసుల నుంచి పరాయిభావన తొలగిపోయింది. ఇక ఎనిమిదేళ్ల అభివృద్ధి విషయానికి వస్తే, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సమ్మిళిత అభివృద్ధిలోని ఏ కోణాన్నీ బీజేపీ ప్రభుత్వాలు వదిలేయ లేదు. దీంతో ప్రజల్లో విశ్వాసం పెరిగి, అది ఆదరణగా మారింది. ఈశాన్య భారతం బీజేపీకి జై కొడుతోంది.

అందుకే 2018 విజయాలను, అమిత్ షా, హేమంత్ బిశ్వ శర్మ వ్యూహ చాతుర్యం, మాయా జాలంగా వర్ణించిన వారు 2023 విజయాలను ఆ విధంగా చూడలేక పోతున్నారు. జాతీయవాద



భావజాల విజయంగానే చూస్తున్నారు. నిజం.. క్రైస్తవ చర్చి ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాలలో ఐదేళ్ల పాలన తర్వాత, హిందూత్వ, మతతత్వ పార్టీగా అసత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న జాతీయ పార్టీ బీజేపీ తిరిగి విజయం సాధించడం సామాన్య విషయం, కాదు. అందుకే, ఈ విజయాన్ని బీజేపీ చేసి చూపిన సమ్మిళిత అభివృద్ధి నమూనా విజయంగా భావించవలసి ఉంటుంది. కాదంటే, వేర్పాటువాదానికి, తిరుగుబాటులకు పెట్టింది పేరుగా నిలిచిన ప్రాంతంలో, ఒక 'హిందు' జాతీయ పార్టీ, ప్రాతీయ పార్టీలతో కలిసి నాగాలాండ్‌లో 51 శాతం, మేఘాలయలో 41 శాతం, త్రిపురలో 39 శాతం ఓట్లు సాధించడం ఎలా సాధ్యం? అలాగే, ఈశాన్య భారతం, పరాయీకరణ, ఒంటరితనాన్ని వదిలి భారతీయతకు దగ్గరైంది. భారతీయ స్రవంతి ఒడికి చేరింది. అందుకే భారతీయ జాతీయవాదానికి వేదికగా నిలిచిన బీజేపీ ఈశాన్య రాష్ట్రాలలో ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగింది. అక్కడ రాజకీయ, సామాజిక పరివర్తనకు కేంద్ర బిందువుగా మారింది.

ఒకప్పుడు ఆగష్టు 15, (స్వాతంత్ర దినోత్సవం), జనవరి 26 (గణతంత్ర దినోత్సవం) జరుపుకోని, జాతీయ వేడుకలను బహిష్కరించి, గంటలు, రోజుల తరబడి బ్లాక్ డే పాటించిన ఈశాన్య భారతం, ఈ రోజున భారతీయ జాతీయ స్రవంతిలో సేద తీరుతోంది. ఒకప్పుడు 72 గంటల రోడ్డు బారికేడ్లు నిత్యకృత్యంగా మారిన ఈశాన్య భారతంలో ఇప్పుడు ఆ మాటే వినిపించడం లేదు. ఒకప్పుడు ప్రజల నుంచి సొంత పన్నులు వసూలు చేసిన సమాంతర ప్రభుత్వాలు సాగించిన అరాచకాలు చాలావరకు తెరమరుగయ్యాయి. ఈ మార్పులు, ఈ ప్రాంతానికి కావలసింది ఏమిటో కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ఇక్కడి ప్రజలు సోదర భావం కోరుకుంటున్నారు. నిజమైన అభివృద్ధిని, తమ జీవితాల్లో వెలుగును ఆకాంక్షిస్తున్నారు. అన్నిటినీ మించి సమానత్వాన్ని కోరుకుంటున్నారు.

అయితే, కాంగ్రెస్ పార్టీ ఈశాన్య రాష్ట్రాలను ఉపేక్షించడమే కాక 'చిన్న' రాష్ట్రాలు అంటూ చిన్న చూపు చూసింది. కానీ, కేంద్రంలో బీజేపీ అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రాష్ట్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీక రించారు. అయితే, ఈ తొమ్మిది సంవత్సరాలలోనే ఒక్కసారిగా ఇంత మార్పు వచ్చిందా? అంటే లేదు. దశాబ్దాలుగా ఎందరో అజ్ఞాత యోధులు, అన్సంగ్ హీరోస్' సాగింగించిన అవిశ్రాంత, నిస్వార్ధ కృషి ఫలితంగా ఈ మార్పు, ఈ పరివర్తన సాధ్యమైంది.

బీజేపీ సారథ్యంలోని అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వ హయాంలో రాజకీయంగా తొలి బీజం పడింది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడంతో పాటు అటల్జీ, సంఘ్ తలపెట్టిన పవిత్ర కార్యం పరిపూర్ణం చేయడంలో తొలి అడుగు పడింది. అయితే, ఆ తర్వాత పది సంవత్సరాలలో ఈశాన్య రాష్ట్రాల నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న రోజుల్లో దురదృష్టవశాత్తు అభివృద్ధి మంత్రం స్వరం మారింది. ఈశాన్య రాష్ట్రాలు 'చిన్న' రాష్ట్రాలు అనే చిన్నచూపు మళ్లీ తెరపైకొచ్చింది.

విదేశీ ప్రేక్షకులను ఉద్దేశించి గంభీర ఉపన్యాసాలు చేయడం వల్లనో, సోషల్ మీడియా, టీవీలలో ప్రముఖంగా ప్రచారం సాగించడం వల్లనో, జాతి నిర్మాణం జరగదు. ఈశాన్య విషయంలో ఇదే నిజం మరో మరు రుజువైంది. నేను చెపుతున్న జాతి నిర్మాణ ప్రక్రియ 70 ఏళ్ల క్రితం, 1950లో ఆర్ఎస్ఎస్ 10 మంది ప్రచారకుల బృందాన్ని అప్పట్లో అస్సాంగా పిలిచే ఈశాన్య ప్రాంతానికి పంపడంతో మొదలైంది. అంతకు ముందు అప్పటి సర్ కార్యవాహ శ్రీ ఏకనాథ్ రనడే, అస్సాం (పూర్తి ఈశాన్య ప్రాంతం, నార్త్–ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజెన్సీ)లో నెల రోజులు విస్తృతంగా పర్యటించారు. అక్కడి నుంచి మహారాష్ట్రకు తిరిగి వచ్చిన తర్వాత, సంఘ్ శిక్షావర్గలో పాల్గొన్నారు. మహారాష్ట్ర సంఘ చాలక్ శ్రీ బాబురావ్ భిడేకు ఈశాన్య ప్రాంత పరిస్థితిని వివరించి, పెద్ద సంఖ్యలో ప్రచారకులను అస్సాంకు పంపాలని కోరారు. అస్సాంలో తక్షణమే పెద్ద ఎత్తున సంఘ్ కార్యాన్ని ప్రారంభించాలని, లేదంటే చర్చి మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న వేర్పాటువాదుల కార్యకలాపాల కారణంగా రానున్న 30 ఏళ్లలో అస్సాం మొత్తం భారతదేశానికి దూర మవుతుందని చెప్పారు. ఇదే విషయంపై ఆయన శిక్షా వర్గలో ప్రసంగించారు. ఆ వెంటనే అస్సాంకు పదిమంది ప్రచారకుల బృందం బయలుదేరింది.

అయితే, చేతిలో సరైన వనరులు, సామాజిక, రాజకీయ మద్దతు లేకుండా సంఘ్ కార్యాన్ని ముందుకు తీసుకుపోవడం మాములు వ్యవహారం కాదు. కత్తి మీద సాము కంటే కష్టమైన కార్యం, అంతేకాదు, 1836 నుంచి విభిన్న క్రైస్తవ తెగలకు చెందిన చర్చి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్న ప్రతికూల వాతావరణంలో పని చేయడం మాములు విషయం కాదు. చాలా చాలా కష్టతరమైన కార్యం. ఈశాన్య ప్రాంతం అంతటా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, ప్రచారకులు తీవ్ర ప్రతిఘటన, దాడులు ఎదుర్కొన్నారు. పరిశోధన, గ్రంథ రచన కోసం నేను కలిసిన ప్రచారకులు అందరూ ఇదే అనుభవం పంచుకున్నారు.

**వివాద పరిష్కారం**

సంఘ్ విధానం... అలాంటి పరిస్థితిలోనూ మారుమూల ప్రాంతాలలో పాఠశాలలు ప్రారంభించడం, సేవా కార్యక్రమాలు, గిరిజనులకు ప్రత్యేకంగా స్వయం పోషక కార్యక్రమాల ద్వారా



స్వయంసేవకులు, ప్రచారకులు సంఘ్ కార్యాన్ని ముందుకు తీసుకు పోయారు. అలాగే, రామకృష్ణ మిషన్ వంటి ఇతర సంస్థలు కూడా విద్యా, సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నాయి. క్రైస్తవ మత సంస్థలు, చర్చి నుంచి విపరీత దాడులు ఎదుర్కొం టున్న స్థానిక ఆచార వ్యవహారాలు, శతాబ్దాల సంప్రదాయాల రక్షణకు సంఘ్ మద్దతుగా నిలిచింది.

సంఘ్ ఈశాన్య ప్రాంతాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. పెద్ద సంఖ్యలో ప్రచారకులను పంపడంతో పాటుగా అవసరమైన వనరులు కల్పించడం, మహారాష్ట్రలో ఈశాన్య ప్రాంత విద్యార్థుల కోసం హాస్టల్స్ ప్రారంభించడం ద్వారా ఈశాన్య ప్రాంతాన్ని దత్తత తీసుకోవాలని మహారాష్ట్రను కోరింది. ప్రస్తుత పూజ్య సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ సహా మహారాష్ట్ర ప్రచారకులు అందరూ ఈశాన్య ప్రాంతంలో సుదీర్ఘ కాలం పని చేశారు. మరో ముఖ్య విషయం, 1964లో విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రారంభ సదస్సు ప్రయాగలో, రెండవ సదస్సు అస్సాంలో జరిగాయి. ఈ సదస్సులో విభిన్న ఈశాన్య గిరిజన తెగల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు, 'ప్రగతి శీలురు' 'మేము ప్రకృతిని, పశు పక్ష్యాదులను పూజిస్తాము, గొడ్డు మాంసం భుజిస్తాము కాబట్టి హిందువులము కాదు' అనే వాదన తీసుకొచ్చారు. అందుకు శ్రీ గురూజీ, హిందువులు అందరూ ప్రకృతి అరాధకులే, పశు పక్ష్యాదులను పూజించే వారే అని సమాధాన మిచ్చారు. గొడ్డు మాసం తినడం అనేది అనివార్యత వలన వచ్చిన అలవాటు, అంతకు మించిన మంచి ఆహారం లభిస్తే ఆ అలవాటు మారిపోతుంది., మరుగున పడి పోతుందని చెప్పారు. ఆవిధంగా స్థానిక దేశీయ విశ్వాసాల పునర్జీవనం మొదలైంది. ఇక అక్కడి నుంచి స్థిరంగా ముందుకు సాగుతూ వస్తోంది.

అందులో భాగంగా, గురూజీ ప్రేరణతో మణి పూర్‌లో పాఠశాల ప్రారంభించిన మహారాష్ట్రలోని థానేకు చెందిన భయ్యాజీ కానే, ఆ ప్రాంత వాసులలో తాము ఈ దేశస్థులం కాదు, పరాయి వారం అనే భావనను తొలిగించి, అక్కడి విద్యార్థుల మనసులలో సమైక్యతా భావనని నింపేందుకు, ముంబై పంపడంతో మొదలైన కార్యక్రమం 'స్టూడెంట్ ఎక్స్చేంజి' కార్యక్రమంగా దేశ వ్యాప్తంగా విస్త రించింది. విద్యార్థి పరిషత్. (ఏబీవీపీ) ఈ కార్యక్ర మాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఈశాన్య రాష్ట్రాల ప్రస్తుత రాజకీయ నాయకులలో చాలా మంది ఈ ప్రక్రియ ద్వారానే జాతీయ భావనకు దగ్గరయ్యారు. అలాగే, వనవాసీ కల్యాణ ఆశ్రమం ద్వారా ఎంతో మంది గిరిజన క్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు గౌరవం పొందారు. జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకుంటున్నారు.

అయితే ఇదంతా ఆషామాషీగా అవలేదు. స్వయం సేవకులు, ప్రచారకులు ఎన్నో కష్ట నష్టాలు భరించారు. 1999లో నలుగురు ప్రచారకులు హత్యకు గురయ్యారు. ఆ నలుగురు ప్రచారకులను, చర్చి సహకారంతో అపహరించుకు పోయిన దుండగులు, వారిని చిత్ర హింసలకు గురిచేశారు. చివరకు అత్యంత దారుణంగా, అతి కిరాతకంగా హత్య చేశారు. అయినా, ఇతర కార్యకర్తలు, ప్రచారకులు వెనకడుగు వేయలేదు. అదే స్ఫూర్తితో ముందుకు సాగారు. ఇంకెందరో ముందుకొచ్చారు. అందులో కొందరు అంతే దారుణంగా హత్యకు గురయ్యారు. అయిన సంఘ్ కార్యం ఆగలేదు. పవిత్ర గంగా ప్రవహంలా కొనసాగుతూనే వుంది.

ఇలా ఎందరో పుణ్య పురుషులు సాగించిన తపస్సు ఫలాల ఆధారంగా ప్రధాని మోదీ ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, పరివర్తనకు బృహత్ కార్యాన్ని ప్రారంభించారు. ప్రధాని మోదీ ఈ ప్రాంతంలో, ఇంతవరకు ప్రధానులు అందరూ కలిసి పర్యటించిన దానికంటే ఎక్కువగా మొత్తం 51 సార్లు పర్యటిం చారు. అలాగే 'ప్రతి 15 రోజులకు ఒక కేంద్ర మంత్రి ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నారు. ఈప్రాంత ప్రజలు వేగంగా సాగుతున్న అభివృద్ధి ఫలాలను అనుభ విస్తున్నారు. ఏవేవో ఉచిత పథకాల ద్వారా లభించే తాత్కాలిక ఫలాలు కాదు. పరివర్తన చక్రాల కదలిక ద్వారా అందుతున్న శాశ్వత ఫలాలు. అందుకే ఇప్పుడు ఈశాన్య భారతంలో బందులు లేవు, బందూకుల చప్పుళ్లు లేవు. ఉగ్రవాదులు , వేర్పాటు వాదుల గర్జనలు లేవు.

ఈ కారణంగానే నేను, 2023 ఎన్నికలలో మూడు ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఇచ్చిన తీర్పును బీజేపీ రాజకీయ విజయంగా భావించడం లేదు. ఈశాన్య ప్రాంతం భారత ప్రధాన జీవన స్రవంతి ఒడి చేరడంగా, ఇటు ఈశాన్య ప్రాంత ప్రజలలో అటు సమస్త భారతీయుల మనసులలో పూసిన సమైక్య పుష్పంగా భావిస్తాను. ఇదేదో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన 'మేరీ కొమ్' కథ కాదు. దేశ వ్యాప్తంగా హారతులు అందుకుంటున్న ఎందరో క్రీడాకారుల కథ. రాజకీయ పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి. అది కాదు విషయం. భారతదేశం, విభజిత, విచ్ఛిన్న రాజకీయాల శక్తులకు వ్యతిరేక ప్రభంజనంగా మారింది. అదీ విశేషం.

**'ఆర్గనైజర్' నుంచి**

**అను: రాజనాల బాలకృష్ణ**

# ఏప్రిల్ 3 నుంచి తిరుమలలో వసంతోత్సవాలు




**భక్తపరిపాలన కోసం వైకుంఠం నుంచి భూలోకానికి వేంచేసి ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్నాడు వేంకటనాథుడు. శతాబ్దాల తరబడి వివిధ పర్వదినాల సందర్భంగా విశిష్ట అర్చనాదులు స్వీకరిస్తున్న ఆయన శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఆరంభంలో మరో వేడుకకు (వసంతోత్సం) ముస్తాబవుతున్నాడు.**

**విష్ణువు అలంకార ప్రియుడు కాగా, ఆయన అవతారమూర్తి శ్రీనివాసుడు ఉత్సవ ప్రియుడు. ఆయన ఏడాది పొడవునా 450కి పైగా ఉత్సవాలు, సేవలు అందుకుంటున్నాడు. అవి వందల సంవత్సరాల నుంచి ఆయా మాసాలలో నిర్దిష్టంగా కొనసాగుతూ వస్తున్నాయి. అలాంటి వాటిలో వార్షిక వసంతోత్సవం ఒకటి. నూతన సంవత్సరం (చైత్రమాసం)లో జరగడం దీని ప్రత్యేకత. ఈ ఉత్సవం సాధారణ శకం 1360లో ప్రారంభమైందని ఆలయ రికార్డులను బట్టి తెలుస్తోంది. ఏటా చైత్ర శుద్ధ త్రయోదశి నుంచి మూడు రోజుల పాటు ఇవి వైభవంగా జరుగుతాయి. 2019 వరకు శ్రీవారి ఆలయ వెనుక భాగాన గల వసంత మండపంలో ఇవి జరిగేవి. తరువాతి రెండేళ్లు (2020, 2021) కోవిడ్ కారణంగా ఆలయ ప్రాంగణంలోనే ఏకాంతంగా నిర్వహించారు. కోవిడ్ పరిస్థితులు చక్కబడడంతో గత ఏడాది నుంచి ఈ ఉత్సవాలకు వసంత మండపాన్నే వేదిక చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాన్ని ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా అలంకరిస్తారు. గురువారంతో కూడిన పౌర్ణమిని విశేషంగా భావిస్తారు.**

## ‘వసంత

వసంతం రుతురాజు. ‘మాసానాం మార్గ శీర్షోహం... ఋతూనాం కుసుమాకరః’ (నెలల్లో మార్గ శిరము, రుతువులతో వసంత రుతువును) తానేనని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో పేర్కొన్నారు. ప్రపంచంలోని అత్యధిక పూలు వసంతంలోనే పూస్తాయట. వసంతకాలంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారు (‘వసంతి సుఖం యథాతథా అస్మిన్నితి’) అని పెద్దల మాట. అతి వేడి, అతి చల్లదనం కాకుండా వాతావరణ సమతుల్యత ఈ రుతువు ప్రత్యేకతగా చెబుతారు. ఆ సమయంలోనే తిరుమలేశుడికి వసంత సంబరాలు జరుగుతాయి. ప్రకృతి ఆరాధనకు సంకేతంగా, వసంత రుతువు ఆగమనానికి గుర్తుగా ఈ వార్షిక వేడుకలను ప్రవేశ పెట్టినట్లు చెబుతారు. ఈ మూడు రోజులూ దేవ ఉభయ దేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తిరుమలేశుడికి ఒకే మాసంలో పదిహేను రోజుల వ్యవధిలో రెండు ఆస్థాన ఉత్సవాలు జరగడం మరో ప్రత్యేకత. తిరుమలేశుడికి ఒకే మాసంలో పదిహేను రోజుల వ్యవధిలో రెండు ఆస్థాన ఉత్సవాలు జరగడం మరో ప్రత్యేకత. ఈ



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్

ప్రక్రియ లోకానికి, దేవతలకు పెరగబోయే సూర్యతాపం నుంచి ఉపశమనాన్ని స్తుందని నమ్ముతారు. గడచిన సంవత్సరంలో శ్రీవారి అర్చనలో ఏవైనా లోటుపాట్లు చోటుచేసుకుంటే వాటి దోష నివారణ, వర్తమాన వత్సరంలో స్వామి వారి సేవలు నిర్విఘ్నంగా సాగాలని అభిలషించడం కూడా ఈ వేడుకల నిర్వహణ మరో ఉద్దేశమని చెబుతారు.

తెలుగు కొత్త సంవత్సరం ఆరంభంలో తిరుమలేశుడికి ఉగాది అస్థాన ఉత్సవం తరువాత జరిగే మరో ముఖ్య వేడుక వార్షిక వసంతోత్సవం. తిరుమల ఆలయంలో నిత్యం అనేక సేవలు జరుగుతుంటాయి. వీటిలో కొన్ని మూలవరులకు, కొన్ని ఉత్సవమూర్తి మలయప్పస్వామికి నిర్వహిస్తారు. కొన్నిటిని మాత్రం ఆర్జిత సేవలుగా పరిగణిస్తున్నారు. వాటిలో వసంతోత్సవం ఒకటి. నిత్య ఆర్జిత సేవ వసంతోత్సవం, వసంతకాలంలో మూడునాళ్ల వార్షిక సేవ భక్తులను అలరిస్తున్నాయి. నిత్యోత్సవాలలో భాగంగా డోలోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం ముగిసిన తరువాత ఆర్జిత వసంతోత్సవం నిర్వహిస్తారు. ఆర్జిత బ్రహ్మోత్సవంలో సర్వాభరణాలతో పాల్గొన్న మలయప్పస్వామి, ఉభయ దేవేరులను వసంతోత్స వాలకు సిద్ధం చేసే క్రమంలో అర్చకులు ఆ మూర్తులపై గల నగలు తొలగించి తిరుమంజనానికి అవసరమైన ధవళ వస్త్రాలతో అలంకరించి, శుద్ధజలం, ఆవు పాలు, పెరుగు, తేనె, పసుపుతో అభిషేకిస్తారు. చందనం, శ్రీతిలకం దిద్ది తులసీ మాలలతో అలంకరించే దృశ్యం నయనానంద కరంగా ఉంటుంది. అనంతరం ‘ఆస్థానం’ ఉంటుంది.

నూతన సంవత్సరానికి సంబంధించి ఆనంద నిలయుడి ఆరాధన కార్యక్రమాలు, ఉత్సవాలు ఉగాది నుంచి ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా ‘ఆస్థానం’ నిర్వహిస్తారు. ఆస్థానం అంటే కొలువు దీరడం అని అర్థం. తిరుమలేశుడు వేంచేపు చేసే స్థలాన్ని ‘ఆస్థానం’ అంటారు. ఉగాది, వసంతోత్సవం తదితర సందర్భాలలో శ్రీవారు కొలువు తీరతారు కనుక ఆయా పేర్లపై ‘ఆస్థానం’ (‘ఉగాది/ వసంతోత్సవ/ దీపావళి/మకర సంక్రమణ ఆస్థానం) అని వ్యవహరిస్తారు. ఇది, తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతాధికారులు హాజరై బాధ్యతలకు పునరంకితమయ్యే ప్రక్రియని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, దేవస్థానం పూర్వ కార్యనిర్వహణాధికారి పీవీఆర్కే ప్రసాద్ ఒక సందర్భంలో తెలిపారు. మరో కోణంలో భగవంతుడు తాను ఆనందిస్తూ, లోకాన్ని ఆనందింప చేయడమే దీని అంతరార్థంగా చెబుతారు. నిజానికి ఇదంతా భక్తజనానందం కోసమే.

ఉగాది ఆస్థాన ఉత్సవం తరువాత ప్రధానమైనది వసంతోత్సవం. మూడునాళ్ల ఈ వసంతోత్సవం ముందురోజు అంకురార్పణ (నవధాన్యాలు విత్తడం), పుణ్యహవాచన (శుద్ధి ప్రక్రియ), వాస్తు, సంప్రోక్షణ ఆచారాలతో ప్రారంభ మవుతుంది. చైత్రశుద్ధ త్రయోదశి ఉదయం శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీమలయప్ప స్వామి ఛత్రచామర మర్యాదలు, దివ్య ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యాల నడుమ బంగారు రథంపై ఆలయానికి ప్రదక్షిణగా ఊరేగుతూ వసంత మండపానికి చేరుకుంటారు. అక్కడ



# ...రాయా! వందనం

దేవదేవేరులను శుద్ధోదకం, ఆవుపాలు, పెరుగు, తేనె పసుపుతో అభిషేకిస్తారు. ధూపదీపారాధన, కర్పూర హారతులు ఇస్తారు. ముగ్గురు మూర్తులను చందన, తులసీమాలతో అలంకరిస్తారు.

శ్రీచందనం సమర్పిస్తారు. కుంభహారతి, నక్షత్ర హారతి సమర్పణ తరువాత మంత్రజలంతో సహస్రధారాభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరిస్తారు. దేవదేవుడి అభిషేకంలో వినియోగించిన పసుపు, చందనాలను భక్తులకు వితరణ చేస్తారు. శ్రీవారు ఆస్థానంలో పాల్గొన్న తరువాత సాయంత్రం ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. భక్తజనం పవిత్రులు కావాలనే ఉద్దేశంతో సహస్రధారాభిషేక తీర్థాన్ని వారి శిరస్సులపై సంప్రోక్షిస్తారు. రెండవ రోజు (చతుర్దశి) దాదాపు ఇదే ప్రక్రియ కొనసాగుతుంది.

మూడవ నాడు (పౌర్ణమి) శ్రీమలయప్పతో పాటు శ్రీసీతారామలక్ష్మణ హనుమ; రుక్మిణీ కృష్ణులు వేర్వేరు వాహనాలపై ఊరేగింపుగా వసంత మండపానికి చేరుకుంటారు. అక్కడ వారికి విడివిడిగానే అభిషేకాదులు నిర్వహిస్తారు. 'త్రేత, ద్వాపర యుగాలలో రామకృష్ణులు నేనే' అనే భావాన్ని వేంకటేశ్వరుడు ప్రకటిస్తున్నాడని భావం. త్రేత, ద్వాపర యుగాలలోని శ్రీరామ, శ్రీకృష్ణావతారాల ఉభయశక్తులకు (రామకృష్ణత్వ) ప్రతీకగా శ్రీనివాసుడు వేంకటాచలంపై నిలిచి ధర్మరక్షణ, భక్త పాలన చేస్తున్నాడు. రామకృష్ణా వతారాలలోని అన్ని శుభాలను స్వీకరించి 'వేంకట రామకృష్ణుల' ఏక మూర్తిగా అర్చావతార రూపంలో కృపాకాంతులను వెదజల్లుతున్నాడు. వసంత వేడుకల అనంతరం సాయంత్రానికి ఆలయానికి చేరుకుంటారు. ఈ మూడు రోజుల ఉత్సవాల సందర్భంగా స్వామిని వివిధ రకాల పుష్పాలతో, ప్రధానంగా తులసితో అర్చించి, పలు రకాల పండ్లను నైవేద్యంగా సమర్పించడం విశేషం.

భగవంతుడు నిత్యానంద కారకుడు. అందులోనూ ఈ రుతువులో మహా ప్రసన్నంగా ఉంటాడట. వసంతోత్సవం నాటి వైభవాన్ని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అందుకే నూతన దంపతులు ఈ ఉత్సవాలకు హాజరుకావడం మంచిదని పెద్దలు సూచిస్తారు. అరమరికలు లేకుండా అన్యోన్యంగా జీవించేలా ఔన్నత్యాన్ని పెంచుకునేలా స్వామి ఆశీర్వదిస్తారని విశ్వాసం.


వసంతోత్సవం సందర్భంగా తిరుమలలో పుష్పధారణ నిషేధాన్ని ప్రస్తావించుకోవడం సముచితం. శ్రీవారిని సర్వసేవలలోనూ పూలతో అర్చిస్తారు. ప్రధానంగా వసంతోత్సవం, పుష్పయాగం సందర్భంగా అది మరింత ప్రత్యేకం. తిరుమల క్షేత్రంలో ఆయనకు ఉద్దేశించిన పుష్పాదులను స్త్రీపురుషులు ధరించరాదని భగవద్రామానుజా చార్యులు కట్టడి చేశారు. శ్రీవేంకటాచలం పవిత్రతను కాపాడేందుకు ఆయన ప్రవేశపెట్టిన విధి విధానాలలో ఇదీ ఒకటి. అది నేడు అమలవుతున్న తీరుపై భక్తకోటి ఆత్మపరిశీలన చేసుకోవలసి ఉంటుంది. పీవీఆర్కే తెలిపిన వివరాలను బట్టి 'కొన్ని శతాబ్దాలు స్వామివారి నిర్మాల్య పుష్పాలు భక్తులకివ్వడం, వారు వాటిని స్వామి ప్రసాదంగా స్వీకరించి వాటితో తమ ఇళ్లలోని పూజా విగ్రహాలకు కైంకర్యం చేసేవారట. అలా సమర్పించిన తరువాతే వాటిని ప్రసాదంగా స్వీకరించేవారట.

అయితే తమ ఇళ్లలో దేవతా మూర్తులకు తిరుమలపై స్వామి వారికి 'నివేదించని' పుష్పాలతో కైంకర్యం చేసే సంప్రదాయం లేదు.' రామానుజుల నిర్ణయం నేపథ్యం గురించి వేంకటాచల ఇతిహాసంలో ఒక ప్రస్తావన కనిపిస్తుంది. ఒకనాడు శ్రీనివాసుడికి 'సమర్పించని' పూలను శ్రీశైలపూర్ణుల శిష్యుడొకరు ధరించాడట. ఆ రాత్రి స్వామివారు శ్రీశైలపూర్ణులకు స్వప్న సాక్షాత్కరం చేసి 'నీ శిష్యుడు పరిమళ ద్రోహం చేశాడు' అని చెప్పడంతో, ఇక మీదట నిర్మాల్యం కూడా భక్తులకు ఇవ్వకుండా వాటిని పూలాబావి లోనూ, తీర్థాలలో వదలి సంప్రదాయాన్ని తెచ్చారు. స్వామి వారికి 'నివేదించని'పూలను 'నివేదించిన' ట్లుగా చెప్పి ధరించే అవకాశం ఉండడంతో కొండమీద పుష్పాలే ధరించరాదని కట్టడి చేయగా, చాలా కాలం అది సక్రమంగానే అమలైంది.

**కల్యాణాద్భుత గాత్రాయ కామితార్థ ప్రదాయినే!**
**శ్రీమద్వేంకటనాథాయ శ్రీనివాసాయ మంగళమ్!!**

వసంతోత్సవం సందర్భంగా తిరుమలలో పుష్పధారణ నిషేధాన్ని ప్రస్తావించుకోవడం సముచితం. శ్రీవారిని సర్వసేవలలోనూ పూలతో అర్చిస్తారు. ప్రధానంగా వసంతోత్సవం, పుష్పయాగం సందర్భంగా అది మరింత ప్రత్యేకం. తిరుమల క్షేత్రంలో ఆయనకు ఉద్దేశించిన పుష్పాదులను స్త్రీపురుషులు ధరించరాదని భగవద్రామానుజాచార్యులు కట్టడి చేశారు. శ్రీవేంకటాచలం పవిత్రతను కాపాడేందుకు ఆయన ప్రవేశపెట్టిన విధి విధానాలలో ఇదీ ఒకటి.





కొత్త శారదాపీఠం



# కశ్మీర్‌లో శార

*నమస్తే శారదాదేవి కాశ్మీర పురవాసినీ*
*త్వామహం ప్రార్థయే నిత్యం విద్యాదానంచ దేహిమే!*


దేశ విభజన జరిగిన మరుక్షణం పాకిస్తాన్ వైపు నుంచి కశ్మీర్ మీద 'గిరిజనుల దాడి' జరిగింది. నిజానికి అది భారత్-పాక్‌ల మధ్య జరిగిన మొదటి యుద్ధంలో తొలి అడుగు. ముస్లింల కోసం దేశం అన్న మతోన్మాద నినాదంతో ఏర్పడిన పాకిస్తాన్ చేసిన ఆ దొంగ దాడి లక్ష్యం కశ్మీర్‌లోని హిందూ సాంస్కృతిక మూలాలు కూడా. ఆ ఉన్మాదంలో నేలమట్టమైన వైజ్ఞానిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రం శారదాపీఠం. 75 ఏళ్ల తరువాత ఆక్రమిత కశ్మీర్‌లోని, కుప్వారా జిల్లా, తీత్వాల్ గ్రామంలో కొత్త రూపంలో ఆ పీఠాన్ని ఈ ఉగాదికి పునఃప్రతిష్ఠించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్ విధానంతో ఆ ఆలయాన్ని ప్రారంభించారు. ఈ పరిణామం భారతదేశంలో, ప్రధానంగా కశ్మీర్ లోయలో జరుగుతున్న సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో మైలురాయి. అయోధ్యలో కొత్త రామాలయం నిర్మాణం ఎంతటి అద్భుతమో, శారదాపీఠం పునఃప్రతిష్ఠ కూడా అంతే అద్భుతం. అంతే ప్రాధాన్యం కలిగినది కూడా.

ఒకనాడు హిందూధర్మానికీ, శాస్త్రజ్ఞానానికీ, సాహిత్యానికీ ఆటపట్టుగా ఉన్న కశ్మీర్ దేశ విభజనకు ఎంతో ముందే ముస్లిం మతోన్మాదం అడ్డూ అదుపూ లేకుండా చేసిన దాడులలో వందల గాయాల పాలైంది. ఈ మొత్తం పరిణామాల ఫలితాలలో ఒకటి- చరిత్ర ప్రసిద్ధమైన శారదాపీఠం నేలమట్టం కావడం. ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం శారదా పీఠంతో పాటు, ఈ పీఠమే కేంద్ర బిందువుగా తక్షశిల, నలందాల కంటే ముందే ఆవిర్భవించిన విశ్వవిద్యాలయాల అవశేషాలు కూడా మతోన్మాదానికి బలయ్యాయి.

అది కేవలం ఆలయమే కాదు, ఆలయం కేంద్ర బిందువుగా విస్తరించిన అలనాటి విశ్వవిద్యాలయం. క్రీస్తుపూర్వం 273 ప్రాంతంలో ఆవిర్భవించిన ఈ ఆలయం, ఆ విశ్వవిద్యాలయం తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల కంటే పురాతనమైనవి. శారదా పీఠంలోని విశ్వవిదాలయం కంటే ముందే క్రీస్తు పూర్వం 237లో ఆలయం వెలసింది. ఆ విశ్వవిద్యాలయంలో ఆ కాలంలో చదువు కోసం వచ్చి ఉండే విద్యార్థుల సంఖ్య 5000. పై శ్లోకం ఆ అమ్మవారి ప్రార్థనే.

పురాతన సాహిత్యంలో, విదేశీయుల రచనలలో శారదాపీఠానికి సంబంధించిన ఆధారాలు మెరుపుల మరకల వలె అగుపిస్తాయి. సామాన్యశకం 14వ శతాబ్దానికి చెందిన 'మాధవీయ శంకర విజయం' ఈ పుణ్యస్థలిని 'సర్వజ్ఞ పీఠం' అని కొనియాడింది. స్థానిక పండితులని తర్కంలో ఓడించి ఈ పీఠంలోని సమున్నత ఆసనాన్ని శంకర భగవత్పాదులు అధిరోహించారని గాథలు చెబుతున్నాయి. సాక్షాత్తు అమ్మవారే ప్రశ్న వేసి, అందుకు శంకరులు చెప్పిన సమాధానికి సంతృప్తి చెంది లోపలికి అనుమతించిందని చెబుతారు.

కొత్తగా నిర్మించిన తరువాత శారదాపీఠం ఆలయంలో ఏడున్నర దశాబ్దాలకు ఇప్పుడు దీపం వెలిగింది. ఆక్రమిత కశ్మీర్‌లోనే అధీనరేఖకు సమీపంలోనే తీత్వల్ గ్రామంలో ఇది కట్టారు. శృంగేరి శారదాపీఠం బహూకరించిన అమ్మవారి అద్భుత ప్రతిమను ప్రతిష్ఠించారు. ఈ ఆలయాన్ని ఉగాది పర్వదినాన (మార్చి 22) కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విధానంతో ప్రారంభించారు. కర్తార్‌పూర్ కారిడార్ పద్ధతిలోనే శారదాపీఠం సందర్శనానికి కూడా ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా అమిత్‌షా అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత కశ్మీర్‌లోయ తనదైన సాంస్కృతిక వారసత్వంలోకి పునఃప్రవేశిస్తున్నదని చెప్పారు. కశ్మీర్ వైభవాన్ని, ప్రత్యేకతను చాటే 123 దివ్య స్థలాల పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటిలో 35 చోట్ల పనులు దాదాపు పూర్తయ్యాయి. రూ. 65 కోట్లతో



అమర్‌నాథ్ ఆలయం

మార్తాండ దేవాలయం

వైష్ణోదేవి ఆలయం

#  దామాత పునర్దర్శనం


ఈ పనులు చేపట్టారు. ఇంతవరకు జమ్ము కశ్మీర్‌లోని ఆలయాలు, సూఫీ ప్రార్థనా మందిరాలలో 75 కార్యక్రమాలు నిర్వహించారు. ఇవన్నీ కశ్మీర్ వాస్తవ సంస్కృతిని గుర్తు చేయడానికేనని అమిత్‌షా చెప్పారు.

కొన్ని ఆంగ్ల దినపత్రికలు తప్ప తెలుగు పత్రికలు ఏవీ ఈ వార్తను పట్టించుకోలేదు. నిజానికి అయోధ్య తరువాత ఈ పరిణామం చెప్పుకోదగినదే. పాత శారదా పీఠం వాస్తు ప్రకారమే ఆలయాన్ని నిర్మించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో హిందూ దేవాలయాన్ని పునరుద్ధరించడం అసాధారణమే.


నిజానికి ఇంత ప్రయాస అవసరమా? శత్రు దేశం అధీనంలో ఉన్న ప్రాంతంలోని ఆలయం కోసం ఇంత తపన ఎందుకు? దీనికి రక్షణ ఏమిటి? వీటికి సమాధానం కశ్మీరీల నాగరికత మూలాలలో ఉంది. మిగిలి ఉన్న హిందువుల గుండె చప్పుళ్లలో వినిపిస్తుంది. డెబ్బయ్ ఏళ్లుగా ఆ ఆలయాన్ని కశ్మీరీలు చూడలేదు. అందులో 30 ఏళ్లు చాలామంది పండిత్‌లు కశ్మీర్‌లోనే లేరు. వారిని తరిమివేశారు. అయినా వారు అక్కడి ఆలయాల పునరుద్ధరణకు ఆరాటపడుతున్నారంటేనే సాంస్కృతిక, మత మూలాల పట్ల వారికి ఉన్న ఆర్తి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆలయంతో కశ్మీరీలకు ఎన్నో ఆధ్యాత్మిక ప్రాధాన్యాలు, మరెన్నో సాంస్కృతిక బంధాలు ఉన్నాయి. ఈ ఆలయంతో వారిది విడదీయలేని బంధం. శారద, సరస్వతి, వాగ్దేవి అనే మూడు జ్ఞానదీపాలను ఆ దేవతలో వారు దర్శించుకుంటారు. చదువు, జ్ఞానం, వాగ్భూషణం ఆ తల్లి ప్రసాదాలేనని వారి ప్రగాఢ విశ్వాసం. భారతీయ లాక్షణిక గ్రంథాలన్నీ కశ్మీర్‌లోనే పుట్టాయి. ప్రతి రచయిత మొదట తన గ్రంథాన్ని అమ్మవారికి సమర్పించిన తరువాతే బయట ప్రపంచం అందుబాటు లోకి ఉంచేవారు. తమ గ్రంథాలను బయటి ప్రపంచానికి పరిచయం చేయడానికి అమ్మవారి అనుమతి అవసరమని నమ్మారు వారు.

కొత్త పీఠం ప్రతిష్ఠించిన క్రమం, పాత పీఠం ఆనవాళ్లను ఒక్కసారి అవలోకిద్దాం. భారతదేశంలో ఒక ఆధ్యాత్మిక పీఠం కేంద్ర బిందువుగా వెలసిన విశ్వవిద్యాలయాలు కొన్ని ఉండేవి. అందులో శారదా పీఠం ఒకటి. ఈ పీఠానికి ఉన్న ప్రత్యేకతలలో ఒకటి– ఉత్తర భారతదేశంలో వ్యాప్తి చెందిన శారదా లిపి జన్మస్థానం ఇదే. ఆ లిపిని శారదా లిపి అనే పిలిచేవారు. దీనికి ఉన్న వ్యాప్తిని బట్టి కశ్మీరాన్ని ఆనాడు శారదాదేశం అని కూడా గౌరవించుకునే వారు. ఇది అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి. శివుడు సతీదేవి అమ్మవారి భౌతికకాయంతో విలయ తాండవం చేశాడని ప్రతీతి. ఫలితంగా ఆమె అవయవాలు పలుచోట్ల పడినాయి. అవే శక్తి పీఠాలు. అమ్మవారి కుడిచేయి పడినన చోటే శారదా పీఠం ఆవిర్భవించిందని భక్తుల నమ్మకం. అమ్మవారి కుడిచేయి పడిన చోటుగా ప్రసిద్ధమైన ఆ ప్రదేశంలోనే విస్తృత ప్రాధాన్యం సంతరించుకున్న లిపి ఆవిర్భవించడం విశేషమే మరి. మార్తాండ దేవాలయం, అమర్‌నాథ్ గుహాలయం, శారదా పీఠం ఒకనాడు కశ్మీరీ హిందువులతో పాటు, దేశంలోని హిందువులందరికీ దర్శనీయ స్థలాలుగా ఉండేవి. ఈ పీఠం ముజఫరాబాద్ (పాక్ ఆక్రమిత కశ్మీర్ పరిపాలనా కేంద్రం)కు 93 మైళ్ల దూరంలోనే ఉంది. శ్రీనగర్‌కు మాత్రం 81 మైళ్లు. కానీ పది కిలోమీటర్ల దూరంలోనే భారత్–పాక్‌ను విభజించే అధీన రేఖ ఉంది.

అసలు శారదా పీఠం వెలసిన శారది గ్రామం నీలమ్ నది ఒడ్డున ఉంది. నీలమ్ నది మధుమతి, సర్గున్ నదులతో ఇక్కడే సంగమిస్తుంది. నిజానికి నీలమ్ అసలు పేరు కిషన్‌గంగ. నీలమ్ పేరును బట్టే అక్కడి లోయకు నీలమ్ లోయ పేరు వచ్చింది. హాముఖ్ పర్వత పాదాల వద్ద నీలమ్ లోయ ఉంది. శివుడి ఆవాసమే హాముఖ్ పర్వతమని కశ్మీరీ పండిత్‌లు నమ్ముతారు. అక్కడే ఉన్న శారది లేదా శార్ది అనే చిన్న గ్రామంలోనే మొదట శారదాపీఠం ఆవిర్భవించింది. శతాబ్దాల నాటి కశ్మీరీల కులదేవత శారద ఆలయాన్ని 1947లో పాకిస్తాన్ సైనికులు ధ్వంసం చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఏర్పడడం, అక్కడికి హిందువులు అడుగుపెట్టే పరిస్థితి లేకపోవడంతో ఆ చరిత్రాత్మక ఆధ్యాత్మిక, జ్ఞాన నిలయం ధ్వంసమైపోయింది. ఇదొక్కటే కాదు, మార్తాండ ఆలయం సహ లోయలోని గొప్ప



19వ శతాబ్దంలో శారదాపీఠం




ఖీర్ భవానీ ఆలయం

స్థానేశ్వర్ మహాదేవ ఆలయం


సోమనాథ్ ఆలయం

గొప్ప ఆలయాలన్నీ నేలమట్టం చేశారు. భారత సాంస్కృతిక సంబంధాల మండలి జమ్ముకశ్మీర్ మాజీ సంచాలకులు ప్రొఫెసర్ అయాజ్ రసూల్ నజ్కి ఏడు దశాబ్దాల తరువాత శారదిలో అడుగు పెట్టిన తొలి కశ్మీరీ. ఈయన 2007లో అక్కడికి వెళ్లివచ్చిన తరువాతే కశ్మీరీలకు ప్రవేశం కల్పించాలన్న డిమాండ్‌లో కదలిక వచ్చింది. 'ఆ ప్రాంగణం చాలా విశాలమైనది. కానీ పూర్తిగా శిథిలమైపోయింది. అయినా స్థానికులు ఇప్పటికీ ఆ ప్రాంతాన్ని శారదా మాయి లేదా శారదా విశ్వవిద్యాలయం అనే పిలుస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా దొరకని వారు శారదా పీఠం గ్రంథాలయానికి వస్తే వారి అన్వేషణ ఫలిస్తుందన్న కీర్తి ఉంది' అని చెప్పారు నజ్కీ. శంకరాచార్యకు, అభినవగుప్తునకు మధ్య సంవాదం ఈ ఆలయంలోనే జరిగిందని కూడా నజ్కీ తెలియ చేశారు. 'ఆ విశ్వ విద్యాలయంలో విజ్ఞాన శాస్త్రం, మతం, తత్త్వశాస్త్రాలు బోధించేవారు.' అని కూడా ఆయన చెప్పారు.

సరస్వతి అమ్మవారిని కశ్మీరీలు శారదామాతగా కొలుస్తారు. ఇది శాక్తేయానికి అంకితం చేసిన తొలి పీఠంగా ఖ్యాతి వహించింది. వైష్ణోదేవి, ఖీర్‌భవానీ ఆలయాలు ఆ తరువాత శాక్తేయ పీఠాలుగా అవతరించాయి. సామాన్యశకం 6–12 మధ్య దీనిని నిర్మించారని చరిత్రకారుల అంచనా. లలితాదిత్య ముక్తపీడ (సామాన్యశకం 724–760) ఈ ఆలయ, విశ్వవిద్యాలయ నిర్మాణాలను ప్రారంభించి ఉండ వచ్చునన్న అభిప్రాయం ఉంది. విదేశీ యాత్రికుడు అల్ బెరూనీ రచనలలో ఈ ఆలయం, అక్కడి విశ్వవిద్యాలయం, దాని బృహత్ గ్రంథాలయ ప్రస్తావన కనిపిస్తుంది. తాను విన్నదానిని బట్టి అక్కడ అమ్మవారి దారుశిల్పం ప్రతిష్టించి ఉందని కూడా ఆ యాత్రికుడు నమోదు చేశాడు. తాను విన్నప్పటికే ఆ ఆలయం ఆసియాలోనే ప్రముఖమైనదిగా ప్రశస్తి కలిగి ఉండేదని రాసుకున్నాడు. ముల్తాన్ (నేటి పాకిస్తాన్)లోని సూర్య దేవాలయం, స్థానేశ్వర్ (హరియాణా)లోని మహాదేవ ఆలయం, సోమనాథ్ (గుజరాత్) దేవాలయం ఎంత ప్రఖ్యాతమో శారదా పీఠం కూడా అంతే ప్రసిద్ధి గాంచిందని ఆయన అభిప్రాయపడ్డాడు. సామాన్యశకం ఎనిమిదో శతాబ్దానికే ఈ పీఠానికి వంగ ప్రాంతం నుంచి భక్తులు వచ్చేవారు. కశ్మీర్‌ను పాలించిన సుల్తాన్ జైనులుద్దీన్ అబిదిన్ సామాన్యశకం 1422లో ఈ ఆలయాన్ని దర్శించాడని 'ద్వితీయ రాజతరంగిణి' రచయిత జొనరాజ్ (కల్హణ రాజతరంగిణికి కొనసాగింపు) రాశాడు. 16వ శతాబ్దంలో అక్బర్ కొలువులో పనిచేసిన అబ్దుల్ ఫాజి ఇబిన్ ముబారక్ కూడా ఇక్కడికి వచ్చాడు. అక్కడ భవ్యమైన రాతి దేవాలయం ఉందని ఇతడు రాశాడు. ఈ ఇద్దరు కూడా అమ్మవారికి మహిమలు ఉన్నాయని విశ్వసించినట్టు కథలు ఉన్నాయి. సామాన్యశకం



రవీంద్ర పండిత



అమిత్ షా

6–8 శతాబ్దాల మధ్య కాలంలో వెలువడినదిగా నమ్ముతున్న 'నీలమాతా పురాణం'లో కూడా శారదాపీఠం ప్రస్తావన ఉంది. సామాన్యశకం 11వ శతాబ్దం నాటి కవి బిల్హణుడు ఈ ఆలయ ఆధ్యాత్మిక సంపద, విద్యాకేంద్రంగా ఉన్న ప్రాముఖ్యాల గురించి వివరించాడు. అమ్మవారి ప్రతిమ శిల్ప సౌందర్యం గురించి కూడా వర్ణించాడు. 12వ శతాబ్దానికి చెందిన రాజతరంగిణి రచయిత కల్హణుడు కూడా ఈ పీఠం ఔన్నత్యం గురించి వివరించాడు.

ముస్లిం పాలనలోనే శారదా పీఠానికి చీకటి రోజులు ఆరంభమయ్యాయి. అక్బర్ కాలంలో, అఫ్గాన్‌ల కాలంలో బొంబా తెగవారు నీలమ్ లోయను పాలించేవారు. భక్తుల రాక అప్పటి నుంచే తగ్గు ముఖం పట్టింది. కానీ మహారాజా (డోగ్రా వంశీకుడు) గులాబ్‌సింగ్ ఆలయానికి మరమ్మతులు చేయించి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు గౌతెంగ్ బ్రాహ్మణులకు వేతనాలు ఇచ్చి నియమించాడు.

దేశ విభజన తరువాత పూర్తిగా చెడురోజులు దాపురించాయి. 1947 నాటి పరిస్థితులను బట్టి స్వామి నందలాల్‌జీ అనే ఆధ్యాత్మికవేత్త కొన్ని రాతి విగ్రహాలను కుప్వారాలోని టిక్కెర్ అనే ప్రాంతానికి తీసుకువచ్చాడు. వీటిలో కొన్ని తరువాత బారాముల్లాలోని దేవీబాల్‌కు తరలివెళ్లాయి. ఇక 1947–48 నాటి భారత్ పాకిస్తాన్ యుద్ధంతో పీఠం చెల్లాచెదురైంది. అప్పటి నుంచి కశ్మీరీలకు ఆ అమ్మవారి దర్శన భాగ్యం కలగలేదు. ప్రత్యామ్నాయంగా శ్రీనగర్, బందిపోరాలలోని ఆలయాలను దర్శించే వారు. ఆ యుద్ధం తరువాత రెండు దేశాల మధ్య పూజనీయ స్థలాల దర్శనం కోసం ఉద్దేశించిన పర్యాటకం పరిధిలో జరిగిన కరాచీ ఒప్పందంలోను శారదాపీఠం సందర్శనకు పాకిస్తాన్ అనుమతి ఇవ్వలేదు. తరువాత అమలు చేసిన పర్యాటక నిబంధనలు కూడా హిందువులను పూర్తిగా నిరుత్సాహపరిచాయి. ఒకవేళ అనివార్యంగా దర్శించుకోదలచిన భారతీయులు అనుమతిపత్రాలు తీసుకోవలసి ఉంటుంది.

2007లో కొందరు కశ్మీరీ పండిత్‌లు ఆక్రమిత కశ్మీర్‌కు వెళ్లినప్పుడు కూడా ఆ పీఠం చూడడానికి అనుమతి ఇవ్వలేదు. 2009లో మాత్రం శాంతి, సంఘర్షణ అధ్యయన సంస్థ ఆధ్యాత్మిక స్థలాలకు ఉద్దేశించిన పర్యాటకం కోసం సిఫారసు చేసింది. అదైనా కశ్మీరీ పండిత్‌ల బృందం ఒకటి శారదాపీఠం చూడడానికి వెళితే, అందుకు బదులుగా కొందరు పాకిస్తాన్ ముస్లింలతో కూడిన బృందం శ్రీనగర్‌లోని హజ్రత్‌బల్ మసీదును చూడడానికి వచ్చింది. తరువాత నుంచి కూడా దేశాల మధ్య ఈ పీఠం కోసం పర్యాటకులను అనుమతించాలని పలువురు భారత్, పాక్ ప్రభుత్వాలను కోరుతూనే ఉన్నారు. అక్కడ శిథిలావస్థలో ఉన్న శారద ఆలయ జీర్ణోద్ధరణకు అనుమతించాలని కొందరు రాజకీయ వేత్తలు కూడా పాకిస్తాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే 2019లో పాకిస్తాన్ ప్రభుత్వం కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రారంభించింది. ఈ మేరకు సరిహద్దు లోనే పాక్ భూభాగంలో ఉన్న గురుద్వారా దర్బార్ సాహిబ్ కర్తార్‌పూర్‌కు సిక్కు యాత్రికులను పాకిస్తాన్ అనుమతించింది. ఇదే విధంగా శారదా పీఠం సందర్శనకు కూడా హిందువులను అనుమతించాలని పండిత్‌లు కోరారు.

కారణాలు ఏవైనా కర్తార్‌పూర్ కారిడార్ తరహాలోనే హిందువులను కూడా తీత్వాల్ గ్రామం వరకు అనుమతించడానికి పాకిస్తాన్ అంగీకరించింది. ఏడాది క్రితం ఈ పనులకు భూమిపూజ కూడా జరిగింది. ఇదంతా సేవ్ శారదా కమిటీ కశ్మీర్, దాని కన్వీనర్ రవీంద్ర పండిత కృషితో సాధ్యమైంది. ఉత్తర కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో శారదాపీఠంతో పాటు ఒక గురుద్వారా కూడా ఉండేదని, ఆ రెండు కూడా 1947లో 'గిరిజనులు' ధ్వంసం చేశారని రవీంద్ర చెప్పారు. కశ్మీరీ పండిత్‌లు తిరిగి లోయకు వస్తున్నారు. అంతేకాదు, తరలిపోయిన తమ సాంస్కృతిక సంపదను కూడా క్రమంగా ప్రోది చేసుకుంటున్నారు.

– జాగృతి డెస్క్



గోపాలరెడ్డి నాగం
విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు

# పొడుపు కవితలు

చెట్టు ముందా? విత్తు ముందా?... నేలముందు
కోడి ముందా గుడ్డు ముందా?.... కోడి ముందు గుడ్డు వెనుక
శబ్దం ముందా అర్థం ముందా?..... అన్నింటికి అర్థం ముందు (ఎవర్‌గ్రీన్ ప్రశ్నలు)

కాలేజి అమ్మాయి
పాకెట్‌మనీకి గుడ్‌బై (దొరికాదు బాయ్‌ఫ్రెండు)

కాలేజి అబ్బాయి,
బైకు కొనివ్వాలని డిమాండ్ (దొరికింది గర్ల్‌ఫ్రెండు)

తల్లి శాకాహారి,
తండ్రి మాంసాహారి
తనయుడు సర్వాహారి! (జీన్స్, ఎంజైమ్స్)

అందమైన కాంక్రీటు పంజరాలు;
ముద్దులొలికె చిలుకల పలుకులు (కాన్వెంటు పిల్లలు)

ఆదివారపు జ్ఞానజ్యోతులు;
ముసిరినవి దీపం పురుగులు (ఫుట్‌పాత్ పుస్తకాలు)

ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి;
రక్షించింది రెక్కలు విసరి (ఎలక్ట్రిక్ ఫ్యాన్)

వ్యంగ్యోక్తులు, చతురోక్తులు;
శ్లేషలు, సంశ్లేషలు, విశ్లేషలు;
ఛందోమాత్రలు, నవరస గుళికలు;
సర్వరోగ నివారిణులు... స్వరరాగమాలికలు
ఆపాత మధురాలు, ఆలోచనామృతాలు (పద్య కవితలు)

యతిమీద మతిలేదు, ప్రాస మీద ధ్యాస లేదు;
మ్యాటరుంది, మీటరులేదు (వచన కవితలు)




# తెలంగాణ పోరులో

ఎవడు బాధను అనుభవిస్తున్నాడో వాడే పలకాలి. తానే వాక్యమై ఉదయించాలి. బాధను అనుభవించిన వాడే సాహిత్యకారుడైతే ఆ బాధను ప్రభావవంతంగా పలుకుతాడు. ఈ నేపథ్యంలోనే 'అనుభవ వాదం' తెరపైకి వచ్చింది. శోకం నుండి శ్లోకం వచ్చిందనేది ఆదికవి వాల్మీకి గురించిన అభిప్రాయం. క్రౌంచ మిథునంలో ఒక పక్షి బోయవాని శరాఘాతానికి నేల కూలగా రెండవ పక్షి దుఃఖం వాల్మీకికి అనుభూతమౌతుంది. ఆ దుఃఖంలో ఇలా పలవరిస్తాడు.

*"మానిషాద ప్రతిష్ఠాం త్వ*
*మగ మశ్శాశ్వతీం సమాః*
*యత్ క్రౌంచ మిథునా దేక*
*మవదీః క్రౌంచ మోహితమ్"*

ఈ విధంగా భారతీయ సాహిత్యంలో శోకం శ్లోకంగా మారింది. ఇక పాశ్చాత్యుల విషయానికొస్తే


*"Poetry is the sister of sorrow*
*every man that suffers and*
*weeps is a poet, every tear*
*is a verse and every heart a poem"*
*"Andre Fleury"*

మనిషి జీవించడానికి గాలి నీరు ఎంత అవసరమో వినోదం కూడా అంతే అవసరం. వినోదం లేకపోతే మనిషి వికసించకుండా మొద్దుబారి మృగప్రాయుడై ఉన్మాదిగా మారే ప్రమాదం వుంది. అలా కాకుండా ఉండాలంటే మనిషికి అన్ని కళలు అవసరమే.

ఆధునిక కవి అనుభవించేది సామాజిక దుఃఖం. ప్రతీ వ్యతిరేక అంశం అతన్ని కలవర పరుస్తుంది, నిలకడ లేకుండా చేస్తుంది. అతను అక్షరంగా జన్మించే వరకు నిలబడనీయదు. అతని శరీరంలోని రక్తపు చుక్కలనే సిరా చుక్కలుగా మారుస్తుంది. అలా అక్షరం పురుడు పోసుకుంటుంది. లేదా ఇతర కళారూపాలు జన్మిస్తాయి. చిత్రకారులు అయితే తమ కుంచెలకు పనిచెబుతారు.

మొదటి ప్రపంచ యుద్ధకాలం నుండి స్వాతంత్రోద్యమ చైతన్యానికి విశ్వవ్యాప్తంగా పేరున్న చిత్రకారుడు "పికాసో". అతడు తన స్వంత నగరం గొయెర్నికా మీద బాంబుల వర్షం కురిసినప్పుడు తన సామాజిక బాధ్యతగా మహోన్నత చిత్రాలను గీశాడు. అలాగే తెలంగాణాలో పేరు గాంచిన చిత్రకారులు అనేకమంది ఆనాటి సంఘటనలకు స్పందించి చిత్రాలను గీశారు. ముఖ్యంగా రజాకార్ ఉద్యమం లేదా తెలంగాణా విముక్తి పోరాటాలలో ఇవి ఎక్కువగా ప్రతిబింబిస్తాయి. ఇక నాటకాలు, అన్ని కోణాలనూ స్పృశిస్తూ తమ చిత్రాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. భారత స్వాతంత్ర్య పోరాట కాలంలో ముఖ్యంగా 1930వ దశకం నుండి కలకత్తా, చిటగాంగ్, చండీఘర్, తెలంగాణాలో రచయితలు, కళాకారులంతా ఉద్యమ కారులే అయ్యారు. స్పెయిన్ దేశంపై జర్మన్ల దాడిని, విధ్వంసకాండను కళ్లకు కట్టినట్లు చూపినవారు చిత్రకారులే ముఖ్యంగా "పికాసో"

రజాకార్లు, నిజాం పోలీసులు ప్రజలను తీవ్రమైన అణచివేతకు గురి చేస్తున్నప్పుడు జాతీయవాదులూ, ఇతరులు ప్రజల పక్షాన పోరాటం చేశారు. 'దున్నేవానిదే భూమి, రైతే రాజు కావాలి' అని నినదించారు. ఈ పోరాటాన్ని చిత్తప్రసాద్ తన చిత్రాల ద్వారా ఉద్యమంలో పాలు పంచుకున్నారు.


పికాసో | చిత్తప్రసాద్ | హరీన్ చటోపాధ్యాయ | దాశరథి

ఇతర కళారూపాలు ఆనాడు బాగా ప్రాచుర్యం పొందాయి. ముందుగా చిత్రకళను తీసుకుంటే 'సాహసమే ఊపిరిగా విమోచనే ధ్యాసగా పని చేశారు ఆనాటి కళాకారులు. దాశరథి క్లిష్ట పరిస్థితులు ఏర్పడిన ప్రతీసారీ దూకడం 'మహా అయితే ప్రాణం పోతుంది' అంతేగా అనేవారు. ఇక తెలంగాణా కళాకారుల కృషికి వస్తే 2004వ సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన చిన్న రాష్ట్రాల జాతీయ సదస్సులో లింగరాజు బ్రతుకు చిత్రాలను ప్రదర్శించారు. ఆయన గీసిన వాటిల్లో ప్రత్యేకంగా పేర్కొన్నదగ్గవి 35 కాగా, సాయుధ తెలంగాణా రైతాంగ పోరాటం, రజాకార్ల దౌర్జన్యాలను, దొరల దురాగతాలను వాటి ద్వారా ప్రేక్షకుల కళ్లకు కట్టినట్లు చూపించారు.

చిత్రకారులు పూర్వంలా ఇతిహాసంలోని అంశాలనే కాక గ్రామాల్లో నివసించే ప్రజల జీవన విధానాలను ఎన్నుకొని, వాటితో పాటు 'సంఘంలో జరిగే మార్పులు, ప్రజల జీవితంపై వాటి ప్రభావం' వస్తువులుగా ఎంచుకొని తమ కాన్వాసుల మీద చిత్రిస్తున్నారిప్పుడు. ముఖ్యంగా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం మొదలు అన్ని విషయాలను స్పృశిస్తూ చిత్ర రచన చేస్తున్నారు. ప్రజాజీవితాలలోని

ఆయన 1915లో బెంగాల్‌లో జన్మించాడు. 1943-44లలో బెంగాల్‌లో సంభవించిన బెంగాల్ కరవులో 30 లక్షల మంది మరణించి సంఘటనకు తీవ్రంగా చలించిన ఆయన "హంగ్రీ బెంగాల్" పేరిట వందల కొద్దీ స్కెచ్‌లు గీశాడు. అలాగే తెలంగాణాలో రజాకార్లు రైతుల మీద దాడి చేసి అమాయక బక్క రైతులను కాల్చుకుతిన్న దృశ్యాలను హృదయ విదారకంగా చిత్రించాడు. చిత్తప్రసాద్ ఈ ప్రాంతానికి చెందినవాడు కాకపోయినా ఇక్కడి రైతుల ముఖాలను పరిశీలనాత్మకంగా చిత్రించాడు. తెలంగాణా స్త్రీ, పురుషుల, రైతు కూలీల శరీర నిర్మాణాన్ని అద్భుతంగా చిత్రించాడు.


తెలంగాణకు చెందిన తొలితరం చిత్రకారుల్లో కొండపల్లి శేషగిరి రావు ఒకరు. 1924లో వరంగల్ జిల్లాలో జన్మించిన ఆయన జలాలుద్దీన్, నందన్‌లాల్ బోస్ వంటి వారి వద్ద శిక్షణ తీసుకున్నాడు. 1947 తెలంగాణా ప్రాంతంలో జరుపుకునే "బతుకమ్మ" పండుగను చిత్రించాడు. 1952లో తెలంగాణా రచయిత సంఘ సభ్యులు దాశరథి డా॥బి.రామ రాజు, సి.నారాయణరెడ్డి వంటివారిలో పరిచయ మయ్యాక రావి నారాయణ రెడ్డి, మఖ్దూం వంటి


**కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు


పాములపర్తి


పొట్లపల్లి రామారావు


ఆళ్వారు స్వామి


సుద్దాల హనుమంతు

# కళాకారుల పాత్ర

వారి ప్రోత్సాహంతో కొన్ని కార్టూన్‌లు వేయగా, అవి గోల్కొండ పత్రికలో అచ్చయ్యేవి. వీరికి సురవరం వారి ప్రోత్సాహం అధికంగా వుండేది. “నిజాం పాలన” అనే ఇతని చిత్రంలో నిజాం రాష్ట్రంలో ముఖ్యంగా గ్రామాలలోని ప్రజా జీవన విధానాన్ని, పటేల్-పట్వారీ, భూస్వామ్య వ్యవస్థను తెలియజేస్తూ, శిస్తు కట్టలేని రైతులకు వేసే శిక్షలు ఎంత క్రూరంగా వుండేవో ఈయన చిత్రాల ద్వారా తెలుస్తుంది.

ఎక్కా యాదగిరి మరో చిత్రకారుడు, శిల్పి. హైదరాబాద్‌లోని శాసనసభ భవనం ముందున్న గన్ పార్కులోని ‘తెలంగాణా అమర వీరుల స్మారక స్తూపం ఆయన ప్రతిష్టను ప్రత్యేకంగా ప్రపంచానికి చాటుతున్నది. మరో ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ నల్గొండ జిల్లా కదిరేని గూడెంలో జన్మించారు.

సుమారు 20 సంవత్సరాలు ఉద్యమ నేపథ్యంలో వచ్చిన సాహిత్యానికి ముఖచిత్రాలను రూపొందిస్తూ, వాటిల్లో తెలంగాణా తత్వాన్ని, సంస్కృతిని, చారిత్రక విలువలను పొందు పరుస్తూ చిత్రాలను గీస్తూ వస్తున్నారు. తెలంగాణా పల్లె బ్రతుకులను, ఖాళీవాడల జాడలను రచించే ఆయన బతుకమ్మ బొమ్మలను అంతకన్నా అద్భుతంగా గీస్తూ వుంటారు.

మనోహర దత్ అనే చిత్రకారుడు ‘స్వార్థపరమైన రాజకీయ వేత్త’ అనే చిత్రంలో ప్రపంచ రాజకీయాన్ని మొత్తం ఆవిష్కరించారు. ప్రపంచం రెండు గొప్ప శక్తుల స్వాధీనమైయున్నట్లు, ఒక వైపు దట్టమైన నీలి గోళాన్నీ, రెండవ వైపు ఎర్రటి గోళాన్ని చిత్రించాడు. మొదటిది అమెరికా, రెండవది రష్యాలకు ప్రతీకలుగా ఊహించాడు.ప్రపంచంలోని అన్ని శక్తులు ఈ రెండు శక్తులకు లోబడే ఉన్నట్లు, ఈ చిత్రమంతా ఒక భయంకరమైన పక్షిని పోలి వుంది.

బి.నరసింగరావు కవి, చిత్రకారుడు, వ్యాసకర్త, నటుడు కావడం వలన“ఆర్ట్‌లవర్స్” అనే సంస్థను ప్రారంభించి, ‘మా భూమి, రంగుల కల, దాసి, మట్టి మనుషులు’ వంటి చిత్రాలు నిర్మించారు. ఇక నాటకాల విషయానికొస్తే 1914 నాటికే ఆర్య సమాజం ప్రజలను బాగా ప్రభావితం చేసింది. ఆ స్ఫూర్తితోనే శ్రీ భాగ్యరెడ్డి వర్మ సాంఘిక నాటక ప్రదర్శనల కోసం హైదరాబాద్‌లో నిర్మించిన కృష్ణా థియేటర్, ప్రేమ్ థియేటర్లు వేదికలై ‘అసుర యుద్ధం” వంటి నాటకాలు ప్రదర్శిత మయ్యాయి. ఒద్దిరాజు సోదరులు (ఒద్దిరాజు సీతారామ చంద్రరావు, ఒద్దిరాజు రాఘవ రంగారావు) ‘మేనత్త, మగ సంసారం, దుష్ట పంచాయితీ’ వంటి నాటకాలు రాసి ప్రదర్శించారు. 1930లో అభ్యుదయ రచయితల హవా నడుస్తున్న కాలంలో హరీంద్రనాథ్ చటోపాధ్యాయ (సరోజినీ నాయుడు తమ్ముడు) అనేక నాటికలు ప్రదర్శించారు. తెలంగాణా సాహిత్యానికి పాదులు చేసి ప్రాణం పోసిన వారిలో వట్టికోట ఆళ్వారు స్వామి ఒకరు. ఆయన “చౌక బేరం, నాడు-నేడు, కనువిప్పు, వంటి నాటికలు ప్రదర్శించారు. అవి ఆనాటి రాజకీయ సామాజిక స్థితి గతులకు దర్పణంగా నిలిచాయి. రజాకార్లు, దొరలు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు, సాయుధ పోరాటం, వంటి వాస్తవ రూపకంగా ఆవిష్కరించడంలో ఆళ్వారు స్వామి సఫలీకృతుడయ్యాడు. దాశరథి స్వాతంత్రోద్యమ ఇతి వృత్తంతో, “త్యాగజ్వాల” నాటికను రచించారు. పాములపర్తి సదాశివరావు ‘కర్తవ్యం, ఆత్మగౌరవం’ వంటి నాటకాలు, కె.ఎల్. నరసింహ రావు సాయుధ పోరాటానికి వ్యతిరేకంగా “గెలుపు నీదే” నాటకాన్ని రాశారు. రజాకార నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి అప్పుడప్పుడే కోలు కుంటున్న గ్రామాల్లో అనుబంధాలతో ప్రగతి వైపు ముందుకు సాగాలని 1956లో “అడుగుజాడలు” నాటకాన్ని వ్రాశారు. పొట్లపల్లి రామారావు ‘సర్ బరాహి’ పగ, న్యాయం నాటికలు తెలంగాణా విమోచనకు పూర్వం బడుగువర్గాల వాస్తవ జీవితాలను ఆవిష్కరించాయి. చిల్లర భావ నారాయణ కవి, రజాకార్ మూవ్‌మెంట్ మిలటరీ ప్రభుత్వం ప్రత్యక్షంగా చూసిన అనుభవంతో “దేశద్రోహం”తో పాటు ‘అగ్నిగుండెలు, కొత్త మనుషులు, ఉప్పెన, మట్టే బంగారం, పదవులు-పెదవులు’ వంటి నాటకాలు రాశారు. బి.ఎన్.శాస్త్రి ‘గ్రామజీవనం, కిరాయిదారు, సహకారం, నిర్బంధ విద్య’ వంటి నాటికలు వ్రాశారు.

సాయుధ పోరాటం జరుగుతున్న కాలంలోనే ‘కళ కళ కోసం కాదు, ప్రజలకోసం’ అనే నినాదంతో 1943లో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణాలో జానపద కళలను, నాటకాలను ఆయుధాలుగా మలచుకొని ప్రజా చైతన్యానికి కృషి చేశారు. సుంకర, వాసిరెడ్డి రాసిన ‘మాభూమి’ నాటకం ఓ సంచలనం. హైదరాబాద్ విమోచనోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన హీరాలాల్ మోరియా ‘నల్ల బంగారం, సమాంతర రేఖలు’, బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి ‘ప్రతీకారం’ నాటకం రాసి ప్రదర్శించారు.

అద్దూరి అయోధ్యరామ కవి భారతదేశం స్వరాజ్యం సాధించాక (1947) నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు త్రివర్ణ పతాకం పట్టుకొని ఢిల్లీ వెళ్లి వేడుకల్లో పాల్గొని, టిక్కెట్టు లేకుండా రైలు ప్రయాణం చేసి హైదరాబాదు వచ్చి తన బుర్రకథ ద్వారా ప్రజలను చైతన్యం చేయ ప్రారంభిచాడు. ‘ఆయనప్రజలను రెచ్చగొడ్తున్నాడని, కనిపిస్తే కాల్చేయాల’ని ఆదేశాలు జారీ అయ్యాయి. అయినా ఆయన జాతీయోద్యమం కథా వస్తువుతో

‘బాంబుల భయం, కాలాన్ని తేవాలి, చీకటి రాజ్యం జనానా రజాకార్, అమరలోక యాత్రికులు, తల్లిప్రేమ, కథలు; ‘నైజాం ప్రజల విజయం’ బుర్రకథను రాసి “తెలంగాణా మంటల్లో” అనే సంపుటిని వెలువరించారు. మరో చైతన్యమూర్తి సుద్దాల హనుమంతు చిన్నతనం నుండి పట్వారీల, భూస్వాముల, రజాకారుల అమానుష దమన కాండలను, అక్రమాలను ఎదురొడ్డే తత్వాన్ని అలవాటు చేసుకున్నారు. నిజాం రాజ్యంలో ఎక్కువ మంది నిరక్షరాస్యులను జాగృత పరచడానికి కళారూపాలే సరైనవని గ్రహించి విచిత్ర వేషధారణ లైన బుడబుక్కల, లత్కోర్‌సాబ్, పకీరు వేషం, గొల్ల సుద్దులు వంటి కళారూపాలను ప్రదర్శించారు. ఆర్యసమాజ్ ప్రేరణతో 1930లో “యధార్ధ భజన మాల” అనే పద్యగేయ సంకలనం వెలువరించారు. ‘పల్లెటూరి పిల్లగాడా (మా భూమి) కన్నుల్లో భగాభగా, కడుపులో దడా దడా, ప్రజా ప్రభుత్వం, భళిరే తెలంగాణా, వహరే తెలంగాణా, రణభేరి మ్రోగింది తెలుగోడా, వేయి, వేయి దెబ్బ’ మొదలైన పాటలు బాగా ప్రాచుర్యాన్ని పొందాయి.


ఈ విధంగా తెలంగాణా విమోచనోద్యమంలో తెలంగాణా కళాకారులు తమ వంతు కృషిచేసి తెలంగాణాను విముక్తం చేశారు. కళలు ప్రజలకు వినోదం అందించాయి. దానితో పాటు ప్రజలను చైతన్యవంతులుగా మార్చాయి. ★

# ప్రాణం పోసిన




బిజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు సంస్కరణ చట్టాలను ఉపసంహరించుకొనక తప్పని పరిస్థితిని మనం చూశాం. ఈ చట్టాలకు నిరసనోద్యమం పేరుతో నకిలీ రైతులు 2020లో అరాచకం సృష్టించారు. ఎర్రకోట మీద దాడి వరకు వెళ్లిన రైతులను ఆనాడు చాలామంది శంకించారు. ఆ అనుమానమే ఇప్పుడు నిజమైంది. వాళ్లు రైతులు కాదు. ఖలిస్తాన్ మద్దతుదారులు. భారత వ్యతిరేకులు. ఆ చట్టాలు రైతులకు మేలు చేసేవేనని ఎంత చెప్పినా వినకపోవడానికి కారణం ఖలిస్తాన్ వాదం. 1984 జూన్ తరువాత నేలకరించిందనుకున్న ఖలిస్తాన్ ఉగ్రవాదం రైతు ఉద్యమం కారణంగా ప్రాణం పోసుకుంది. కాంగ్రెస్, వామపక్షాలు, దేశంలోని ప్రతి బిజేపీయేతర పక్షం సంస్కరణ చట్టాలను ఉపసంహరింప చేయా లని మంకు పట్టు పట్టాయి. పంజాబ్‌లో తాజా అరాచకానికి, అమృత్‌పాల్ వంటి కొత్త ఉగ్రవాది పుట్టుకు రావడానికి కారణం భారత దేశ విపక్షాలే. సరిహద్దు రాష్ట్రమని కూడా ఆలోచించకుండా కాంగ్రెస్, అకాలీదళ్, సమాజ్‌వాదీ పార్టీ అన్నీ కూడా వేర్పాటువాదానికి మరొకసారి బీజాలు పడుతున్నా బిజేపీ చేతులు కట్టేశాయి. రెండు కోణాల నుంచి ఇప్పుడు ఈ సమస్య భారత్‌ను వేధిస్తున్నది. పంజాబ్‌లో దీని అలజడి సరే, కొన్ని విదేశాలలో కూడా ఖలిస్తాన్ మద్దతుదారులు వీరంగం వేస్తున్నారు. రైతు చట్టాలను ఉపసంహ రించేటట్టు చేయడాన్ని పెద్ద విజయంగా పరిగణి స్తున్నారు. కాబట్టి పంజాబ్ దేశ ఏర్పాటును కూడా వత్తిడి విన్యాసాలతో సాధించ వచ్చునన్న నమ్మకం వేర్పాటువాదులలో పెల్లుబుకు తున్నది. వీటి నుంచి జనించినవాడే అమృత్‌పాల్.

నిన్నటిదాకా దుబాయ్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసిన అమృత్‌పాల్ సింగ్ కొన్ని నెలలోనే భింద్రెన్‌వాలేను గుర్తుకు తెస్తూ అలజడి ఎలా సృష్టించగలి గాడు? అమృత్‌పాల్ సింగ్‌ను అరెస్ట్ చేయడానికి ఆ రాష్ట్ర పోలీసులు మార్చి 18 నుంచి ప్రయత్నిస్తున్నప్పటికీ ఇప్పటివరకు సఫలం కాలేదు. అక్కడ ఉన్నది ఆప్ ప్రభుత్వం. కాబట్టే ఆ అరెస్టు సాధ్యం కావడం లేదన్న ఆరోపణలు ఎప్పుడో వచ్చాయి. అమృత్‌పాల్ నాయకత్వంలోని సంస్థ 'వారిస్ పంజాబ్ దే'. అతడు ఖలిస్తాన్ సానుభూతిపరుడు. ఇదంతా ప్రస్తుత పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు ఇది పెద్ద సవాలు. బీజేపీ ప్రభుత్వానికి కూడా అంతే. 80,000 మంది పోలీసుల నిఘా నుంచి ఎలా తప్పిం చుకుపోయాడని కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిజమే, ఎవరి అండతో అమృత్‌పాల్ వేషాలు మార్చి నేపాల్ వరకు వెళ్లాడు? ఇదే కాదు. ఇతడి పలా యనం తరువాత కెనడా, ఇంగ్లండ్, అమెరికాలలో ఖలిస్తాన్ మద్దతు దారులు రెచ్చిపోవడం మరొకటి. భారత జాతీయ పతాకాన్ని దహనం చేయడం వరకు వెళ్లారు. ఇదా సిక్కుల నుంచి నానక్ ఆశించినది?



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

ఢిల్లీలో రైతుల పేరిట వేర్పాటువాదుల అరాచకం, తరువాత పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం రావడం ఖలిస్తాన్ ఉద్యమం భగ్గుమనడానికి కారణం. మార్చి 10, 2022న ఆమ్ ఆద్మీ పార్టీ గొప్ప మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. 'మార్పు' నినాదంతో ఏఏపీ అధికారాన్ని హస్తగతం చేసుకున్న ప్పటికీ, ఇప్పటివరకు అది సాధించిన సానుకూల మార్పేంటనే దానిపై పంజాబీల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వాల వైఫల్యాలు, వాటి ప్రతికూల ప్రభావాలు ఇంకా వారి మనసుల్లోంచి తొలగిపోలేదు. ప్రస్తుత ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్నప్పటికీ, కొన్ని సిక్కు వర్గాలకే పరిమితమైనట్టు ఇటీవలి పరిణామాలు వెల్లడిస్తు న్నాయి. ముఖ్యమంత్రిగా ఎన్నికైన తర్వాత భగవంత్ మాన్ ఖాళీ చేసిన సంగ్రూర్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఖలిస్తాన్ అనుకూల నేత సిమ్రన్ జిత్ సింగ్ మాన్ ఎన్నిక కావడంతో రాష్ట్రంలో ఖలిస్తాన్ ప్రత్యేకవాద 'ప్రమాద ఘంటికలు' మళ్లీ మోగుతున్నాయన్న సత్యం తేటతెల్లమైంది. అయితే ఇతడు అమృత్‌పాల్‌ను సమర్థించకపోవడం పెద్ద ఊరట. వీటిని మొగ్గలోనే తుంచివేయకపోతే చాలా ప్రమాదం. ఎందుకంటే ఇటువంటి ఏ చిన్నపాటి సానుకూలాంశాన్ని వేర్పాటువాదులు వదులుకోరు! ఇప్పుడు సరిగ్గా జరిగిందిదే.

దుబాయ్ నుంచి భారత్‌కు వచ్చి వారిస్ పంజాబ్ దే సంస్థను తన చేతుల్లోకి తీసుకున్న అమృత్‌పాల్ సింగ్ పరిస్థితిని తనకు అనుకూలంగా మలచుకోవడానికి ఇది ఒక అవకాశాన్ని కల్పించింది. నిజానికి 2020 సెప్టెంబర్‌లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతుల ఉద్యమంలోనే ఈ ఖలిస్తాన్ బీజాలు కనిపించాయి. దీన్ని రాజకీయే తర ఉద్యమంగా పేర్కొన్నప్పటికీ, రాడికల్ సిక్కు రాజకీయాల ప్రారంభానికి ఇది వేదికగా నిలిచింది.

దుబాయ్ నుంచి ఏడు నెలల క్రితం భారత్‌కు వచ్చిన అమృత్‌పాల్ సింగ్ పంజాబ్ సంస్కృతిని, సిక్కు మతాన్ని కాపాడేవాడిగా తనను తాను ప్రకటించుకొని రాడికల్ రాజకీయాలు ఆరంభించాడు.

ముఖ్యమంత్రి మాన్ తమది సెక్యులర్ పార్టీగా ఎంతగా చెబుతున్నప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎదురవుతున్న భద్రతా పరమైన సవాళ్లను ఎదుర్కొనడంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా రాజకీయ నాయకుడిగా మారిన గాయకుడు సిద్ధు మూసేవాలా మరణం, పోలీస్ స్టేషన్లపై రెండు రాకెట్ గ్రెనెడ్ దాడులు, హిందూ-సిక్కు వర్గాల మధ్య ఘర్షణల వంటి సంఘటనలు ప్రభుత్వాన్ని కుదిపేసిన మాట వాస్తవం. ఇప్పుడు ఖలిస్తాన్ ఉగ్రవాదులకు నాయకత్వం వహిస్తున్న అమృత్‌పాల్ సింగ్ రూపంలో ప్రభుత్వానికి పెద్ద తలనొప్పి వచ్చిపడింది. అనతి కాలంలోనే ఇతడికి వచ్చిన పలుకుబడిని బట్టి పంజాబ్‌లో అమృత్‌పాల్ సింగ్‌ను ఎక్కువగా అభిమానిస్తున్న వారెవరన్న ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. టెక్ సిక్కు యువత అతని రాడికల్ రాజకీయాల పట్ల ఎక్కువగా ఆకర్షితులవుతున్నారన్న సత్యాన్ని భద్రతా సంస్థలు గుర్తించాయి. భింద్రన్‌వాలే రాడికల్ రాజకీయాల గురించి తమ పెద్దల నుంచి, ఆన్‌లైన్‌లో ఆర్టికల్స్ ద్వారా తెలుసుకుంటున్న యువతను అమృత్‌పాల్ సింగ్ దూకుడు రాజకీ యాలు సహజంగానే ఆకర్షిస్తున్నాయి. కానీ పంజాబ్‌లో రాజకీయాలను సమూలంగా మార్చివేస్తా నంటున్న అమృత్‌పాల్ సింగ్ మాటలను మెజారిటీ




# ప్రతిపక్షాలు

వర్గాలు విశ్వసించక పోవడం సానుకూలాంశం.

అజ్‌నాలా సంఘటన రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీయడంలో అమృత్‌పాల్ సింగ్ పాత్రను మరింత స్పష్టం చేసింది. ఫిబ్రవరి 23న అతడి మద్దతుదార్లు ఆ పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి, అమృత్‌పాల్ సింగ్ ప్రధాన మద్దతుదారు లవ్‌ప్రీత్ సింగ్ తూఫాన్‌ను విడిపించుకుపోవడం ప్రభుత్వానికి సవాలుగా నిలిచింది. తూఫాన్ ఒక కిడ్నాప్ కేసులో నిందితుడు. కేవలం ఒక్కడిని పోలీస్‌స్టేషన్‌లో ఉంచలేని ప్రభుత్వం, రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎట్లా కాపాడగలదన్న ప్రశ్నలు అన్ని వర్గాల నుంచి వస్తున్నాయి. అదీ కాకుండా ఈ సంఘటన అకస్మాత్తుగా జరిగింది కాదని, వారాలుగా పక్కా ప్రణాళిక రచించి మరీ ఈ అకృత్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆనంద్‌పూర్ ఖల్సా పేరుతో నడుపుతున్న అమృత్‌పాల్ సింగ్ ప్రైవేటు సైన్యాన్ని కట్టడి చేయాలని కేంద్రం పంజాబ్ ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతోంది. అంతేకాదు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మార్చి 2న పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను ఢిల్లీకి పిలిపించి పరిస్థితి చేయి దాటిపోకముందే గట్టి చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలుస్తోంది. అంతేకాదు, 1800 మంది కేంద్ర రిజర్వ్ పోలీసులను కూడా రాష్ట్రానికి కేంద్రం పంపింది. భగవంత్ మాన్ ప్రభుత్వం తన రాజకీయ భవితవ్యాన్ని పణంగా పెట్టి మరీ అమృత్‌పాల్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకోకతప్పదు. ఎందుకంటే ఒకవైపు అప్పులు బాగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం సహకారం లేకుండా రాష్ట్రప్రభుత్వం పాలనను సజావుగా నడిపించడం సాధ్యం కాదు. ఇది భగవంత్ మాన్‌కు బాగా తెలుసు. అదీకాకుండా పంజాబ్ వ్యవసాయిక రాష్ట్రం, మద్దతు ధరకోసం కేంద్రంపై ఆధారపడక తప్పదు. దీనికితోడు సరిహద్దు రాష్ట్రం కావడంతో భద్రతాపరంగా మరింత సున్నిత పరిస్థితి నెలకొనడం మరో కారణం. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు వందమంది అమృత్‌పాల్ సింగ్ మద్దతుదారులను అరెస్ట్ చేసినట్టు వార్తలు వచ్చాయి. శాంతిభద్రతల సమస్యల దృష్ట్యా రాష్ట్రంలో ప్రస్తుతం ఇంటర్నెట్‌ను నిలిపి వేయడంతో 27 మిలియన్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

గత ఏడాది రాజకీయ నాయకుడిగా మారిన గాయకుడు దీప్ సిద్ధూ 2022, ఫిబ్రవరిలో కారు ప్రమాదంలో మరణించిన తర్వాత అమృత్‌పాల్ సింగ్ ఒక్కసారి వెలుగులోకి వచ్చాడు. సిద్ధూ నేతృత్వంలో ఏడాది పాటు రైతు ఉద్యమం సాగింది. సిద్ధూ 'వారిస్ పంజాబ్ దే' సంస్థ స్థాపకుడు. దేశంలో వ్యవసాయ రంగాన్ని అధునీకరణ చేయాలన్న ప్రధాని నరేంద్రమోదీ యత్నానికి వ్యతిరేకంగా సిద్ధూ రైతులను, ముఖ్యంగా పంజాబ్ సిక్కు రైతులను సమీకరించి ఉద్యమాన్ని కొనసాగించాడు. నిరసనల పేరుతో రైతులు ఎర్రకోట మీద దాడి చేయడం వెనుక సిద్ధూ హస్తమందుని తేలింది. ప్రభుత్వం తీసుకొచ్చే మార్పుల వల్ల పంట ఉత్పత్తుల ధరలు తగ్గుతాయన్న భయాన్ని రైతుల్లో సిద్ధూ విజయవంతంగా వ్యాపింపజేయగలిగాడు. ఎట్టకేలకు 2021లో మోదీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంది. దీని తర్వాత వారిస్ పంజాబ్ దే సంస్థ సిక్కు మతం, పంజాబ్ సంస్కృతి పరిరక్షణ పేరుతో ఉద్యమాన్ని కొనసాగించింది. సిద్ధూ తర్వాత సంస్థను తన ఆధీనంలోకి తెచ్చుకున్న అమృత్‌పాల్ సింగ్ రెచ్చగొట్టే ప్రసంగాలతో పంజాబ్ ప్రజల్లో పలుకుబడి పెంచుకోవడానికి యత్నించి సఫలమయ్యాడు. మోదీ నేతృత్వంలోని జాతీయవాద ప్రభుత్వం సిక్కుల అభ్యున్నతిని అడ్డుకుంటోందని కూడా విషప్రచారం చేశాడు. చివరకు జర్నయిల్ భింద్రన్‌వాలేను హతమార్చిన ఇందిరా గాంధీకి పట్టిన గతే ఇప్పుడు హోంమంత్రి అమిత్‌షాకూ పడుతుందని హెచ్చరించే దాకా వెళ్లాడు. విచిత్రమేమంటే మత్తుమందులకు బానిసలైన వారిని తిరిగి మామూలు మనుషులను చేయడానికి కృషి చేస్తున్నవాడిని ఈవిధంగా పోలీసులు వేధించడం అక్రమమంటూ అమృత్‌పాల్ సింగ్ తండ్రి తర్సేమ్ సింగ్ పేర్కొన్నాడు. కానీ ఆయన చెప్పినదానికి భిన్నంగా మత్తుమందులకు బానిసలైన యువతను బాగుచేసే నెపంతో, వారిని ఆత్మాహుతి బాంబర్లుగా తయారు చేస్తున్నాడన్న ఆరోపణలను అమృత్‌పాల్ సింగ్ ఎదుర్కొంటున్నాడు.

భారత్‌లో సిక్కుల జనాభా 2 శాతం మాత్రమే. పంజాబ్‌లో వీరి జనాభా అత్యధికం. 1947లో బ్రిటిష్‌వారు మనదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించినప్పుడు సిక్కుమతాన్ని అనుసరించే ప్రజలు అధికంగా ఉన్న పంజాబ్‌ను ప్రత్యేక దేశంగా ప్రకటించాలని కొందరు డిమాండ్ చేశారు. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పంజాబ్‌ను రెండుగా విడగొట్టి, ఒక భాగం పాకిస్తాన్‌లో మరో భాగం భారత్‌లో కలపడంతో ప్రత్యేకదేశం వాదన తెరమరుగైపోయింది. ఈ కాలంలో సిక్కులు రాజకీయ, సాంస్కృతిక స్వాతంత్ర్యం కోసం ఎక్కువగా పోరాటం సలిపారు. అయితే 1980 ప్రాంతంలో సిక్కు వేర్పాటువాదులు రాష్ట్రంలో అనేక మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడటంతోపాటు, ఖలిస్తాన్ ఉద్యమం ఊపందుకోవడంతో కేంద్ర ప్రభుత్వం దాన్ని అణచివేసేందుకు చర్యలు చేపట్టింది. చివరికి 1984లో సిక్కుల స్వర్ణదేవాలయంపై సైనిక చర్యకు ఇది దారితీసింది. ఇంత జరిగినా ఖలిస్తాన్ వాదుల సంఖ్య చాలా స్వల్పంగా ఉండటం గమనార్హం. ఎందుకంటే ఉగ్రవాదం మళ్లీ జడలు విప్పితే తీవ్రంగా నష్టపోయేది తామేనన్న సత్యం సిక్కు ప్రజలకు బాగా తెలుసు. అందువల్లనే ఖలిస్తాన్ వాదులకు మనదేశంలోని సిక్కు సమాజం నుంచి పెద్దగా మద్దతు లభించడంలేదు.

విదేశాల్లో కొనసాగుతున్న ఖలిస్తాన్ ఉగ్రవాదం




1980 ప్రాంతంలో సిక్కు వేర్పాటువాదులు రాష్ట్రంలో అనేక మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడటంతోపాటు, ఖలిస్తాన్ ఉద్యమం ఊపందు కోవడంతో కేంద్ర ప్రభుత్వం దాన్ని అణచివేసేందుకు చర్యలు చేపట్టింది. చివరికి 1984లో సిక్కుల స్వర్ణదేవాలయంపై సైనిక చర్యకు ఇది దారితీసింది. ఇంత జరిగినా ఖలిస్తాన్ వాదుల సంఖ్య చాలా స్వల్పంగా ఉండటం గమనార్హం.

దేశ భద్రతకు పెను ప్రమాదకరంగా భారత ప్రభుత్వం భావిస్తోంది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద ఇటువంటి చాలా గ్రూపులను భారత ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. అయితే బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాల్లో ఈ గ్రూపులకు సిక్కుల నుంచి మద్దతు లభిస్తోంది. అమృత్‌పాల్ సింగ్ మద్దతు దారులు యునైటెడ్ కింగ్‌డమ్, యూఎస్‌ల్లోని భారత కాన్సులేట్ కార్యాలయాలపై దాడులు చేసి విధ్వంసం సృష్టిస్తున్నారు. కెనడాలో కూడా ఖలిస్తాన్ వాదులు విధ్వంసానికి పాల్పడుతుండటంతో పోలీసుల గాలింపులు కొనసాగుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పంజాబ్‌కు చెందిన పెద్దసంఖ్యలో సిక్కులు ఉద్యోగ ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ యూఎస్, బ్రిటన్, ఆస్ట్రేలియాలకు వెళ్లి స్థిరపడ్డారు. ఆయా దేశాల్లో సిక్కుల జనాభా అధికంగా ఉండటానికి ఇదే కారణం. అయితే ఖలిస్తాన్ మద్దదారుల సంఖ్య మనదేశంలో చాలా తక్కువ. భారత్‌లో మాదిరి కాకుండా పై మూడు దేశాల్లో తమ కార్యకలాపాలను నిర్వహించుకునే స్వేచ్ఛ అధికంగా ఉండటంతో, అక్కడి వారు ఖలిస్తాన్ ఉద్యమానికి తమ మద్దతు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా బ్రిటన్‌లో ఖలిస్తాన్ మద్దతుదారులు పాల్పడిన విధ్వంసం నేపథ్యంలో భారత్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. అక్కడి భారత్ హైకమిషన్ కార్యాలయానికి భద్రత కల్పించడంలో వైఫల్యంపై తన నిరసనను తెలియజేయడమే కాదు, ఢిల్లీలోని బ్రిటిష్ రాయబార కార్యాలయం వద్ద భద్రతను తొలగించింది. కుక్కకాటుకు చెప్పుదెబ్బ మాదిరిగా ప్రభుత్వం తీసుకున్న చర్యతో, బ్రిటన్ దిగొచ్చి, లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం వద్ద భద్రతను పెంచింది. ఫలితంగా మార్చి 22న మళ్లీ ఆందోళన జరపాలని వచ్చిన ఖలిస్తాన్ మద్దతు దారులు వెనక్కి తగ్గక తప్పలేదు. ఫెడరేషన్ ఆఫ్ సిక్ ఆర్గనైజేషన్, సిక్కు యూత్ జెతేభాండియా సంస్థలు మార్చి 22న భారత్ హైకమిషన్ వద్ద నిరసనలకు పిలుపునిచ్చాయి. అయితే భద్రత కట్టుదిట్టంగా ఉండటంతో వారి ఆలోచన ఫలించలేదు. ఇదే సమయంలో లండన్‌లోని భారత రాయబార కార్యాలయం.. అక్కడి సిక్కువర్గాల్లో ప్రచారమవుతున్న తప్పుడు వార్తలకు కౌంటర్ ఇవ్వడం మొదలుపెట్టింది. ముఖ్యంగా పంజాబ్‌లో నిషేధిత 'వారిస్ పంజాబ్ దే' సంస్థకు వ్యతిరేకంగా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన వాస్తవాలను బ్రిటిష్ సిక్కులకు సవివరంగా తెలిపేందుకు చర్యలు చేపట్టింది. కేవలం కొద్దిమంది వ్యక్తులు ప్రచారం చేసే తప్పుడు వార్తలను నమ్మొద్దంటూ బ్రిటిష్ సిక్కు పౌరులను కోరుతోంది.



ప్రస్తుతం పరారీలో ఉన్న అమృత్‌పాల్ సింగ్ కోసం పోలీసులు పెద్దఎత్తున గాలింపు జరుపుతున్నారు. ఇతడు నేపాల్‌కు తప్పించుకుపోయినట్టు తేలడంతో అక్కడి నుంచి పారిపోకుండా ఆపవలసిందని భారత్ వారిని కోరింది. ఇదిలా ఉండగా వారిస్ పంజాబ్ దే సంస్థ రాష్ట్ర హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసింది. పోలీసులు సింగ్‌ను అక్రమంగా నిర్బంధించారన్నది దీని సారాంశం. అయితే 80వేల మంది రాష్ట్ర పోలీసులు వెతుకుతుండగా సింగ్ ఎట్లా తప్పించుకొనిపోగలడని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే కాదు నిఘా వర్గాల ఘోర వైఫల్యమంటూ చీవాట్లు పెట్టింది. అమృత్‌పాల్ సింగ్ తప్పించుకోవడంలో అతని సన్నిహిత సహచరుడు పాపల్‌ప్రీత్ సింగ్ (38) పాత్ర ఉన్నదని అధికారులు చెబుతున్నారు. పాపల్‌ప్రీత్ సింగ్‌కు ఐఎస్ఐతో సన్నిహిత సంబంధాలున్నాయని, కేవలం వారి ఆదేశాల మేరకే ఇతగాడు నడుచుకుంటున్నాడని కూడా వారు అనుమానిస్తున్నారు. అమృత్‌పాల్ సింగ్‌కు ఇతడు మార్గదర్శకుడని, ఇతని సలహాల మేరకే సింగ్ పనిచేస్తాడని కూడా పోలీసులు గట్టిగా చెబుతున్నారు. గత ఏడాది అమృత్‌పాల్ సింగ్ దుబాయ్ నుంచి భారత్‌కు వచ్చి 'వారిస్ పంజాబ్ దే' సంస్థ పగ్గాలు చేపట్టిన దగ్గరి నుంచి పాపల్‌ప్రీత్ సింగ్ అతడితో సన్నిహితంగా పనిచేస్తున్నాడు. పాపల్‌ప్రీత్ సింగ్‌కు ఐఎస్ఐతో సన్నిహిత సంబంధాలుండటం వల్ల అమృత్‌పాల్‌సింగ్ ఎపిసోడ్ మొత్తం ఆ సంస్థ మార్గదర్శనంలో సాగుతున్నదని పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు.




1980 దశకాల్లో మీడియా నేడున్నంత విస్తృత స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ఏ సంఘటన అయినా ప్రముఖ పత్రికల్లో వస్తేనే సామాన్య జనానికి తెలిసేది. కానీ నేడా పరిస్థితి లేదు. సమాచార విస్తృతి వేగం పెరగడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇందుకు దోహదం చేస్తుండడంతో క్షణాల్లో సమాచారం ప్రజల్లోకి వెళ్లిపోతున్నది. ఫలితంగా స్వల్ప సంఘటనకూ విపరీత ప్రచారం రావడంతో, ఏదో జరిగిపోతున్నదన్న భయాందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా చెప్పాలంటే ప్రధాన సంఘటనకు, స్వల్ప సంఘటనకు తేడా లేకుండా పోయింది. 'అతి' ప్రచారం అనర్థాలకు దారితీస్తోంది. సంఘ విద్రోహశక్తులు, వేర్పాటువాదులకు విపరీత ప్రచారం లభించడానికి కారణం ఇదే. ★

# సప్తసముద్రాల ఈతలో మొనగాడు

మహాసముద్రాలు ఈదటం భారత ఈతగాళ్లకు కొత్తేంకాదు. అలనాటి మిహిర్‌సేన్, ఆర్తీ సాహాల నుంచి నేటితరం స్విమ్మర్లు రోహన్ మోరే, భక్తీశర్మ వరకూ ఎందరో మహాసముద్రాలను ఈదినవారే. అయితే సప్తసముద్రాలను ఈదటంలో ముంబై యువకుడు శుభం వనమాలీ తర్వాతే ఎవరైనా. సాహసమే ఊపిరిగా సాహసక్రీడల్లో పాల్గొనటం అందరికీ సాధ్యం కాదు. ప్రధానంగా ఈ భూఖండంలోని ఏడు మహాసముద్రాలను ఈదాలనుకోడం గొప్పసాహసమే మరి.






మహాసముద్రాల ఈత అనగానే అలనాటి భారత దిగ్గజ స్విమ్మర్లు మిహిర్ సేన్, ఆర్తీ సాహా మాత్రమే గుర్తుకు వస్తారు. మిహర్ సేన్ లాంటి గజ ఈతగాడు ఓ ఏడాదిలో ఐదు మహాసముద్రాలే ఈదితే, నవీముంబైకి చెందిన 26 ఏళ్ల శుభం వనమాలీ ఏకంగా సప్తసముద్రాలు ఈది తనకు తానే సాటిగా నిలిచాడు.

**ఉబ్బసాన్ని అధిగమించి...**

నవీముంబైలోని నెరుల్‌కు చెందిన శుభం వనమాలికి బాల్యం నుంచే ఉబ్బసం వ్యాధి ఉండేది. తండ్రి ధనుంజయ జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు, తల్లి దీపిక జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారిణి కావడంతో శుభం ఆరేళ్ల ప్రాయం నుంచే ఈత పట్ల ఆకర్షితుడయ్యాడు. ఉబ్బసం వ్యాధిని జయించడం కోసం ఈత అలవాటు చేసుకొన్న శుభంకు మహాసముద్రాలలో ఈత కొట్టాలన్న కోరిక కలిగింది. ఈత కొట్టడమే తన జీవితంగా, ఊపిరిగా మార్చుకున్నాడు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాలు సాధించిన సమయంలో జాతీయ గీతాలాపన కార్యక్రమాలు చూసి ఉత్తేజం పొందిన శుభం.. తాను సైతం అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గుర్తింపు తీసుకురావాలని, తన విజయాలను టీవీ ప్రసారాల ద్వారా తన తల్లిదండ్రులు చూడాలని తపన పడుతూ ఉండేవాడు.



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

**అంతర్జాతీయ స్విమ్మర్‌గా...**

తొమ్మిదేళ్లకే జిల్లా స్థాయి నుంచి జాతీయ స్విమ్మర్ స్థాయికి ఎదిగిన శుభం 18 సంవత్సరాల వయసుకే అంతర్జాతీయ స్విమ్మర్‌గా గుర్తింపు పొందాడు. 2014లోనే ఇంగ్లిష్ చానెల్, జిబ్రాల్టర్ జలసంధులను ఈదిన అత్యంత పిన్న వయస్కుడైన స్విమ్మర్‌గా, తొలి ఆసియా స్విమ్మర్‌గా రికార్డులు నెలకొల్పాడు. లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుతో పాటు పలుమార్లు లిమ్కా బుక్ ఆఫ్ ఇండియన్ రికార్డుల్లో చోటు సంపాదించాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈత పోటీలలో శుభం డజన్ల కొద్దీ రికార్డులు సాధించాడు. ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి ధరమ్ తార్ వరకూ అరేబియా సముద్రాన్ని ఈదడం ద్వారా తన ఘన విజయాలకు తెరతీసిన శుభం ఆ తర్వాత మరి వెనుదిరిగి చూసింది లేదు.

**టెన్సింగ్ నార్గే అవార్డు..**

అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లిష్ చానెల్, జిబ్రాల్టర్ జలసంధి, కాటాలినా చానెల్, మన్ హట్టన్ మారథాన్ స్విమ్, గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి దహాను బీచ్ ఈతలో పాల్గొని రికార్డుల్లో చోటు సంపాదించాడు. సాహసక్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు భారత ప్రభుత్వం ఇచ్చే టెన్సింగ్ నార్గే అవార్డును 2022 సంవత్సరానికి శుభం వనమాలీ అందుకొన్నాడు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్రపతి భవన్‌లో గత నెలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ పురస్కారం స్వీకరించాడు. గత పుష్కరకాలంగా తాను పడిన కష్టం, చేసిన సాధన, అంకితభావాలకు తగిన గుర్తింపే భారత ప్రభుత్వ అవార్డు అంటూ శుభం పొంగిపోతున్నాడు. అంతర్జాతీయంగా ఎన్ని అవార్డులు, పురస్కారాలు అందుకున్నా, ఘనతలు సాధించినా.. భారత ప్రభుత్వం ఇచ్చిన అవార్డుకు ఏదీ సరికాదని ఈ మహాస్విమ్మర్ చెబుతున్నాడు.

**సమాజ సేవ కోసం ఈత...**

ఈత ద్వారా తనవంతుగా సమాజ సేవలో పాలుపంచుకోవాలని శుభం నిర్ణయించాడు. దేశంలోని కోట్లాదిమంది బాలలు చదువుకొనే సమయంలో ఎదురవుతున్న వైకల్యాల గురించి సమాజంలో స్పృహ పెంచడం కోసం, నిధుల సమీకరణ కోసం గోవా నుంచి ముంబై వరకూ అరేబియా సముద్రంలో గల 413 కిలోమీటర్ల దూరాన్ని 15 రోజులపాటు ఈదాలని ఈ నవీముంబై స్విమ్మర్ నిర్ణయించాడు. తన ఈ సాహస ఈత ద్వారా సమీకరించిన నిధులను బాలల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఓ స్వచ్ఛంద సంస్థకు అంద చేయాలని నిర్ణయించాడు. పుట్టకతోనే రకరకాల వైకల్యాల ఎదుర్కొంటున్న బాలల్లో ఏదో ఒక నైపుణ్యం, కళ దాగి ఉంటాయన్నది తన ప్రగాఢ విశ్వాసమని, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల ప్రోత్సాహం, ఆదరణ, అండదండలు లేకుంటే జీవితంలో ఏదీ సాధించలేమని శుభం అంటున్నాడు. రానున్నకాలంలో మహాసముద్రాల ఈతలో మరిన్ని సాహసాలు చేయాలన్నదే తన లక్ష్యమని ప్రకటించాడు. ★





# గగన సమరధీర


మహోన్నత హిమాలయాన్ని ఎవరూ
జయించలేరు.
మహార్ణవం వంటి జాతిని
మరెవరూ తరించలేరు.
మహిమాలయ తల్లికి
మణిమకుటం గగనసీమ
అక్కడి వాహినులే పొంగి
కలిగిస్తాయి మనోరమ.
ధరణీతలం దద్దరిల్లేలా
భరతభూమి విజృంభిస్తుంది.
యుద్ధ సిద్ధమై శత్రు
వ్యూహాలన్నింటినీ ఛేదిస్తుంది.

జాతిరక్షణకు సదా సన్నద్ధంగా ఉండే త్రివిధ దళాలు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్. పేరులోను తీరులోనూ హోరూ జోరూ నిండిన 'ఫోర్స్' మన వైమానిక బృందం. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విశ్వమంతటా విశిష్టం. శక్తియుక్తుల్లో పేరెన్నిక గన్న విమానదళం ఏడు దశాబ్దాలకు పైగా ఘనచరితతో ప్రత్యేకం. లక్షలాది సిబ్బంది, వేలకొద్దీ విమానాలు ది గ్రేట్‌గా నిలుస్తున్నాయి. నాడూ నేడూ, సేనా సంబంధ 'ఆపరేషన్'లో భాగంగా విజయ్, మేఘదూత్, పవన్ వంటివి కాలగమనంలో ఎన్నెన్నో. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా శాంతిపరిరక్షణ బాధ్యతను మనదైన వాయుసేన నిర్వహిస్తూ వస్తోంది. సైన్యం అంటేనే పోరాటం. పోరు అనే పదానికి మారు పేరు శాలిజా ధామీ!

**శాలి, శిల, శైల అనేవి ఒకేలా అనిపిస్తాయి, వినిపిస్తాయి.**

**శాలిలో బలశాలి ఉంది. శిలలో దృఢత్వం నిండింది.**

శైలిలోనూ శిఖరస్థాయి ధ్వనిస్తుంది. వీటన్నిటి సమాహారంలా మన ముందు కనిపిస్తున్న శాలిజా అసలు సిసలు కెప్టెన్. భారత వాయుసేనలోని యుద్ధ నిర్వహణ బృందానికి ప్రథమంగా నేతృత్వ బాధ్యత చేపట్టిన వీరనారి.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

సమర సమయంలో మన సేనావాహినికి అన్నివైపులా నిలిచే విభాగాలు లెక్కలేనన్ని, రక్షణ సామగ్రి, ఆయుధ పరంపరను ఆకాశవీధిలో తరలిస్తారు. సైనిక ప్రయోజనాల కోసం అంతరిక్ష పరికరాల తరలింపులో సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తారు. ప్రకృతి వైపరీత్యాల దరిమిలా, ఎటు వంటి ప్రాంతంలోనైనా బాధితులకు అండదండగా ముందుకు దూసుకెళ్తారు. విభిన్న సందర్భాల్లో ఇతర దేశాలకూ తరలివెళ్లి సహాయ సమన్వయాలు నిర్వర్తిస్తారు. వీటికన్నా మిన్నగా, ఏకంగా పోరాట విభాగానికే నాయకత్వం వహిస్తున్నారు కెప్టెన్ శాలిజా. ఐఏఎఫ్ అనగానే ఆమె పేరు తళు క్కుమంటుంది. గ్రూప్ కెప్టెన్సీ అని వినడంతోనే, ఇప్పుడు తనదైన పటిమ మారుమోగుతోంది.

సాయుధ దళంలో నాయకత్వం అంటే మాటలా? చేతల వనితగా తొలి నుంచీ తనను తాను నిరూపించుకుంటూనే వస్తున్నారు శాలిజా. పంజాబ్ ప్రాంతంలోని సరభా అనే చిన్నపాటి ఊరు ఆమె స్వస్థలం. తల్లిదండ్రులు ప్రభుత్వ సేవల శాఖల్లో విధులు నిర్వహించినవారు. తల్లి దేవకుమారి మంచినీటి సరఫరా విభాగంలో, తండ్రి హర్కేష్ విద్యుత్ ప్రసార నిర్వహణ విభాగంలో సేవలు అందించారు. ఆ రెండు విభాగాలు అత్యవసర సేవలకు సంబంధించినవే కావడంతో, ఆ జీవన సరళే బాల్యం నుంచీ ప్రభావితం చేసిందంటున్నారు లేడీ కెప్టెన్.

**తొలి నుంచీ తెగువ**

సంవత్సరాలుగా ప్రభుత్వ సర్వీసుకే అంకితమైన అమ్మ,నాన్నలు తమ బిడ్డకు సేవాభావాన్నే నూరి పోశారు. ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చారు. మంచి మార్కులు సాధించడంలోని పట్టుదలను అలవాటు చేయించారు. సమయపాలన, పూర్వ సంసిద్ధత అంటే ఏమిటో అనుభవపూర్వకంగా నేర్పించారు. క్రమశిక్షణ అవసరాన్ని తేటతెల్లం చేయడంతో, శాలిజా ధీశక్తి వెల్లివిరిసింది. పెద్దల కలల పంటగా



# శాలిజా

తనను తాను తీర్చిదిద్దుకున్నారామె.

ఆమె మహిళా కళాశాలలో పట్టభద్రులయ్యారు. ఆ రోజుల్లోనే ఎయిర్‌ఫోర్స్ ఘనత ఎంతటిదో విస్తారంగా తెలుసుకున్నారు. ఆ కార్యక్రమాల గురించి ఎనలేని శ్రద్ధాసక్తులు కనబరిచారు. సరిగ్గా అప్పుడే పీపీ సింగ్ మార్గదర్శనం లభించింది. ఎవరాయన? భారతీయ యువతను రక్షణ దళాలవైపు మళ్లించే ఉత్తమ పౌరుడు. ఆ కారణంగ థానే నేషనల్ కేడెట్‌కోర్‌లో చేరారు శాలిజా. సుశిక్షితురాలయ్యారు. తదుపరి పరిణామాలు మొదటగా ఆమెను ఫ్లయిట్ కమాండర్‌గా చేశాయి. వింగ్ కమాండర్‌గా తీర్చి దిద్దాయి. ఫోర్స్‌లో చేరి రెండు దశాబ్దాలవుతోంది. తన గ్రామ సమీపంలోని లూథియానా తనకు ఎంతో నేర్పిందంటారు. సేవాబలానికి అది మారు పేరు, ఎందరెందరినో తయారుచేసిన ఆదర్శ ప్రాంతమని ఇప్పటికీ చెప్తుంటారు.

**వడివడిగా ముందడుగు**

తాను చదివింది 'కమ్యూనికేషన్'. సంపాదించింది టెక్నాలజీ డిగ్రీ. విమానసేనలో చేరగానే కనులారా చూసింది 'దీపక్' ఫ్లయిట్‌ను. అక్కడే తను మొదట ఫ్లయింగ్ ఆఫీసర్ అయ్యారు. రెండేళ్లు గడిచాయో లేదో ఫ్లయిట్ లెఫ్టినెంట్‌గా పదోన్నతిని సొంతం చేసుకున్నారు. మరికొంత కాలానికి స్క్వాడ్రన్ లీడర్ అనిపించుకున్నారు. 2016లో వింగ్ కమాండర్‌గా ప్రమోట్ అయింది. అంటే – ఏడేళ్ల క్రితం. మళ్లీ ఫ్లయిట్ కమాండరూ తానే. మరో ముఖ్యాంశం–హిందన్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు సంబంధించి, చేతక్ హెలికాప్టరుకు సారథ్య బాధ్యతలు తీసుకున్నారు. ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టరుగా ఉన్నతాధికారులతో శభాష్ అనిపించుకున్నారు. అదే విభాగంలో శాలిజానే మొదటి వనితారత్నం.

**నేటికీ ప్రశంసల వెల్లువ**

'మా అమ్మాయి అని చెప్పడం కాదు కానీ, శాలిజా – వనితలందరికీ ఆదర్శం' అంటారు తండ్రి. ఆయనకిప్పుడు 66 ఏళ్లు. లక్ష్మీనగర్‌లోని తన నివాసానికి రోజూ వస్తున్న ఫోన్‌కాల్ అభినందనలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వెస్టర్న్ సెక్టార్‌లోని యూనిట్‌లో ఆ మహిళా కమాండర్, పక్కనే కనిపిస్తున్న హెలికాప్టర్ ఎవరిలోనైనా దేశభక్తిని పెంపొందిస్తాయని చెప్తుంటే తల్లి కళ్ల నుంచి ఆనందబాష్పాలు జాలువారాయి. గ్రూప్ కెప్టెన్ అంటే, దరిదాపుగా ఆర్మీలోని కల్నల్ స్థాయి. ఆ పదవి ఫ్రంట్‌లైన్ కమాండ్ హెడ్‌క్వార్టర్స్‌లోని 'ఆపరేషన్స్' విభాగంలో లీడర్. అంతకుమించి, క్షిపణుల స్క్వాడ్రన్‌కు నేతగా బాధ్యతలు నెరవేరుస్తున్న ధీరురాలు. ఇంతటి ప్రత్యేకత దేశమంతటికీ అత్యంత విలక్షణం, ఎంతైనా వందనీయం. ప్రశంసా పాత్రం.

యుద్ధ హెలికాప్టర్లు శత్రుసేనల్ని గడగడలాడిస్తుంటాయి. రెప్పపాటులో మెరుపులు సృష్టించి, అనుకున్న లక్ష్యాల్ని సూటిగా ఛేదిస్తుంటాయి. అటువంటి గగన వాహనంలో దాదాపు మూడువేల గంటల సారథ్య అనుభవం శాలిజాకు జత చేరింది. బంధుమిత్రులు, సహ అధికారులతో ముక్తసరిగా మాట్లాడే ఆమె... విధి నిర్వహణ వేళల్లో మనమెవ్వరం ఊహించలేనంతటి గడసరి.

**సేవకూ సదా సన్నద్ధత**

ఈ ఏడాది తొలి మూడు నెలలూ ఘనమైనవే. గడచిన జనవరిలోనే మన సేనా వాహినిలోకి కెప్టెన్ శివ ప్రవేశించడం గుర్తుండే ఉంటుంది. పదాతి దళంలోని ఫైర్ అండ్ ఫ్యూరీ కోర్‌లో ఆర్మీ ఆఫీసర్ ఆమె. ఇప్పుడు ఈ విమాన బలగంలోకి శాలిజా సమున్నత ప్రవేశం అతివల నాయకత్వ రంగాన మరిన్ని ఆశల్ని రేకెత్తిస్తోంది. నేరుగా రణక్షేత్రంలో విధి నిర్వహణ భాగ్యానికి రూపురేఖలద్దిన సందర్భమిది.

*నగరమ్ములు జనపదాలు*
*నగా గ్రములు కాననాలు*
*తరులు ఝరులు గిరి గహ్వర*
*తతులు యుద్ధ రంగమ్ములు*
*గగనాంగణ గర్జనములు*
*కనద్ధరా సంభ్రమములు*
*సాగర సంఘర్షణములు*
*శతశతఘ్ను ఘోషణములు*
*శాత్రవ విధ్వంసనమ్ము*
*సాగించెదు, మోగించెదు*
*జయదుందుభి నాలకింప*
*సాగిరండు మునుముందుకు*
*నిప్పులుమియు విమానముల*
*నుప్పరమున గాల్చి కూల్చు*
*విజయోజ్వల వీరచక్ర*
*విజేతలకు కేల్మోడ్పుడు*
*అఖండమే భరతజాతి*
*అజేయమని చాట రండు!*

ఇవి చదువుతున్నంతసేపూ, వింటున్నంతసేపూ మనముందు నిలిచే వీరవనితగా భావించి... శాలిజాను సంభావిద్దాం. ★



కథ

# పాపం-పుణ్యం

## గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

శ్రీదేవిని నేను పూజించేవాణ్ణే కాని, ఒళ్లంతా పులుముకోవాలని తాపత్రయ పడేవాణ్ణి కాను. అంటే, నేను ఆస్తికుణ్ణేకాని, కొబ్బరికాయలు, అగరొత్తులు, హ్రీం హ్రీం అరుపులు వగైరాలు నాకిష్టం వుండవు. మంచి చెయ్యాలను కున్నది చేస్తాను. దానికి బిరుదులు, నిషేధాలు కోరుకోను. కానీ నా ఆప్తమిత్రుడు సూర్యారావు దగ్గర మాత్రం దీనిపై చర్చ వచ్చేసింది.

* * *

గవర్నమెంటు కాలేజి ప్రిన్సిపాల్‌గా నేను రిటైర్ అయిన వెంటనే నా ఆప్త మిత్రుడు సూర్యారావు అక్కడే ప్రిన్సిపాల్ అయ్యాడు. అతనూ రిటైర్ అయ్యాడు. అయితే, ఒక హాస్టల్ నడుపుతున్నాడు. నేను సాహిత్య వ్యాసంగంలో గడుపుతున్నాను. ఊళ్లో నా ఇల్లు ఆగ్నేయ మూల ఉంటే అతని ఇల్లు వాయవ్య మూల ఉంది.

పొద్దున్నే సూర్యారావు నుంచి ఫోను అందుకుని నేను అతని ఇల్లు-కమ్ హాస్టల్‌కు వెళ్లాను. ఎనిమిదిమంది విద్యార్థులూ – 9వ తరగతి, 10వ తరగతి, ఇంటర్ డిగ్రీ-వాళ్లు వాళ్లు. వాళ్లూ, సూర్యారావు భార్య జయమ్మ, దొడ్లో 10×15 అడుగులున్న పూలమొక్కల స్థలంలో కర్రపుల్లల్తో నేలంతా కెలుకుతున్నారు.

సూర్యారావు నాతో అన్నాడు, "కృష్ణా, గొడవొచ్చి పడిందయ్యా, ఇంట్లో మా ఆవిడ రోజూ ఒక నాగ ప్రతిమకు పూజచేసి నైవేద్యం పెట్టేది. ఆ తర్వాత అన్నం, పప్పు, కూర, పులుసు వండి ఈ నైవేద్యం పెట్టినదాన్ని కలిపి కుర్రాళ్లకి బాక్సుల్లో అంది స్తూండేది. వాళ్లు తీసుకెళ్లిపోయేవారు. ఇవ్వాళ ఆమె పూజ జరగలేదు. ఎందుకంటే, ఆ నాగప్రతిమ పూజ మండపంలో లేదు! దీంతో టైమ్‌టేబిల్ అంతా ఆగిపోయింది. ఇదిగో నిన్న పూజ చేసిన తర్వాత ఆ నిర్మాల్యం తీసికెళ్లి ఈ మొక్కల్లో అలవాటు ప్రకారం పోసేసినప్పుడు ఆ పూలతో పాటు స్వామి వెళ్లి పోయాడేమోనని అంతా కలిసి వెతుకుతున్నారు. వంటా లేదు, గంటా లేదు, చదువులు ఈ పూట చెట్టెక్కాయి."

"అరెరె, ఎంత పని జరిగింది!.. పోనీ సూర్యం, నేను కూడా ఓ చెయ్యి వెయ్యనా?"అని నేనన్నాను,

"నీ భ్రమ! ఇప్పుడు తొమ్మిదవుతోంది. ఇవ్వాళ పొద్దున ఏడింటి నుంచీ ఇప్పటి దాకా ఈ తొమ్మిది మంది వీరులూ, నాతో కలిసి పదిమందీ కూడా, సగర చక్రవర్తి భూమిని తవ్వినట్లు ఈ తోటని తవ్వి పోసేశాం. హుఁ రా, కాఫీ తాగుదాం....!

ఇద్దరం వెళ్లి వాకిట్లో కూర్చుని ఫ్లాస్కుల్లోని కాఫీ తాగుతున్నాం.

కుర్రాళ్లు చేతులు కడుక్కొని తమ గదిలోకెళ్లి పోయారు.

జయమ్మ వచ్చి "ఏమండీ స్వామి కనిపించ లేదండి" అంది. ఆమె మొహంలో ఏడుపు ఒకటే తక్కువ. పమిట చెంగుతో కళ్లు తుడుచుకుంది. "వచ్చే కృత్తిక నక్షత్రం రోజున బ్రాహ్మణ్ణి తీసికెళ్లి అభిషేకం చేద్దామనుకున్నాను. ఇంకేం చేయిస్తాను." అంది.

"అమ్మా, కృత్తికా నక్షత్రం ప్రతినెలా వచ్చేదే. దానికి అంత దిగులెందుకు?" అన్నాను,

"అది కాదు, అన్నయ్య గారూ! ఇవి రాక రాక వచ్చే రోజులు. మంగళవారం కూడా కలిసుందట. బెజవాడ దగ్గర కంచిస్వామి వారు కట్టిన ఆలయంలో చేస్తే మహా పుణ్యంట" ఆమె మళ్లీ కళ్లు తుడుచుకుంది.

కాలేజీ కుర్రాళ్లు "అమ్మగారూ మేం కాలేజీకి వెళ్లిపోతాం లెండి" అంటూ వచ్చారు. జయమ్మ, "ఆగండి నాన్నా! పోనీ అన్నం ఒక్కటే వండి పెరుగేసిస్తాను" అంటూ ఇంట్లో కెళ్లిపోయింది. వాళ్లు గదిలోకెళ్లారు.

సూర్యారావు అన్నాడు, "ఒకడు పదో తరగతి వాడు. పేరు శివుడు. ముగ్గురు తొమ్మిదో తరగతి వాళ్లు. ఇద్దరు ఇంటరు, ఇద్దరు డిగ్రీ ఫస్టియరు. డిగ్రీ వాళ్లే తొందరపడతారు. లాబ్‌ల గురించి ఈపూట వాళ్లకి అన్నం లేదు. ఏం చెయ్యగలం?"

"మీ దంపతులు ఎంతో చేస్తున్నారు. ఇంకేం చెయ్యగలరు?" అన్నాను,

"అది కాదు కృష్ణా! వీళ్లల్లో ఇద్దరికి అమ్మలేదు. ఇద్దరికి నాన్నలేదు. ఎవ్వరికీ ఇంటి దగ్గర తిండిలేదు. వాళ్లకు నా పెన్షన్‌తో నేనేదో చెయ్యగలిగింది చేస్తున్నాను."

"నువ్వు చేసేది సరే సూర్యం! నీ భార్య కాశీ అన్నపూర్ణలాగా వండి పెడుతోంది. ఇది అసలు గొప్ప విషయం! నిరుత్సాహ పడొద్దని ఆమెకు చెప్పు. నాగప్రతిమ దొరుకుతుందిలే... వెళ్లొస్తాను." – అంటూ నా ఇంటికి వచ్చేస్తాను.

* * *

వారం అయ్యింది. సూర్యారావు ఫోన్‌లో అన్నాడు, "ఏమిటో కృష్ణా! జయమ్మ, లేచి తిరగట్లేదు.



ఏం చేస్తోందో తెలీనట్లు ఏదో చేస్తోంది. స్టూడెంట్లు, వాళ్లే వండుకుని తిని వెడుతున్నారు. అన్నట్టు గంట గంటకీ వెళ్లి కర్రపెట్టి పూల మొక్కలన్నీ కెలుకుతోంది. మళ్లీ వచ్చి కూర్చుండి పోతోంది. నువ్వొకమాటు రాకూడదూ?"

తక్షణం నా బండిని దుర్రుమనిపించి వెళ్లాను. టైము ఉదయం పదకొండు.

జయమ్మ దేవతామందిరం దగ్గర పడుకోనుంది. ఆమె చూపులు ఆ మందిరంలోకే.

"చెల్లమ్మా, ఏమిటీ హడావిడి?" అడిగాను.

జయమ్మ, చటుక్కున లేచి "ఆఁ వచ్చావా సుబ్రహ్మణ్యస్వామి వచ్చావా!" అంటూ నావైపు ఎగాదిగా చూసి "మీరా, అన్నయ్యా!" అంటూ మళ్లీ పడుకొని పోయింది. మళ్లీ లేచి "ఆ స్వామి రాడు, నా కొడుక్కి కొడుకుని ఇవ్వడు. నాకు మనవడు పుట్టడు! నాకు వంశం లేదు!... నా బతుకింతే దేవుడా!..." భళ్లున ఏడుపు కక్కేసింది.


సూర్యం ఆమె వీపు నిమురుస్తూ "ఏడవకు, వస్తాడు, వస్తాడు.'' అన్నాడు. ఆమె, ''వచ్చేవాడయితే వెళ్లిపోతాడా, రాడు. నీకెం తెలీదు, రాడు..."

"చెల్లమ్మా! మీరు దొడ్డి ఊడ్చే పనిమనిషిని అడిగారా? ఈ కసవుని మీరు వాకిట్లో బకెట్లో పెడితే 'తడిచెత్త, పొడిచెత్త' వాడు తీసికెళ్లిపోయాడేమో అడిగారా?"అన్నాను,

వాకిట్లోకి నన్ను పిలిచి సూర్యారావు, "అడిగాం కృష్ణా! అందర్నీ అడిగాం. 'తడిచెత్త, పొడిచెత్త' వాడితో "నీకు మంచి బహుమతి ఇస్తాం" అని కూడా అన్నాము. ప్చ్, ఫలితం లేదు!.. అయితే ఒకరోజు పొద్దున్న నేను వాకిట్లో నుంచునుండగా దారినపోయే దానమ్మ ఎవరో ఒకావిడ వచ్చి "సార్, మా పిల్ల పూలకి ఏడుస్తోంది. మీ దొడ్లో పూలున్నాయంటగా. కాసినివ్వగలరా?" అని నన్నడిగింది. నేను దొడ్లో పడి ఉన్న నిర్మాల్యం తీసికెళ్లి ఆమె దోసిట్లో పోసాను. అందులోగాని ఆ ప్రతిమ వెళ్ళిపోయిందేమో. అప్పుడు జయమ్మ తాజా పూలతో ఇంట్లో పూజ చేసు కుంటోంది. కనుక ఆవిడకి ఈ విషయం నేను తెలియ నివ్వలేదు. నువ్వు కూడా నీ లోపలే ఉంచుకో."

వంట చేస్తున్న కుర్రాడి మీద అనవసరంగా జయమ్మ "నీకు బుద్ధిలేదురా. స్వామిని వెతికి పెట్టలేవు? అన్నం ముందా? దేవుడు ముందా?" అంటోంది.

నాకర్థమైంది? ఆవిడకి బి.పి.వచ్చేసింది!



నేనూ సూర్యారావూ కలిసి ఆవిణ్ణి బలవంతంగా డాక్టర్ దగ్గరికి ఇంచుమించు ఈడ్చికెళ్లాం!

ఆవిడ బి.పి.కౌంటు 270 ఉంది! డాక్టరే అదిరిపోయాడు? "యాభై ఏళ్లకి ఇంత రాకూడదండీ" అన్నాడు.

అరగంట అరగంటకి గ్లైకోమెట్, టెల్మిసార్, లాంక్టస్ – వగైరా వగైరా బిళ్లలూ ఇంజక్షన్లూ ఇవ్వటం మొదలుపెట్టారు. ఉదయం పదిగంటలకు వెళ్లిన వాళ్లం సాయంకాలం ఐదింటికి ఆవిడ బి.పి. 170కి వచ్చింది. డాక్టర్, "ఇంక పర్వాలేదు. ఈ మందులే జాగర్తగా వాడండి. బి.పి. బాగా పెరిగితే పెరాలిసిస్ లోకి దింపుతుంది. జాగర్త మళ్లీ రేపొచ్చి చెప్పండి" అన్నాడు.

ఇంటికి వచ్చాం. జయమ్మకి వంట్లో నీరసం వచ్చేసింది. కళ్లుమూసుకుని పడుకుండిపోయింది. కళ్లు తెరిచినప్పుడల్లా "ఏడే నా స్వామి వచ్చాడా?" నా మనవణ్ణి తెచ్చాడా?... రాడండి బాబూ, పాపిష్ఠిదాన్ని. ఎన్ని కడుపులు కొట్టానో, ఎన్ని జన్మల్లో కొట్టానో, దేవుడా, దేవుడా నన్ను తీసికెళ్లిపో...." అంటూ కొంత ఏడుపూ, కొంత మగత.

నేను నా భార్యకి ఫోన్‌చేసి "నేను సూర్యారావు ఇంట్లోనే ఉండిపోతున్నా"నని చెప్పాను. బార్లీ జావ పెట్టి జయమ్మకిచ్చాను. డాక్టరిచ్చిన నిద్రమాత్రలు కూడా అయ్యినయ్యి. జయమ్మ నిద్రలోకి జారుకుంది.

* * *

సూర్యారావు నాతో అన్నాడు,"మాకున్నది ఒక్కడే. వాడికి పెళ్లయ్యి ఎనిమిదేళ్లయ్యింది. అయిదేళ్లు అందరం ఓపిక పట్టాం. కానీ మూడేళ్లబట్టే మా కోడలికీ, మా ఆవిడకీ పెరపెర మొదలైంది. ఆంధ్రలో మోపిదేవి, కర్ణాటకలో కుక్కే, తమిళనాడులో తిరుచెందూర్ – ఇట్లా తిరగని సుబ్రహ్మణ్య క్షేత్రం లేదు. చెయ్యని పూజ లేదు. కొడుకులో వచ్చే సూర్యకాంతి తనింట్లో వెలగాలని మా కోడలు కోరుకుంటూంటే, వంశోద్ధారకుడై రేపు తనకు పిండోదకాలు వదిలే వాడొచ్చి తన భుజాలు తొక్కాలని మా ఆవిడ కోరుకుంటోంది. దాని కోసమే, ఎవరో స్వామీజీ ఇచ్చిన నాగప్రతిమని తెచ్చిపెట్టుకుని రోజూ పూజ చేసుకుం టోంది. నేనూ అప్పుడప్పుడు చేస్తూంటాననుకో. నలుగురు కుర్రాళ్లకి అన్నం పెడితే మంచిదని ఎవరో చెప్పారుట. ఇంకేం, నా చేత ఈ హాస్టల్ తెరిపించింది. నాకూ ఆ లక్షణాలు కొన్ని ఉన్నాయి గదా? నీ దగ్గర్నుంచి నేర్చుకున్నావ్?!...."

"నేను నీకేం నేర్పాను. నేను ప్రిన్సిపాల్ అయినప్పుడు నువ్వు లెక్చరర్‌వేగా?" వాళ్లల్లో నేనొకడిని! పరీక్ష ఫీజు కట్టలేనివాళ్లకి ఎంతమందికి నువ్వు కట్టావో. బెంచీలు బాగు చేయించావో. నీ అటెండర్‌కి కాలు విరిగితే వారం రోజుల్లో మళ్లీ హెడ్గేవార్ వగైరా పేర్లు ఎత్తినప్పుడు నిన్ను ఆడిపోసు కోటానికి ఎవరికీ నోరు పెగల్లేదు?... ఎంక్వైరీకి

వచ్చిన ఆర్‌జెడి కూడా, నీ మీద ఆయనకొచ్చిన నాకు కంప్లెయింట్‌ని మాముందరే చించిపారేసి వెళ్లిపోయాడు!.... అదుగో అదే నువ్వు నాకు నేర్పావు! లోకం కోసం బతకడం నేర్పావు! అదే! అందుకని నేను నా భార్యకు సహకరిస్తున్నాను"

"ఆవిడ వండిపెట్టే పప్పూ, అన్నమే వీళ్లకు పరమాన్నం తెలుసా? ఎందుకంటే, వాళ్ల గ్రామాల్లో వాళ్లకి అంబలి తప్ప మరేమీ తెలీదు, దొరకదు!"

నేనన్నాను, "ఏదో చెప్పావు, ఇంటెగ్రల్ హ్యూమనిజం మీద దీనదయాళ్ చెప్పినట్టు!"

సూర్యారావు నవ్వాడు. మేం వెళ్లిచూసాం. జయమ్మ గాఢని ద్రలో ఉంది!

* * *

తెల్లవారింది. సూర్యారావు కాఫీ పెట్టాడు. జయమ్మ లేచి తాగింది. ఆ బలహీనంలోనే మళ్లీ కర్రపుచ్చుకుని వెళ్లి దొడ్లో కెలకటం మొదలుపెట్టింది. "ఒరేయ్ శివా రారా!" అంది. వాడొచ్చాడు. వాడూ కెలకటం మొదలుపెట్టారు.

నేనూ సూర్యారావు చూస్తూ ఉండిపోయాం. నేను నా ఇంటికొచ్చేశాను.

* * *

పబ్లిక్ పరీక్షలొచ్చేసినయ్యి.

నాలుగురోజుల తర్వాత నేను మళ్లీ వెళ్లాను. జయమ్మ అదే బలహీనంతో ఉంది. వంట చెయ్యలేక పోతోంది. సూర్యారావు వంట మనిషిని పెట్టాడు.

జయమ్మ కార్యక్రమం, పొద్దున, మధ్యాహ్నం, సాయంత్రం అదే కర్రతో అదే పనిగా ఆ పూల దొడ్డిని కెలుకుతూండటమే. పరీక్షల మూలంగా కుర్రాళ్లు ఆమె దగ్గరకు రావటం మానేసారు.

జయమ్మ నోట దుర్వాక్యాలు రావట్లేదుగాని, చాలా కుంగిపోయిందని మాత్రం తెలుస్తోంది. దొడ్లో కెలకటం అయ్యాక వెళ్లి పూజామందిరం ఎదురుగా కూర్చోవటం లేదా, అక్కడే పడుకోవటం!

నాకే ఆలోచనొచ్చాయి. 'దేవుడంటే ఇంతమందిని ఇట్లా, తన చుట్టూ, ఎప్పుడూ ఏపనీ చేసుకోనివ్వ కుండా తిప్పుకునే శక్తా? మనిషి ఏమీ చెయ్యలేనప్పుడు తనే ఏదో ఒకటి చెయ్యొచ్చుగదా! కనీసం అప్పుడైనా నాలాంటివాళ్లు కొబ్బరి కాయలు కొడతారు గదా!.... అసలు నేనే ఇప్పుడు ఏదో ఏం చెయ్యకూడదు?'

* * *

ఏప్రిల్ నెలలో కుర్రాళ్లు ఒక్కొక్కొళ్లూ వాళ్ల గ్రామాలకు వెళ్లిపోవడం మొదలుపెట్టారు. ఏప్రిల్ 20న పది పబ్లిక్ ఆఖరు పరీక్ష రాసి శివ కూడా వెళ్లిపోయాడు.

ఏప్రిల్ 22న సూర్యారావు నాకు ఫోన్ చేసి. "కృష్ణా! దేవుడు దొరికాడోయ్, జయమ్మ ఏనుగు నెక్కిపోతోంది. రా, రా!"అని చెప్పాడు.

అంతకన్నా ఆశ్చర్యంగా నేను, "అమోఘం! అద్భుతం! వస్తున్నా"

నేను లోపలికి అడుగుపెట్టానో లేదో జయమ్మ ఎగురుకుంటూ వచ్చినా చేయ్యి పట్టుకుని, "నా దేవుడు వచ్చాడన్నయ్యగారూ! వచ్చాడు, వచ్చాడు. ఇదిగో!" అంటూ నన్ను బరబరా మందిరం దగ్గరికి లాక్కెళ్లి చూపించింది. లోపల కొంచెం మకిలి పట్టిన సుబ్రహ్మణేశ్వరస్వామి పడగ, పూవులతో నిండి ఉంది.

"ఎంత అదృష్టవంతురాలవమ్మా!, నీ భక్తి, నీ పూజ, నిన్ను కాపాడాయి!" అని, వాళ్లకి స్వీట్లు ఇచ్చి వచ్చేసాను.

మర్నాడు ఆ దంపతులు ఇద్దరూ విజయవాడ దగ్గరనున్న సుబ్రహ్మణేశ్వర స్వామికి అభిషేకం చేయించుకొని వచ్చారుట, సూర్యారావు చెప్పాడు.

మే వచ్చింది. మళ్లీ సూర్యారావు ఫోన్. నేను వెళ్లాను.

"ఒక పెద్ద శుభవార్త. మా కోడలికి మూడో నెల వచ్చిందని డాక్టర్ చెప్పిందట. ఈ పొద్దున్నే మా అబ్బాయి ఫోన్ చేశాడు. అంతే, మొహం కూడా కడుక్కోకుండా జయమ్మ కట్టుబట్టల్తో హైద్రాబాద్ వెళ్లిపోయిందయ్యా!" సూర్యారావు చెప్పాడు.

మేమిద్దరం కౌగలించుకున్నాం. కాస్సేపు మాటలయ్యాక సూర్యారావు అన్నాడు, "చూడు, ఆ కుర్రాళ్లు గది తుడుస్తూంటే ఈ బిల్లు దొరికిందే మిటి?... బంగారం షాపు- వెండివస్తువు - వెయ్యి రూపాయలు- కొన్నవాడు శివ-తేదీ 20 ఏప్రిల్ ఏమిటిది? అన్నట్టు 20 ఏప్రిల్ శ్రీరామనవమి. ఆ రోజు సాయంత్రం బంగారం కొట్లో నువ్వూ శివా కనిపించినట్టు నాకు జ్ఞాపకం వస్తోంది. ఆ రాత్రే టిక్కెట్టుకు డబ్బులు నా దగ్గర తీసికెళ్లినవాడు సాయంత్రం బంగారం కొట్లో కనిపించటమేమిటి? పక్కన నువ్వుండటమేమిటి?... ఆఁ, అవును, జయమ్మకి సుబ్రహ్మణ్య ప్రతిమ, చుక్కలమల్లె మొక్క మొదట్లో కొమ్మల మధ్య దొరికినది ఏప్రిల్ 22నే కదా!...ఆఁ, ఏదో జరిగిపోయింది... నిజం చెప్పు... ఏం జరిగింది?"

నేను సాదాసీదాగా కుర్చీలో వెనక్కి వాలి కూర్చుని అన్నాను. "అవును, సూర్యం, మోసం జరిగింది! నేనే ఆ నాగప్రతిమని శివకు కొనిచ్చి ఆ మొక్కలో పెట్టమన్నాను. నేను మీ దంపతుల్ని మోసం చేశాను. నాకు ఎంత పాపం వస్తుందో, ఏం శిక్ష వేస్తావో వెయ్యి!.. అన్నట్టు శివ ఇంటర్‌కు వెళ్లిపోతాడు. నీకు ఇంక దొరకడు. నాకే వెయ్యి!"

సూర్యారావు నవ్వి, "ఏమిటీ ఎంతమందికి ఆత్మవిశ్వాసం నేర్పిన నువ్వే ఇట్లా మాట్లాడు తున్నావా?... లోకంలోని జీవుల్ని ఆ ఈశ్వరుడిలో ఐక్యం చేసేందుకే, అట్లాంటి జీవితం జీవించటం కోసమే, 'కృణ్వంతో విశ్వం ఆర్యమ్' అంటూ మనం పుట్టాం. నువ్వు చేసిన పనివల్ల జయమ్మ తిరిగి మామూలు మనిషయ్యింది. మోసం అయినా, అది పుణ్యమే! పరోపకారమే పుణ్యం. పరాపకారమే పాపం!"

"మరి నువ్వు ఆ దానమ్మకు ఆ పాతప్రతిమను ఇచ్చెయ్యటం?"

"అదీ పరోపకారమే. పుణ్యమే... అయితే జయమ్మకు చెప్పి చెయ్యాల్సింది. నాకూ తెలినీ పొరబాటు అది!.. అయినా నువ్వు ఇంత చర్చించటమేమిటి?... సరే, మేం వచ్చేవారం అంతా కలిసి పళదామనుకుంటున్నాం, మీ దంపతులు కూడా రండి!"

"సారీ సూర్యారావు, రేపు మా అబ్బాయీ పిల్లలూ వస్తున్నారట. రాలేను."

* * *

ఇట్లా పాపం - పుణ్యం చర్చ జరిగిన తర్వాత సూర్యారావుకు మనవడు కలిగిన తర్వాత, నాక్కూడా - అప్పుడప్పుడు రెండు తులసీదళాలు ఆంజనేయ స్వామికి వెయ్యటం కూడా మంచిదేమో అనిపించ సాగింది! ★






అరుణ

**వరుస పరాజయాలతో ప్రయాణం చేస్తున్న యువ కథానాయకుడు విశ్వక్‌సేన్ ఈసారి బిగ్ డీల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'దాస్ కా ధమ్కీ'లో ద్విపాత్రాభినయం చేశాడు. అందులో ఒకటి పాజిటివ్ క్యారెక్టర్ కాగా మరొకటి నెగెటివ్. అంతేకాదు.. ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేశాడు. బెజవాడ ప్రసన్న కుమార్ కథను అందించిన ఈ సినిమా ధమ్కీ ఎవరికి ఇచ్చిందో చూద్దాం.**



# ప్రేక్షకులకు DAS KA DHAMKI

క్యాన్సర్ ఫ్రీ వరల్డ్ కోసం కృషి చేస్తున్న ఎస్.ఆర్. ఫార్మా కంపెనీకి ఊహించని దెబ్బ తగులుతుంది. ఆ ఫార్ములాను కనిపెట్టి జనంలోని తీసుకురావడం కోసం దాని సి.ఇ.ఒ. డాక్టర్ సంజయ్ రుద్ర (విశ్వక్‌సేన్) తీవ్రంగా శ్రమిస్తుంటాడు. అతనితో ధనుంజయ్ (అజయ్) అనే బిజినెస్ మాగ్నెట్ పదివేల కోట్లతో డీల్ చేసుకుంటాడు. అంతా సజావుగా సాగిపోయి, మందు మార్కెట్‌లోకి వచ్చే సమయంలో సంజయ్ యాక్సిడెంట్‌లో చనిపోతాడు. అతని బాబాయ్ (రావు రమేశ్)కి ఈ కంపెనీని, కుటుంబాన్ని ఎలా ఈ ఉపద్రవం నుండి బయట పడేయాలో అర్థం కాకుండా ఉంటుంది. ఇదిలా ఉంటే మరో వైపు అనాథ అయిన కృష్ణ దాస్ (విశ్వక్‌సేన్) స్టార్ హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తుంటాడు. కీర్తి (నివేతా పేతురాజ్) అనే అమ్మాయిని ఓ పోకిరి నుండి కాపాడటంతో ఆమె అతనితో ప్రేమలో పడుతుంది. అయితే దాస్ వెయిటర్ అనే విషయం ఆమెకు తెలియదు. అతనే ఎస్.ఆర్. ఫార్మాస్యూటికల్ అధినేత సంజయ్ రుద్ర అని భ్రమిస్తుంది. కొద్దిరోజుల తర్వాత దాస్ అసలు స్వరూపం తెలుసుకుని అతనితో తెగదెంపులు చేసుకుంటుంది. ఇదే సమయంలో సంజయ్ రుద్ర బాబాయ్ దాస్‌ను చూసి, తన అన్నకొడుకుగా కొద్దిరోజులు నటించమని ప్రాధేయ పడతాడు. డబ్బులకు ఆశపడి దాస్ అందుకు అంగీకరిస్తాడు. కోటీశ్వరుడైన సంజయ్ రుద్ర గెటప్‌లో దాస్ అతని భవంతిలోకి, ఫార్మా కంపెనీలోకి అడుగుపెడతాడు. అక్కడ అతనికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి అన్నదే మిగతా కథ.

ఇలాంటి కథలు మనకు కొత్త కాదు. ఇటీవలి కాలంలో కూడా చాలానే వచ్చాయి. ఇప్పటికి ఐదారు సినిమాలు చేసిన విశ్వక్‌సేన్‌కు ఇది కొత్త కావచ్చునేమో కానీ పరమ పాత చింతకాయ పచ్చడి ఇది. అయితే బెజవాడ ప్రసన్న కుమార్ ఇచ్చిన కథకు విశ్వక్ సేన్ తన బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా సంభాషణలు రాసుకున్నాడు. చిత్రానువాదం కూడా అతనిదే. సినిమా ప్రథమార్ధం మొత్తం వెయిటర్ దాస్, కీర్తి మధ్య ప్రేమాయణంతో సాగిపోతుంది. ఇంటర్వెల్ ముందు దాస్ అసలు రంగు బయటపడటం, అతను సంజయ్ రుద్ర పాత్రలోకి ఎంటర్ కావడం కాస్తంత ఆసక్తిని కలిగిస్తుంది.

నిజానికి ఈ సినిమాలో అసలు కథంతా ద్వితీయార్థంలోనే ఉంది. ప్రేక్షకుల ఊహకు అందని ట్విస్ట్‌లతో దర్శకుడు దీన్ని రకరకాల మలుపులు తిప్పాడు. దర్శకుడు, నిర్మాత కూడా విశ్వక్‌సేన్ కావడం బాగా ఉపయోగపడింది. ఇటు దాస్‌గా, అటు సంజయ్ రుద్రగా ద్విపాత్రాభినయం చేస్తూ చెలరేగిపోయాడు. అతనికి అడ్డు చెప్పేవాళ్లు లేకుండా పోయారు. దాంతో చాలా సీన్స్ ఎక్స్‌ట్రీమ్ లెవల్‌కు వెళ్లిపోయాయి. అవసరమైన దానికి మించిన వయొలెన్స్‌ను పెట్టేశారు. అసలు సంజయ్ రుద్ర పాత్ర ఎందుకు అలా ప్రవర్తిస్తుందో ఆడియెన్స్‌కు అర్థం కాదు. అంత మెంటల్ టార్చర్ పెట్టే వ్యక్తితో బాబాయ్, ప్రియురాలు, ఫ్యామిలీ మొత్తం విదేశాలకు వెళ్లడానికి సిద్ధపడటం అనేది చిత్రంగా అనిపిస్తుంది. అదేదో ఫ్యామిలీ ప్యాకేజీలా... అతను వ్యవహరించడం అర్థం లేనిది. దీనికి తోడు అమ్మకాని అమ్మతో దాస్‌కు పెట్టిన మదర్ సెంటిమెంట్ ఏ మాత్రం ఆకట్టుకోదు. తనను మోసం చేసిన ప్రియురాలిని అతనూ అదే విధంగా మోసం చేయడం సమంజసంగా అనిపించదు. టైటిల్ జస్టిఫికేషన్ కోసం దాస్‌తో ఇతర పాత్రలకు ధమ్కీ ఇప్పించినా, విశ్వక్‌సేన్‌లోని దర్శకుడు ఆ విషయంలోనూ సంతృప్తి చెందలేదు. అందుకే సంజయ్ రుద్ర పాత్రకు ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ పెట్టి, దీనికి సీక్వెల్ ఉన్నట్టు తెలిపారు.

విశ్వక్‌సేన్ చక్కని నటుడు, కానీ అతన్ని కంట్రోల్ చేసే మంచి దర్శకుడు ఉండాలి. అది ఈ సినిమాలో కొరవడింది. నివేతా పేతురాజ్ ఎప్పటిలానే తనదైన శైలిలో నటించింది. ఇక రావు రమేశ్, అజయ్, రోహిణి, మధుసూదన్ గౌడ్, అక్షరగౌడ్, సూర్య, అమిత్ శర్మ, హైపర్ ఆది, మహేశ్ వీళ్లంతా వాళ్ల పాత్రలు అలా చేసుకుంటూ వెళ్లారు. అంతే తప్ప ఎవరూ తమదైన ముద్రను వేయలేదు. పాత్రోచితం సాకుతో హీరో చెప్పిన చాలా సంభాషణలకు మ్యూట్ పడింది. అలానే వయొలెన్స్ సీన్స్‌లో కొన్ని చోట్ల సెన్సార్ నిబంధనలను దర్శక నిర్మాతలు పాటించినట్టుగా అనిపించలేదు. విశ్వక్‌సేన్ తొలిసారి దర్శకత్వం వహించిన 'ఫలక్‌నుమా దాస్' మలయాళ రీమేక్ కాబట్టి అక్కడ పోల్చుకోవడానికి, బేరీజు వేసుకోవడానికి ఎదురుగా ఓ ప్రాడక్ట్ ఉంది. కానీ ఇది స్ట్రయిట్ సినిమా కావడంతో బాలెన్స్‌గా పోతున్నామా? లేదా? అని చెక్ చేసుకోవడానికి ఎదురుగా ఏమీలేదు. దాంతో అంతా ఒంటెత్తుపోకడ వ్యవహారంగా మారిపోయింది. సొంత సినిమాను, అదీ పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలనుకున్నప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలి!? అవేవి ఇందులో కనిపించవు. బాధాకరం ఏమంటే... ఇలాంటి రొటీన్ స్టోరీలు తెలుగు నుండి పాన్ ఇండియా స్థాయిలో విడుదల అవుతుంటే... నిదానంగా ఆ క్రేజ్ పడిపోతుంది. దాంతో దీని తర్వాత వచ్చే పాన్ ఇండియా తెలుగు సినిమాలకు ట్రేడ్‌లో ఎదురీత తప్పదు. ఎందుకంటే.. ఈ సినిమా తర్వాత మరో ఐదు తెలుగు సినిమాలు వారానికి ఒకటి చొప్పున పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్నాయి. వాటి పరిస్థితి ఏమిటో!?

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

## గంగవరంలో ఉగాది ఉత్సవం



**వికారాబాద్ :** మార్చి 21న వికారాబాద్‌లో జరిగిన ఉగాది ఉత్సవంలో ప్రసంగిస్తున్న అఖిల భారతీయ కార్యకారిణి సభ్యులు భాగయ్య. వేదికపై ప్రాంత సహ సంఘచాలక్ సుందర్‌రెడ్డి, ముఖ్యఅతిథి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంఘచాలక్ సత్యనారాయణ గౌడ్. కార్యక్రమంలో 250 మంది గణవేష్‌ధారి స్వయంసేవకులు, 578 మంది పురప్రముఖులు భాగస్వాములయ్యారు. ఉత్సవానికి ముందు పథసంచలన్ జరిగింది. మార్చి 22, ఉగాది నాడు వికారాబాద్ మండలం కోతగడి గ్రామంలో 60మంది రైతులతో జరిగిన భూసుపోషణ కార్యక్రమంలో భాగయ్య, ప్రాంత ప్రచారక్ శ్రీధర్, విభాగ్ ప్రచారక్ శివకుమార్ పాల్గొన్నారు.



## పోస్ట్‌మాన్‌లకు సన్మానం



**జగిత్యాల :** మార్చి 22న జరిగిన జగిత్యాల ఉగాది ఉత్సవానికి ముఖ్యఅతిథిగా జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ రవీందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి వారపత్రిక ఆధ్వర్యంలో జిల్లా సంఘచాలక్ డా॥ బి.శంకర్, సహ సంఘచాలక్ డా॥శ్రీనివాస్ రెడ్డి పోస్టుమాన్‌లకు సన్మానం చేశారు.

## శారీరక్ ఉత్సవం





**ఇందూరు:** ఇందూరు శారీరక ఉత్సవం మార్చి 26న ఐ.టి.ఐ గ్రౌండ్‌లో జరిగింది. వేదికపై ముఖ్య అతిథి ప్రముఖ వైద్యులు కె. విశ్వ



తేజ, జిల్లా సంఘచాలక్ కాపర్తి గురుచరణం. ముఖ్యవక్తగా తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శారీరక్ ప్రదర్శనలలో పాల్గొన్న 210మందితో కలిపి 410మంది గణవేషధారి స్వయం సేవకులు, 680మంది మహిళలు, పురుషులు హాజరయ్యారు.



**నిర్మల్ :** నిర్మల్, ప్రియదర్శినగర్ బస్తీలోని అరవిందశాఖ 20వ వార్షికోత్సవం మార్చి 26న జరిగింది. ముఖ్య అతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ కటకం మురళి, ముఖ్య వక్తగా జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీలోని మహిళలు, పురుషులు 206 మంది, గణవేష్‌లో 40మంది స్వయం సేవకులు పాల్గొన్నారు. స్వయంసేవకుల శారీరక్ ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

## అరవింద శాఖ వార్షికోత్సవం








## కర్నూలులో నగర సాంఘిక్

**కర్నూల్:** మార్చి 26న కర్నూల్, మాంటిస్సోరి స్కూల్‌లో జరిగిన నగర సాంఘిక్‌లో స్వయంసేవకులకు మార్గదర్శనం చేస్తున్న సహ సర్‌కార్యవాహ ముకుంద. వేదికపై సహ క్షేత్రసంఘచాలక్ దూసి రామకృష్ణ, జిల్లా సంఘచాలక్ ఎన్.వి.ఎస్.గుప్త. ఈ కార్యక్రమంలో 680మంది గణవేషధారి స్వయంసేవకులు పాల్గొన్నారు.



## ఉగాది ఉత్సవాలు




### నెల్లూరులో...



**నెల్లూరు :** నెల్లూరు నగరంలో మార్చి 22న శోభకృత్ ఉగాది ఉత్సవం సందర్భంగా పథ సంచలన్ జరిగింది. ఆ తరువాత వి.ఆర్.హైస్కూల్ గ్రౌండ్‌లో ఉగాది ఉత్సవంలో వేదికపై ప్రాంతప్రచారక్ ఆదిత్య, ప్రాంత సంఘచాలక్ హరికుమార్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు సునీల్‌కుమార్, నగర సంఘచాలక్ సి.వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. పథసంచలన్‌లో 773, ఉత్సవంలో 869 మంది స్వయంసేవకులు పాల్గొన్నారు.

### పీలేరులో...





**పీలేరు :** అన్నమయ్య జిల్లా పీలేరులో మార్చి 22న ఉగాది సందర్భంగా పథసంచలన్ జరిగింది. తరువాత జరిగిన ఉగాది ఉత్సవంలో ప్రసంగిస్తున్న ప్రాంత కార్యవాహ వేణుగోపాల నాయుడు. పథసంచలన్ సంఖ్య 120, కార్యక్రమంలో పాల్గొన్నవారు 152.



### గుంతకల్‌లో ...



**గుంతకల్ :** అనంతపురం జిల్లా, గుంతకల్ మార్చి 22న జరిగిన ఉగాది ఉత్సవం వేదికపై ప్రాంత కార్యకారిణి సభ్యులు ఓలేటి సత్యనారాయణ, నగర కార్యవాహ జయపాల్ రెడ్డి, జిల్లా సహ సంఘచాలక్ జగదీష్ గుప్త. 556 మంది స్వయంసేవకులు కుటుంబాలతో కలిసి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.




## తెలుసుకుందాం

# బొంతపల్లి అయ్యప్పస్వామి ఆలయం



తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మండలం, బొంతపల్లి గ్రామంలో అయ్యప్పస్వామి కొలువై ఉన్న దేవాలయమిది. శబరిగిరిలో ఉన్న అయ్యప్పస్వామి మూలవిరాట్టును పోలిన స్వామి విగ్రహాన్ని ఈ దేవాలయంలో ప్రతిష్ఠించారు. ఈ ప్రాంగణంలో సాయిబాబ, శరభలింగేశ్వరస్వామి, నవగ్రహాలు, అభయాంజనేయ స్వామి, బొంతపల్లి భద్రకాళీసమేత వీరభద్రస్వామి తదితర ఉపాలయాలున్నాయి. మండల దీక్షలు చేపట్టిన స్వామి భక్తులు కార్తికమాసంలో ఇక్కడికి వచ్చి ఇరుముడులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

## కథ | వంక - వాత



పూర్వం దత్తపురంలో విపులుడనే యువకుడు ప్రతి చిన్న విషయానికి వంకలెడుతూ, అందరినీ వేధిస్తుండేవాడు.

అతని బాధ పడలేక ఆ దేవుడే వీడికి సరైన గుణపాఠం నేర్పాలని అతని బాధితులు కోరుకునేవారు.

ఒకరోజు పని మీద పక్క గ్రామానికి వెళుతూ మార్గ మధ్యంలో ఒక మహావృక్షం చూసుకొని ఆ నీడన కాసింత నడుం వాల్చాడు విపులుడు.

పైకి చూస్తున్న ఆ వంకలరాయుడికి ఏదో స్ఫురించింది.

చెట్టుకాయలు చిన్నగా ఉన్నాయి.

'హే భగవాన్! ఇంతటి మహావృక్షానికి ఇంత చిన్నకాయలా? చెట్టుకి తగ్గ కాయలు ఉండొద్దూ, ఇదేం వింత సృష్టి!' అన్నాడు.

ఇంతలో అశరీరవాణి పలికింది.

'విపులా! నీ సందేహం తీరుస్తాను. ఇప్పుడు చూడు' అంది.

ఆశ్చర్యంగా చెట్టుకాయలు పెద్దవయిపోయాయి.

విపులుడు తృప్తిగా తల పంకించి 'ఇప్పుడు బావుంది. సహేతుకంగా ఉంది!' అని ఆ వృక్షపు చల్లదనానికి హాయిగా నిద్రలోకి

## పద్యము

**కూరిమిగల దినములలో**
**నేరములెన్నడును గలుగనేరవు మరి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోచుచుండ నిక్కము సుమతీ!**

**భావం :** ఓ సుమతీ! స్నేహము బాగుగా ఉన్న రోజులలో ఆ స్నేహితులకు ఒకరు చేసిన పనులలో మరొకరికి తప్పులు కనిపించవు. అదే స్నేహితులకు విరోధము వచ్చినపుడు ఒకరి చేష్టలు మరొకరికి దోషములుగా కనిపించును అని భావం.

## సూక్తిరత్నం

**'నాస్తి జాగరతో భయమ్'**

**'పఠతో నాస్తి మూర్ఖత్వం జపతో నాస్తి పాతకమ్**
**మౌనేన కలహో నాస్తి, నాస్తి జాగరతో భయమ్'**

**భావం :** చదువు కోవడం వల్ల మూర్ఖత్వం ఉండదు. జపము వలన పాపం ఉండదు. మౌనం వహించిన వారికి కలహం ఉండదు. అప్రమత్తులు భయపడవలసిన అవసరం ఉండదు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| రాక్షసి | అంధకారం |
| రక్తం | వేడుక |
| చీకటి | రక్కసి |
| చందమామ | నెత్తురు |
| పండుగ | జాబిల్లి |

జవాబులు : రాక్షసి–రక్కసి, రక్తం–నెత్తురు, చీకటి–అంధకారం, చందమామ–జాబిల్లి, పండుగ–వేడుక

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### జానకీ దేవి బజాజ్



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు. ఈమె జనవరి 7, 1893న మధ్యప్రదేశ్‌లోని జాయోరాలో జన్మించారు. శాసనోల్లంఘన ఉద్యమంలో చురుగ్గా పాల్గొని జైలుశిక్ష కూడా అనుభవించారు. ఖాదీ ప్రచారం, గోసేవా, బలహీన వర్గాల అభివృద్ధి పాటుపడ్డారు. వినోబాభావేతో కలిసి భూదాన్ ఉద్యమంలో పనిచేసింది. ఈమె భర్త జమ్నాలాల్ కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. భారత ప్రభుత్వం జానకీదేవిని 1956లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది. మే 21, 1979న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో తొలి మహిళా ముఖ్యమంత్రి ఎవరు?
2. భారత సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
3. ఇటీవల సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ గమ్యస్థానం ఏది?

సమాధానాలు : 1. సుచేతా కృపలాని (ఉత్తరప్రదేశ్); 2. జస్టిస్ డీవై చంద్రచూడ్; 3. విశాఖపట్నం.



జారుకున్నాడు.

మాంచి నిద్రలో ఉండగా అతని మీద దబేలున ఏదో పడింది.

ఉలిక్కిపడి చూస్తే, పైన గాలికి చెట్టుకాయలు రాలి కింద పడుతున్నాయి. ఇంతకు ముందు కంటే అవి పెద్దగా ఉండటం వల్ల, మీద పడుతుంటే చెట్టుకింద విశ్రమించడం ప్రాణాంతకంగా మారింది.

విపులుడు చెట్టు కింద నుంచి పరుగెత్తి 'స్వామీ! నాకు బుద్ధి వచ్చింది. ఇక నుండి దేనికీ అనవసరంగా వంకలెంచను – చెట్టుకాయలు యధావిధిగా చెయ్యి స్వామీ!' అంటూ ప్రార్థించాడు.

చెట్టుకాయలు మామూలుగా మారిపోయాయి. ★

## మెదడుకు మేత

పచ్చని మేడ, తెల్లని గదులు, నల్లని దొరలు?

జవాబు : సీతాఫలం

## మంచిమాట

**గౌరవం లేని స్థానంలో ఉండటం కంటే మించిన అవమానం మరొకటి ఉండదు!**



# వారఫలాలు

03-09 ఏప్రిల్ 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆదాయం పెరుగుతుంది. ఆస్తి వివాదాల నుంచి బయట పడతారు. ఒక ఆహ్వానం సంతోషం కలిగిస్తుంది. వాహనాలు, గృహం కొనుగోలులో అవాంతరాలు. భాగస్వామ్య వ్యాపారాలు లాభి స్తాయి. ఉద్యోగులకు పనిఒత్తిడులు పెరుగుతాయి. పారిశ్రామికవర్గాలకు కొత్త చికాకులు. రచయితలు, కళాకారులకు మానసిక అశాంతి. 4, 5 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కొత్తగా అప్పులు చేస్తారు. దత్త స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

రాబడి పెరుగుతుంది. అంచనాలు నిజం కాగలవు. సోదరులు, స్నేహితులతో వివాదాలు సర్దుకుంటాయి. మర్చిపోలేని సంఘటన ఎదురు కావచ్చు. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు గందరగోళ పరిస్థితులు తొలగుతాయి. కళాకారులు, రాజకీయవేత్తలు, రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 3, 4 తేదీల్లో ప్రయాణాలు వాయిదా. శారీరక రుగ్మతలు. బంధు విరోధాలు. శివారాధన మంచిది.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

మొదట్లో ఇబ్బందులెదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. పరిస్థితులు అనుకూలిస్తాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలకు ఉత్సాహ వంతంగా ఉంటుంది. 6, 7 తేదీల్లో ధనవ్యయం. ఆరోగ్య భంగం. శివాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ముఖ్యమైన కార్యక్రమాల్లో ఆటంకాలు. ఇంటాబయటా ఒత్తిడులు. ఉద్యోగ ప్రయత్నాలు ముందుకు సాగవు. ఇంటి నిర్మాణాలు నిదానిస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు అంతగా లాభించవు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు. కళాకారులు, రచయితలు, క్రీడాకారులకు ఒత్తిడులు. 8, 9 తేదీల్లో శుభవర్తమానాలు. వాహనయోగం. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

వాహనాలు, ఆభరణాలు సమకూర్చుకుంటారు. నూతన ఉద్యోగ యత్నాలు సానుకూలం. వివాదాలు తీరతాయి. ఇంటి నిర్మాణ యత్నాల్లో స్వల్ప అవాంత రాలు. భాగస్వామ్య వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. కళాకారులు, రచయితలకు ఒత్తిడులు తొలగుతాయి. 5, 6 తేదీల్లో ధనవ్యయం. ఆరోగ్య సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కార్యక్రమాలు సజావుగా పూర్తికాగలవు. ఆదాయం సంతృప్తినిస్తుంది. జీవిత భాగస్వామి సలహాలు స్వీకరిస్తారు. మీ అంచనాలు, ఊహలు నిజం చేసుకుంటారు. ఇంటి నిర్మాణాలు, కొనుగోలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారాలు మెరుగుపడతాయి. ఉద్యోగాల్లో చికాకులు తొలగుతాయి. 3, 4 తేదీల్లో అనారోగ్యం, దూర ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

రావలసిన సొమ్ము అందుతుంది. శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆస్తి వివాదాలు తీరతాయి. మీలో దాగిన నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపారాలు క్రమేపీ వృద్ధి చెందుతారు. ఉద్యోగాలు సంతృప్తికరం. కళాకారులు, క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలకు కాస్త ఊరట లభిస్తుంది. 7, 8 తేదీల్లో వివాదాలు. మానసిక ఆందోళన. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆదాయం సంతృప్తినిస్తుంది. కార్యజయం. ఆస్తుల విషయంలో బంధువర్గంతో ఒప్పందాలు చేసుకుంటారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి. కొన్ని వివాదాలు సమర్థతతో పరిష్కరించుకుంటారు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది. కళాకారులు, క్రీడాకారులు, రాజకీయవేత్తలకు సమస్యలు తీరతాయి. 7, 8 తేదీల్లో వృథా ఖర్చులు. ఊహించని ప్రయాణాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆర్థిక విషయాలు ఆశాజనకం. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. అనుకున్న లక్ష్యాలు సాధి స్తారు. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన విషయాలు తెలు స్తాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయిత లకు ఊహించని అవకాశాలు. 3, 4 తేదీల్లో శ్రమా ధిక్యం. శారీరక రుగ్మతలు. గణేశాష్టకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

అనుకున్న పనుల్లో విజయం. ఆదాయం సంతృప్తికరం. రుణభారాలు తొలగుతాయి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారులకు పెట్టు బడులు సమకూరడంలో ఆటంకాలు తొలగుతాయి. ఉద్యోగాలలో కోరుకున్న మార్పులు. రాజకీయ వేత్తలు, కళాకారులు, రచయితలకు కీలక సమాచారం అందుతుంది. 4, 5 తేదీల్లో వృథా ఖర్చులు. దూర ప్రయాణాలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆదాయం ఆశాజనకం. దీర్ఘకాలిక సమస్యలు, వివాదాలు తీరతాయి. ఇంటి నిర్మాణాలు చురుగ్గా సాగుతాయి. నిలిచిపోయిన పనులు సైతం పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో ఆటుపోట్లు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు ఉత్సాహంగా గడుపు తారు. రచయితలకు ఆహ్వానాలు అందుతాయి. 6, 7 తేదీలలో శారీరక రుగ్మతలు. అనుకోని ప్రయాణాలు. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆర్థిక విషయాలు గందరగోళంగా ఉన్నా అవసరాలకు ఇబ్బంది ఉండదు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు. జీవిత భాగస్వామి సలహాలు పొందు తారు. ఆస్తుల వ్యవహారాలలో ఒప్పందాలు చేసుకుం టారు. దైవకార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారు లకు లాభాలు. ఉద్యోగులు సమస్యల నుంచి గట్టెక్కు తారు. 7,8 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో కొన్ని చికాకులు. లక్ష్మీస్తోత్రాలు పఠించండి. ★

# పదరసం-409

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | 2 | | 3 | ✠ | 4 | 5 | | 6 |
| 7 | ✠ | | ✠ | | ✠ | ✠ | | ✠ | |
| 8 | | ✠ | 9 | | | 10 | ✠ | 11 | |
| | ✠ | 12 | ✠ | | ✠ | 13 | | ✠ | |
| 14 | 15 | | ✠ | ✠ | ✠ | | ✠ | 16 | ✠ |
| ✠ | 17 | | | ✠ | 18 | | ✠ | 19 | 20 |
| 21 | ✠ | | ✠ | ✠ | ✠ | 22 | | ✠ | |
| 23 | | ✠ | 24 | | 25 | | ✠ | 26 | |
| | ✠ | 27 | ✠ | ✠ | | ✠ | 28 | ✠ | |
| 29 | | | | ✠ | 30 | | | | ✠ |

పదరసం - 409

పేరు : ..............................................................................................

చిరునామా:...........................................................................................

.........................................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ......................................................

## ఆధారాలు

**అడ్డం**

1. జనకుని కూతురు (4)
4. తెలుగునాట ప్రతి ఊరులోనూ వుండగల దేవాలయం (4)
8. నెమ్మది నడకల ప్రాణి (2)
9. భార్య తల్లి గౌరవ ప్రదంగా (4)
11. దిక్కు, కోరిక (2)
13. కృశించు, సంకటము (2)
14. వర్తమానము, సమాచారం (3)
17. మరాళములు (3)
18. యంత్రము (2)
19. మాసము (2)
22. జామునిశిలో యతి (2)
23. మాట, ఉక్తి (2)
24. శిరోవేష్టము, టర్బన్ (4)
26. ధూళి (2)
29. శ్రీరామనవమి పందిళ్లలో పానకం తోడిది (4)
30. సమైక్యభావంతో ఒకటి కావడం (4)

**నిలువు**

2. చంద్రుని భార్య (2)
3. ఆకాశము (4)
5. దండ (2)
6. మానవ శక్తికి తోడయ్యేది కర్మాగారాలలో (4)
7. పధ్నాలుగేళ్లు సీతారాములు చేసింది (4)
10. పదార్థాలు ఇలా వుంటేనే భోజనం తృప్తి! (6)
12. కోరుట, చెప్పుట (4)
15. శరీరము (2)
16. ఆకుల నరము (2)
20. రామానుజుడే! (4)
21. కన్నుల జత (4)
25. పరమాన్నమునకే వ్యవహారం (3)
27. కండోలము, వెదురుబద్దలతో అల్లినది
28. నడుము, మొల

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 ఏప్రిల్ 17 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.


## పదరసం - 405 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 త | లు | 2 పు | ✠ | 3 మా | ర్య | ✠ | 4 మా | రా | 5 ము |
| ను | ✠ | 6 రో | ద | న | ✠ | 7 సీ | పా | ✠ | కు |
| పు | ✠ | గా | ✠ | 8 న | 9 వ | త | రం | ✠ | రం |
| ✠ | 10 కా | మి | 11 తం | ✠ | ధు | ✠ | 12 భం | 13 గు | ✠ |
| 14 రా | గి | ✠ | 15 తి | 16 లా | పా | 17 పం | ✠ | 18 బి | 19 వి |
| 20 జీ | త | 21 ము | ✠ | వు | ✠ | డు | ✠ | ✠ | త్తు |
| ✠ | 22 ము | ద | 23 ము | ✠ | ✠ | ✠ | 24 గుం | 25 జ | ✠ |
| 26 భూ | ✠ | 27 రా | క | ✠ | 28 పం | 29 జా | ✠ | 30 లం | 31 క |
| 32 రు | 33 తి | ✠ | 34 నా | 35 సు | ✠ | 36 గో | 37 వా | ✠ | స్త |
| 38 హం | స | లు | ✠ | 39 వ | ఖ | ✠ | 40 స | స్త | య్యి |

**విజేతలు:** భూతం యాదగిరి, రుద్రభట్ల సుగుణ, కొనపురం లక్ష్మి, కన్నెకంటి సత్యప్రసాద్, వనమాల రామలింగాచారి, తుమ్మల శివశంకర్, జి. సీతామహాలక్ష్మి, టి.శ్రీలక్ష్మీనాగజ్యోతి, కె.వి.ఎస్.ఎన్.గణేశ్‌కుమార్, రాయవరపు శేషు, వారణాసి సరస్వతి, కె.సాయికిరణ్, డా.బి.ధన్వంతరి, శ్రీపాదచేతన, ఆర్.అంజనీదేవి, కె.ఎస్.ఎన్.మూర్తి, చింతకుంట దేవలక్ష్మి, సి.గిరిజాశంకరరావు, ఉడాలి భాస్కరయ్య, డా.శివరామయ్య, హరిత, టి.ఎస్.ఆర్.ఆంజనేయులు, కొన్నె ప్రశాంత, షేక్ షబ్బీర్, కొండుపర్తి కాంతామణి, పి.శాంతకుమారి, ఏ.గాయత్రి, బి.ఇందుశేఖర్, సిహెచ్.జ్యోతి, కె.సూర్యప్రభ, పి.సీతామహాలక్ష్మి,
**బహుమతి పొందిన విజేత: రోహన్‌వంశీ, నెల్లూరు జిల్లా**

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగుడ, హైదరాబాద్-27


బీజేపీ
ఆవిర్భావ దినోత్సవ
(ఏప్రిల్ 6)
శుభాకాంక్షలు
BJP
ఆలపాటి
లక్ష్మీనారాయణ
జూబ్లీహిల్స్ నియోజకవర్గం


పార్టీ కొరకు అహర్నిశలు పనిచేసిన
నాయకులు, కార్యకర్తలకు
భారతీయ జనతా పార్టీ
ఆవిర్భావ దినోత్సవ
(ఏప్రిల్ 6)
శుభాకాంక్షలు
భారతీయ జనతా పార్టీ
ఆంధ్రప్రదేశ్
apbjp.org | BJP4Andhra

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 24

अँधेरा हटेगा...
सूरज निकलेगा...
कमल खिलेगा...

చీకట్లు తొలగిపోతాయి...
సూర్యుడు ఉదయిస్తాడు...
కమలం వికసిస్తుంది...

06 ఏప్రిల్ 2023

జాతీయవాదాన్ని నరనరాన నింపుకొని దేశంకోసం, పార్టీకోసం, ప్రాణాలర్పించిన కార్యకర్తలను స్మరించుకుంటూ..

ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు కృషి సల్పిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, మద్దతుదారులందరికీ పేరుపేరునా

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

పోరెడ్డి కిషోర్ రెడ్డి
రాష్ట్ర అధికార ప్రతినిధి, భాజపా – తెలంగాణ